


RNI TELTEL/2024/89620

తెలంగాణ

# నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక




ప్రచురణ : తెలంగాణ | సంపుటి 01 | సంచిక 158 | సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు | పేజీలు - 08 | మంగళవారం - 28 - జులై - 2026 | వెల రూ. 5 /-

## ఎమ్మెల్యే యశస్విని రెడ్డిని విద్యాశాఖ మంత్రిని చెయ్యాలి

- బీజేపీ షాకింగ్ డిమాండ్!



- ఎన్నికల్లో పోటీ చేసే వయస్సుపై కాంగ్రెస్ ప్రతిపాదన అందుకే
- యువతపై చిత్తశుద్ధి ఉంటే ముందు ఈ పని చెయ్యండని సవాల్
- యువతకు, యూనివర్సిటీలకు ఇచ్చిన హామీల మాటేంటి?
- కాంగ్రెస్ యువ ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డిని మంత్రిని చెయ్యండి : బీజేపీ

▸▸2

## రుణమాఫీ నిధులు జమ చేయండి

-వ్యవసాయ శాఖకు హైకోర్టు ఆదేశం




- సాంకేతిక లోపంతో నిలిచిన రుణమాఫీ
- బాధితులకు ఊరటనిస్తూ హైకోర్టు కీలక ఆదేశాలు!
- రైతులకు వడ్డీతో సహా రుణమాఫీ అందించాలి
- అధికారులకు హైకోర్టు 2 వారాల గడువు!
- ఐఎఫ్ఎస్‌సీ కోడ్ మారడంతో నిలిచిన నిధులు
- కలెక్టర్, వ్యవసాయ అధికారులకు హైకోర్టు నోటీసులు!



# తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాలపై ఏఐసీసీ సీరియస్

**నేటి శుభోదయ, హైదరాబాద్ :** తెలంగాణ కాంగ్రెస్‌లో పెరుగుతున్న అంతర్గత సంక్షోభంపై ఏఐసీసీ అధిష్ఠానం తీవ్ర అసహనం వ్యక్తంచేసింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన వద్ద ఉన్న నివేదికను ఇవ్వబోగా, దానిని తీసుకోవడానికి కూడా ఏఐసీసీ నాయకత్వం ఇష్టపడలేదని విశ్వసనీయంగా తెలిసింది. 'మీ రిపోర్టు మాకు అవసరం లేదు. తెలంగాణలో ఏం జరుగుతున్నదో మా దగ్గర పూర్తి గ్రౌండ్ రిపోర్ట్ ఉన్నద'ని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రస్వరంతో అన్నట్టు తెలిసింది. పార్టీ ఒక దిశలో, ప్రభుత్వం మరో దిశలో పోతున్నదని అసహనం వ్యక్తంచేసినట్టు సమాచారం. మంత్రుల మధ్య సమన్వయం లేదని, ఎమ్మెల్యేలకు క్రమశిక్షణ లేదని అసంతృప్తి వ్యక్తంచేసినట్టు తెలిసింది. తెలంగాణలో వ్యక్తిగత ఎజెండాను అమలు చేస్తున్నారని, పార్టీ క్యాడర్‌ను కాపాడుకోవాల్సిన బాధ్యత తమపై ఉన్నదని, రాష్ట్రంలో ప్రక్షాళన చేయాల్సిన సమయం వచ్చిందని ఖర్గే తీవ్ర స్వరంతో అన్నట్టు తెలిసింది. సోమవారం ఢిల్లీలోని ఇందిరాభవన్‌లో నిర్వహించిన ఏఐసీ సీ సమావేశంలో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాలపై అధిష్ఠానం సీరియస్ అయినట్టు తెలిసింది.......

2

- పార్టీని పక్కకునెట్టి వ్యక్తిగత ఎజెండా అమలు చేస్తున్నారు
- దళిత ఎమ్మెల్యేలను ఎగదోస్తున్నది ఎవరో మాకు తెలుసు
- మంత్రులకు సమన్వయం, ఎమ్మెల్యేలకు క్రమశిక్షణ లేదు
- క్యాడర్‌ను వదిలేశారు.. కాపాడుకోవాల్సిన బాధ్యత మాది
- రాష్ట్ర నాయకత్వానికి ఢిల్లీలో కుండబద్దలు కొట్టిన పెద్దలు

## మా 'పెద్ది'ని ఎలాగైనా బతికించండి

- చేతులెత్తి వైద్యులకు విజ్ఞప్తి చేసిన కేసీఆర్



- ఐసీయూలో మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని చూసి చలించిన బీఆర్ఎస్ అధినేత
- చికిత్సపై యశోద డాక్టర్లతో వాకబు..
- బెస్ట్ ట్రీట్‌మెంట్ ఇస్తున్నామన్న వైద్యులు

**నేటి శుభోదయ, హైదరాబాద్ :** 'ఏం జేస్తరో చేయండి.. అత్యుత్తమ చికిత్స అందించండి.. దయచేసి మా 'పెద్ది' ప్రాణాలు కాపాడండి' అని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్.. యశోద హాస్పిటల్ వైద్యులకు విజ్ఞప్తిచేశారు. ఆదివారం ఉదయం తీవ్ర అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ సీనియర్ నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొనేందుకు సోమవారం సికింద్రాబాద్ యశోద దవాఖానకు వెళ్లారు. ఐసీయూలో బెడ్‌పై అచేతన స్థితిలో ఉన్న ఉద్యమ సహచరుడిని చూసి కేసీఆర్ చలించిపోయారు. కొంతసేపు మౌనంగా ఉన్నారు. అనంతరం వైద్యులతో కలిసి చికిత్స అందుతున్న తీరును పరిశీలించారు. డాక్టర్లతో మాట్లాడి వైద్యచికిత్సపై ఆరా తీశారు. ఎలాగైనా మా 'పెద్ది'ని బతికించండి అంటూ వైద్యులకు చేతులెత్తి నమస్కరించారు....

2

## హైడ్రా కమిషనర్ గా రంగనాథ్ ను తొలిగించండి

- హైకోర్టు సంచలన ఆదేశాలు..!!

**హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై వేటు!**
- హైకోర్టు సంచలన తీర్పు

**కోర్టు ఆదేశాల ధిక్కరణ**
- రంగనాథ్‌ను వెంటనే తొలగించాలని సిఎస్‌కు హైకోర్టు ఆదేశం

**క్షమాపణలు తిరస్కరించిన న్యాయస్థానం**
లోతుకుంట భూముల వ్యవహారంలో హైడ్రా సీఎస్ఆర్‌పై ఆగ్రహం

**పరిధి దాటిన చర్యలు, 63 ధిక్కరణ పిటిషన్లు**
- రంగనాథ్ స్థానంలో ఐజీ స్థాయి అధికారి నియామకానికి ఉత్తర్వులు

**హైడ్రా కమిషనర్ వర్సెస్ హైకోర్టు**
- ప్రైవేట్ భూముల జోక్యంపై న్యాయస్థానం తీవ్ర ఆగ్రహం



**నేటి శుభోదయ, హైదరాబాద్ :** హైకోర్టు సంచలన ఆదేశాలు ఇచ్చింది. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ను వెంటనే హైడ్రా కమిషనర్ పదవి నుంచి తప్పించాలని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. కోర్టు సూచన చేసినా అమలు చేయకపోవటం పైన హైకోర్టు సీరియస్ అయింది. హైడ్రా పరిధిని మించి ప్రైవేటు స్థలాల విషయాల్లో తీసుకుంటున్న నిర్ణయాల పైన అభ్యంతరం వ్యక్తం చేసింది. రంగనాథ్ స్థానంలో ఐజీ స్థాయి .....

▸▸2

## ఐఐటీ విద్యార్థికి కేటీఆర్ గిఫ్ట్




**నేటి శుభోదయ, హైదరాబాద్ :** బీఆర్ఎస్ వరింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ మరోసారి తన ఔదార్యం చాటుకున్నారు. గిఫ్ట్ ఏ స్మైల్ ద్వారా విద్యార్థులకు తన వంతు సహాయ, సహకారాలు అందిస్తూ ప్రోత్సహిస్తున్నారు. ఐఐటీ వారణాసిలో సీటు సాధించిన సిరిసిల్ల విద్యార్థి గడదాస్ అభినవ్ తన తల్లిదండ్రులు లక్ష్మీనారాయణ-శ్రీలతతో సోమవారం హైదరాబాద్‌లో కేటీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా అభినవ్‌ను కేటీఆర్ శాలువాతో ఘనంగా సతరించి ల్యాప్‌టాప్‌ను గిఫ్ట్ స్మైల్ కింద అందజేశారు. కళాశాల ఫీజు కూడా తానే చెల్లిస్తానని హామీ ఇచ్చారు. చకగా చదువుకొని తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలని, ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు.

## అడ్డదారులు తొక్కితే అధికారులకు జైలే

హైకోర్టు తీర్పు సీఎం రేవంత్‌రెడ్డికి చెంపపెట్టు - ఆర్ ఎస్ పి



- రూల్ బుక్ ప్రకారం ఉద్యోగం చేయాలి
- రంగనాథ్‌ను ఎప్పుడో అరెస్టు చేయాల్సింది
- కానీ, కోర్టు దయతో ఆయనను వదిలేసింది
- బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్పీ ధ్వజం

**నేటి శుభోదయ, హైదరాబాద్ :** పేదల ఇండ్లపై ప్రతాపం చూపేందుకు అధికారంలోకి వచ్చిన నెలలోపే 99 జీవో ద్వారా రేవంత్‌రెడ్డి హైడ్రాను ఏర్పాటు చేశారని, దానిపై హైకోర్టు తీర్పు రేవంత్‌రెడ్డికి చెంపపెట్టు లాంటిదని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి రాజ్యంలో 'మంచి' పోస్టింగ్‌ల కోసం అడ్డదారులు తొకితే చర్లపల్లి – చంచల్‌గూడ జైళ్లకే కొందరు అధికారులు పరిమితమయ్యే ప్రమాదం ఉన్నదని, అధికారులు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. రాష్ట్రంలో హైడ్రా వ్యవహారం, హైకోర్టు తీర్పు నేపథ్యంలో ఆయన తెలంగాణ భవన్‌లో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కార్‌పై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. హైడ్రా కమిషనర్‌ను వెంటనే తొలగించాలని హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను ....

2

## చేనేతపై జీఎస్టీ విధానాన్ని పునఃసమీక్షించండి

- ప్రధానికి చేనేత దినోత్సవ వ్యవస్థాపకుడు వెంకన్న లేఖ



**నేటి శుభోదయ, హైదరాబాద్ :** చేనేతపై అమలు చేస్తున్న జీఎస్టీ విధానాన్ని పునఃసమీక్షించాలని చేనేత దినోత్సవ వ్యవస్థాపకుడు యర్రమాద వెంకన్న డిమాండ్ చేశారు. ప్రధాని మోదీకి రాసిన లేఖను మీడియాకు సోమవారం విడుదల చేశారు. ఇప్పటికీ అధికశాతం చేనేత కళాకారుల ఆర్థిక పరిస్థితి అత్యంత దయనీయంగానే ఉన్నదని వాపోయారు. సంప్రదాయ చేనేతపై కూడా యాంత్రిక వస్త్ర పరిశ్రమతో సమానంగా జీఎస్టీ విధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## 31 నుంచి ఐసెట్ వెబ్ కౌన్సెలింగ్

▸▸2



## తెలుగు రాష్ట్రాల్లో కాక్రోచ్ జనతా పార్టీ టార్గెట్ ఫిక్స్

▸▸2



నేటి శుభోదయ

మంగళవారం | హైదరాబాద్
28 - 07 - 2026
www.netisubhodaya.com



# మా 'పెద్ది'ని ఎలాగైనా బతికించండి..

**మొదటిపేజీ తరువాయి..** ఆయన చేసిన విజ్ఞప్తికి వైద్యులు ఒక్కసారిగా ఖిన్నులయ్యారు. తప్పకుండా సార్.. అనుక్షణం పర్యవేక్షిస్తూ ప్రపంచస్థాయి చికిత్స అందిస్తున్నాం అని ప్రతిస్పందించారు. గుండె, ఊపిరితిత్తులు, మిగిలిన అవయవాలన్నీ సక్రమంగా పనిచేస్తున్నాయని, కొంత బ్రెయిన్ పునరుత్తేజం చెందాల్సి ఉన్నదని, అందుకు మరో 48గంటల సమయం పట్టే అవకాశం ఉన్నదని వివరించారు. అవసరం మేరకు అమెరికా సహా ఇతర దేశాల వైద్య నిపుణుల సలహాలు, సూచనలు తీసుకుంటున్నామని వారు తెలిపారు. ఎప్పటికప్పుడు ఎంఆర్ఐ, ఇతర అవసరమైన పరీక్షలు, డాక్టర్ల బృందంతో చర్చిస్తూ సుదర్శన్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితిని మెరుగుపరిచేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ పవన్ గోరుకంటి, ఎండీ ఏఎస్ రావు భరోసానిచ్చారు. అయితే పూర్తిస్థాయి సమాచారం ఇవ్వడానికి మరికొంత సమయం పడుతుందని వారు వెల్లడించారు.

**అరగంటకు పైగా హాస్పిటల్‌లోనే..**



పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోగ్యపరిస్థితిని తెలుసుకొనేందుకు కేసీఆర్ సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు ఎర్రవల్లిలోని తన నివాసం నుంచి బయల్దేరారు. 3.20 గంటలకు దవాఖానకు చేరుకున్నారు. సుదర్శన్‌రెడ్డికి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అక్కడే ఉండి ఎప్పటికప్పుడూ పరిస్థితులను పర్యవేక్షించాలని పార్టీ నాయకులను ఆదేశించారు. సుదర్శన్‌రెడ్డి కుటుంబ సభ్యులకు సహాయ సహకారాలు అందించాలని నిర్దేశించారు. కేసీఆర్ వస్తున్న విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో హాస్పిటల్ ప్రాంగణానికి తరలివచ్చారు. రోగుల బంధువులు కూడా ఆయనను చూసేందుకు ఉత్సాహం చూపారు. ఆవరణలోని బెంచీలు, దవాఖాన బారికేడ్లపై నిలబడి కేసీఆర్‌కు అభివాదం చేశారు. సెల్‌ఫోన్లలో ఫొటోలు తీసుకున్నారు. కొందరు యువకులు 'జై కేసీఆర్.. మళ్లీ మీరే మా సీఎం..' అంటూ నినదించారు. తరలివచ్చిన నాయకులకు అభివాదం చేస్తూ తన నివాసానికి తిరుగు పయనమయ్యారు.

# హైడ్రా కమిషనర్ గా రంగనాథ్ ను తొలిగించండి

## - హైకోర్టు సంచలన ఆదేశాలు..!!

**మొదటిపేజీ తరువాయి..** అధికారికి హైడ్రా కమిషనర్ గా బాధ్యతలు అప్పగించాలని ఆదేశించింది. హైడ్రా కమిషన్ పైన వేటు వేయాలని హైకోర్టు సంచలన ఆదేశాలు ఇచ్చింది. లోతుకుంట భూము ల వ్యవహారంలో రంగనాధ్ తీరు పైన హైకోర్టు సీరియస్ అయింది. కోర్టు మూడు సార్లు ఆదేశాలు ఇచ్చిన అమలు చేయకపోవటం పైన న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. కమిషనర్ కోర్టుకు క్షమాపణలు చెప్పినా.. తాము పరిగణలోకి తీసుకోవటం లేదని కోర్టు వ్యాఖ్యానించింది. గతంలోనూ పలు మార్లు రంగనాథ్ కోర్టు ఆదేశాలను బేఖాతర్ చేయటం పైన మండిపడింది. దీంతో, హైకోర్టు వెంటనే రంగనాథ్ ను హైడ్రా కమిషనర్ పదవి నుంచి తప్పించాలని న్యాయస్థానం స్పష్టం చేసింది.

**హైకోర్టు తాజా ఆదేశాలతో..**

కోర్టు ఉత్తర్వులను ధిక్కరించడం సరైంది కాదని హైకోర్టు పేర్కొంది. 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. కాగా, తెలంగాణ హైకోర్టుకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ క్షమాపణలు చెప్పారు. కోర్టులు, న్యాయ వ్యవస్థపై ఎంతో నమ్మకం ఉందంటూ రంగనాథ్ అఫిడవిట్ దాఖలు చేసారు. తాము లోతుకుంట సర్వే నెంబర్ 1, 2లోని భూమిలోకి వెళ్లలేదని వివరించారు. కోర్టుకు పిటిషనర్ అవాస్తవాలు చెప్పారని పేర్కొన్నారు. కాగా, హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు ఉన్నాయని కోర్టు గుర్తు చేసింది. కోర్టు ధిక్కరణ పిటిషన్లు ఇన్ని ఎక్కువ ఎందుకు ఉన్నాయని ప్రశ్నించిన న్యాయస్థానం రంగనాథ్ పై చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. హైడ్రా ఏర్పాటు నుంచి రంగనాథ్ కమిషనర్ గా కొనసాగుతున్నారు. పలు ప్రభుత్వ భూములను కాపాడారనే పేరు ఉంది. అదే విధంగా కొన్ని వివాదాలు ఉన్నాయి. ఇప్పుడు ప్రయివేటు భూముల వ్యవహారంలో కోర్టులో దాఖలైన పిటీషన్ల విచారణ వేళ ఆదేశాలు అమలు చేయటం లేదని కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇప్పుడు నేరుగా రంగనాథ్ ను హైడ్రా కమిషనర్ గా తప్పించాలని ఆదేశించింది.

# రుణమాఫీ నిధులు జమ చేయండి

## - వ్యవసాయ శాఖకు హైకోర్టు ఆదేశం

**మొదటిపేజీ తరువాయి..** రుణమాఫీ పథకానికి అర్హులైన రైతులకు సాంకేతిక కారణాలతో నిలిచిపోయిన రుణమాఫీ మొత్తాన్ని జమ చేయడంతోపాటు వారు చెల్లించిన వడ్డీ మొత్తాన్ని తిరిగి చెల్లించాలన్న వినతిని పరిశీలించి రెండు వారాల్లో నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు నల్లగొండ జిల్లా కలెక్టర్, జిల్లా వ్యవసాయ అధికారిని ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ సూరేపల్లి నందా ఉత్తర్వులు జారీ చేశారు. నల్లగొండ జిల్లా సూరారం గ్రామానికి చెందిన కరుణాకర్‌రెడ్డి, మల్లారెడ్డి అద్దూదొల్లు అనే ఇద్దరు రైతులు ఈ రిట్ పిటిషన్ దాఖలు చేశారు. వీరు తెలంగాణ గ్రామీణ బ్యాంకు నుంచి సాగు కోసం ఒకొకరు రూ.1.6 లక్షల పంట రుణం తీసుకున్నారు. అనంతరం ప్రభుత్వం 2024 డిసెంబర్ 9న రూ.2 లక్షల వరకు పంట రుణమాఫీ పథకాన్ని ప్రకటించగా, వీరి పేర్లు అర్హుల జాబితాలో కూడా చోటు దకించుకున్నాయి. అయితే, తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఐఎఫ్ఎస్‌సీ కోడ్ మారిపోవడంతో ప్రభుత్వం విడుదల చేసిన రుణమాఫీ నిధులు రైతుల ఖాతాల్లో జమ కాకుండా తిరిగి ప్రభుత్వ ఖాతాకు వెళ్లిపోయాయని పిటిషనర్లు కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఈ కారణంగా గత ఏడాదిన్నర కాలంగా రుణంపై వడ్డీ చెల్లించాల్సి వచ్చిందని, రుణమాఫీ మొత్తాన్ని తమ ఖాతాల్లో జమ చేయడంతోపాటు చెల్లించిన వడ్డీని కూడా తిరిగి ఇవ్వాలని 2026 మార్చి 13న జిల్లా కలెక్టర్, జిల్లా వ్యవసాయ అధికారులకు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. పిటిషనర్ల వాదనలను పరిశీలించిన హైకోర్టు, వారి పేర్లు రుణమాఫీ అర్హుల జాబితాలో సీరియల్ నంబర్లు 6,733, 6,758 వద్ద ఉన్నాయని, పథకానికి అర్హులైనా ఇప్పటివరకు ప్రయోజనం అందలేదని గమనించింది. ప్రభుత్వం ప్రకటించిన పథకం ప్రకారం వారికి లబ్ధి కల్పించాల్సిన అవసరం ఉన్నదని అభిప్రాయపడింది.

# తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాలపై ఏఐసీసీ సీరియస్

**మొదటిపేజీ తరువాయి..** సమావేశంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతోపాటు సీనియర్ నేతలు పాల్గొన్నారు. రాష్ట్రంలో పార్టీ వ్యవహారాలు, ప్రభుత్వ పనితీరు, ఎమ్మెల్యేల్లో పెరుగుతున్న అసంతృప్తి, మంత్రుల మధ్య సమన్వ య లోపం, దళిత ఎమ్మెల్యేల తిరుగుబాటు సంకేతాలపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించినట్టు తెలిసింది. సమావేశం ఆసాంతం సీఎం రే వంత్ మౌనంగానే ఉన్నారని, టీపీసీసీ అధ్యక్షు డు మహేశ్‌కుమార్‌గౌడ్ మధ్యమధ్యలో కల్పించుకొని మాట్లాడటానికి ప్రయత్నించారని తెలిసింది. సమీక్షా సమావేశంలో ఖర్గే, ఏఐసీసీ ఢిల్లీ దూత మీనాక్షీనటరాజన్ ఎక్కువ సమయం మా ట్లాడినట్టు తెలిసింది. కొన్ని రోజులు క్షేత్రస్థాయి నుంచి సేకరించిన సమాచారాన్ని ఆమె నివేదిక రూపంలో ఏఐసీసీ ముందు పెట్టినట్టు తెలిసింది. ఖర్గే చేసిన వ్యాఖ్యలు ఒకరోజులో వచ్చిన ఆవేశం కాదని, రెండు వారాలుగా ఏఐసీసీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షీనటరాజన్ నిర్వహించిన వరుస సమీక్షల ఫలితమేనని కాం గ్రెస్ వర్గాలు చెప్తున్నాయి. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేండ్లు పూర్తి చేసుకున్న సమయంలో అధిష్ఠానం నేరుగా జోక్యం చేసుకొని సమీక్షిస్తున్న నేపథ్యంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, డీసీసీ అధ్యక్షులు, మంత్రులతో వి డివిడిగా వన్-టు-వన్ సమావేశాలు నిర్వహిం చి సంస్థాగత పరిస్థితి, ప్రభుత్వ పనితీరు, పార్టీ-ప్రభుత్వం మధ్య సమన్వయం, జిల్లా స్థాయి విభేదాలపై ఆమె నేరుగా అభిప్రాయాలు సేకరించారు. చాలామంది నేతలు జిల్లా స్థాయిలో ఎమ్మెల్యేలు-డీసీసీ అధ్యక్షుల మధ్య సమన్వ యం లేదని, నియామకాలపై తీవ్ర అసంతృప్తి ఉన్నదని, క్షేత్రస్థాయిలో క్యాడర్ నిరుత్సాహానికి గురవుతున్నారని ఢిల్లీ దూత మీనాక్షీ నటరాజన్‌కు నివేదించినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలోనే సోమవారం జరిగిన సమావేశంలో 'పార్టీని నాశనం చేశారు.. మంత్రుల మధ్య సమైక్యత లేదు.. ఎమ్మెల్యేలకు హద్దూ అదుపూ లేదు' అంటూ అధిష్ఠానం తీవ్ర వ్యాఖ్యలు చేసినట్టు తెలిసింది. ఇటీవల బహిరంగంగా వెలుగుచూసిన దళిత ఎమ్మెల్యేల అసంతృప్తి అంశంపై కూడా ఢిల్లీ పెద్దలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. 'దళిత ఎమ్మెల్యేలను ఎగదోస్తున్న వారు ఎవరో మాకు తెలుసు' అంటూ ఈ పరిణామాలను అత్యంత తీవ్రంగా పరిగణిస్తున్నామని స్పష్టం చేసినట్టు సమాచారం.

# ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డిని విద్యాశాఖ మంత్రిని చెయ్యాలి

## - బీజేపీ షాకింగ్ డిమాండ్!

**మొదటిపేజీ తరువాయి..** తెలంగాణా రాష్ట్రంలో విద్యా వ్యవస్థలో వైఫల్యాలు సీఎం రేవంత్ రెడ్డి వల్లనే అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాం చంద్ర రావు పేర్కొన్నారు. విద్యాశాఖను యువ నాయకుడికి అప్పగిస్తామని చెప్పిన కాంగ్రెస్ ఆ మాటను కూడా నిలబెట్టుకోలేదని, విద్యాశాఖలో పూర్తిగా విఫలమైన సీఎం రేవంత్ రెడ్డి విద్యాశాఖ మంత్రిగా నైతిక బాధ్యత వహించి తక్షణమే రాజీనామా చేయాలని రాంచందర్ రావు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, నెరవేర్చని హామీల నుంచి జెన్-జీ యువత దృష్టిని మళ్లించడానికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల్లో పోటీ చేసే కనీస వయస్సును 25 నుండి 21 ఏళ్లకు తగ్గించాలనే కొత్త ప్రతిపాదనను తెరపైకి తెచ్చారని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు విమర్శించారు. రాజ్యాంగ నిర్మాతలు, ముఖ్యంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ శాసన సభ్యుడికి అనుభవం అవసరమనే దూరదృష్టితోనే 25 ఏళ్ల వయస్సును నిర్ణయించారన్నారు. ఇప్పుడు సీఎం చేస్తున్నది కేవలం డైవర్షన్ పాలిటిక్స్ మాత్రమేనని స్పష్టం చేశారు. ఈ రోజు బిజెపి తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన కాంగ్రెస్ పార్టీకి నిజంగా యువతకు అవకాశాలు ఇవ్వాలనే చిత్తశుద్ధి ఉంటే, ముందుగా కాంగ్రెస్ జాతీయ అధ్యక్ష పదవి నుండి మల్లికార్జున్ ఖర్గే గారిని తప్పించి, ఆ బాధ్యతలను ఎవరైనా యువ నాయకుడికి అప్పగించాలని సవాల్ విసిరారు. తమ బీజేపీ ఇప్పటికే నితిన్ నబిన్ గారిని జాతీయ అధ్యక్షుడిగా నియమించి యువతకు తగిన ప్రాధాన్యం ఇచ్చిందని గుర్తుచేశారు. మరోవైపు రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడిచినా విద్యార్థులు, యువతకు ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చలేదన్నారు. రాష్ట్రంలో సుమారు 20లక్షల మంది విద్యార్థులకు చెల్లించాల్సిన రూ.12,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయలేదన్నారు. విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన గుర్తచేశారు. అదేవిధంగా తెలంగాణలోని 17 ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు నిధుల కొరత, అధ్యాపకుల కొరతతో తీవ్ర సంక్షోభంలో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. యూనివర్సిటీలకు రూ.1,000 కోట్లు ఇస్తామని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటివరకు రూపాయి కూడా విడుదల చేయలేదు. ఉపాధ్యాయులకు జీతాలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ లేక విద్యా వ్యవస్థ కుదేలైందని రాంచందర్ రావు మండిపడ్డారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ.. యువతకు 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు, నెలకు రూ.4,000 నిరుద్యోగ భృతి, విద్యాభరోసా కార్డులు, విద్యార్థినులకు ఉచిత స్కూటర్లు, ప్రైవేట్ ఉద్యోగాల్లో 75% స్థానికులకు రిజర్వేషన్లు, యూత్ కమిషన్, ఎంప్లాయిమెంట్ సపోర్ట్ సిస్టమ్ వంటి ప్రతి హామీ గాలిలో కలిసిపోయిందని విమర్శించారు. నిజంగా చిత్తశుద్ధి ఉంటే విద్యాశాఖ బాధ్యతలను కాంగ్రెస్ యువ ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డికి అప్పగించి నిరూపించుకోవాలని సూచించారు.

# అడ్డదారులు తొక్కితే అధికారులకు జైలే

## హైకోర్టు తీర్పు సీఎం రేవంత్‌రెడ్డికి చెంపపెట్టు - ఆర్ ఎస్ పి

**మొదటిపేజీ తరువాయి..** తాము పూర్తిగా స్వాగతిస్తున్నామని చెప్పారు. నాడు హిట్లర్ యూదులను ఏవిధంగా నిర్మూలించాడో, నేడు రేవంత్‌రెడ్డి హైడ్రాను అడ్డం పెట్టుకొని పేదల ఇండ్లను అదే రీతిలో తొలగిస్తున్నాడని, హిట్లర్‌ను ఆదర్శంగా తీసుకొనే హైడ్రాను తెచ్చారని ఆగ్రహం వ్యక్తంచేశారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై ఏకంగా 63 కోర్టు ధికరణ కేసులు ఉండటం ప్రభుత్వ క్రూరత్వానికి అద్దం పడుతున్నదని ఆర్ఎస్పీ విమర్శించారు. లోతుకుంట, బహదూర్‌గూడ, అమీన్‌పూర్‌లో హైడ్రా చేసిన అరాచకాల చిట్టా చాలా పెద్దదని పేర్కొన్నారు. పేదలకో న్యాయం.. రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి ఇంటికో న్యాయమా? అని ప్రశ్నించారు. హైడ్రాను అడ్డం పెట్టుకొని రేవంత్ రియల్ ఎస్టేట్ దందాలు చేస్తున్నాడని దుయ్యబట్టారు. హైడ్రాను అడ్డుకునేందుకు ఆర్మీని రంగంలోకి దించాలని హైకోర్టు అన్నదంటే, అసలు రాష్ట్రంలో పాలన ఉన్నదా? అని ఆర్ఎస్పీ అనుమానం వ్యక్తంచేశారు. రంగనాథ్‌ను ఎప్పుడో అరెస్టు చేయాల్సిందని, హైకోర్టు కొంత దయ చూపించిందని వ్యాఖ్యానించారు. ఈ రోజు రంగనాథ్, రేపు డీజీపీ, సీసీఎల్ఏ కూడా కోర్టు గుమ్మం ఎకాల్సి వస్తుందని హెచ్చరించారు. రంగనాథ్ పోయి వేరే అధికారి వచ్చినా రేవంత్ తీరు మారకపోతే హైడ్రా తీరు మారదని స్పష్టంచేశారు. అధికారులు రూల్ బుక్ ప్రకారం చట్టబద్ధంగా ఉద్యోగం చేయాలని సూచించారు. తప్పులు చేస్తున్న అధికారులందరిపై బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక చర్యలు ఉంటాయని, ప్రతి ఫైల్‌నూ శోధిస్తామని హెచ్చరించారు. అధికారంలోకి వచ్చిన తొలిరోజే హైడ్రాను రద్దు చేస్తామని తమ పార్టీ అధినేత కేసీఆర్ ఇప్పటికే ప్రకటించారని, అది జరిగి తీరుతుందని తేల్చిచెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి రియల్ ఎస్టేట్ ఉచ్చులో అధికారులు పడొద్దని ఆర్ఎస్పీ హితవు పలికారు. రాష్ట్రంలో అధికారులు ప్రభుత్వాధినేతల అక్రమ ఆదేశాలను సున్నితంగా తిరసరించాలని, రాజ్యాంగంలోని 311వ అధికరణం అధికారులకు రక్షణ కల్పిస్తుందని ఎక్స్‌వేదికగా గుర్తుచేశారు.

# 31 నుంచి ఐసెట్ వెబ్ కౌన్సెలింగ్

**మొదటిపేజీ తరువాయి..** ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించే ఐసెట్ వెబ్ కౌన్సిలింగ్ ఈ నెల 31 నుంచి ప్రారంభంకానున్నది. మొత్తం రెండు విడతల్లో కౌన్సిలింగ్ నిర్వహించనుండగా, మొదటి విడత కౌన్సిలింగ్ 31 నుంచి, తుది విడత కౌన్సిలింగ్ ఆగస్టు 17 నుంచి నుంచి ప్రారంభంకానున్నాయి. ఐసెట్ అడ్మిషన్స్ కమిటీ సమావేశాన్ని ఇటీవలే నిర్వహించగా.. ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వీ బాలకిష్టారెడ్డి, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీ దేవసేన సహా పలువురు ఉన్నతాధికారులు కౌన్సెలింగ్‌పై సమగ్రంగా చర్చించి, షెడ్యూల్ ఖరారుచేశారు. రెండు విడతల కౌన్సెలింగ్ పూర్తయిన విద్యార్థులు ఆగస్టు 22 నుంచి 25 వరకు కళాశాలల్లో రిపోర్ట్ చేయాలని సూచించారు. ఆగస్టు 24న స్పాట్ అడ్మిషన్ల మార్గదర్శకాలను https ://tsicet. nic. in వెబ్‌సైట్‌లో విడుదలచేస్తామని ప్రకటించారు.




# తెలుగు రాష్ట్రాల్లో కాక్రోచ్ జనతా పార్టీ టార్గెట్ ఫిక్స్

**మొదటిపేజీ తరువాయి..** కాక్రోచ్ జనతా పార్టీ. ఇప్పుడు ఒక సంచలనం. ఢిల్లీలో నిరసనలు హోరెత్తించి.. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో ఇప్పుడు ఈ పార్టీ గురించి పెద్ద ఎత్తున చర్చ సాగుతోంది. సోషల్ మీడియా వేదికగా ప్రారంభమైన ఈ పార్టీ ఇప్పుడు ఇక సంచలనంగా మారింది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో తమ కార్యాచరణ పూర్తి కాలేదని.. అన్ని అంశాల పైనా స్పందిస్తామని ఆ పార్టీ నేతలు ప్రకటించారు. తెలుగు రాష్ట్రాల్లోనూ తమ లక్ష్యాలను వెల్లడించారు. కీలక ప్రకటన చేసారు. కాక్రోచ్ జనతా పార్టీ సోషల్ మీడియా వేదికగా ఆవిర్భవించి.. ఇప్పుడు జాతీయ రాజకీయాల్లో పెను సంచలంగా మారుతోంది. కేంద్ర ప్రభుత్వం తమ డిమాండ్లకు ఆమోదం తెలిపేలా ఒత్తిడి తెచ్చి ఏకంగా కేంద్ర కేబినెట్ మంత్రితో రాజీనామా చేయించారు. ఢిల్లీ కేంద్రంగా ఈ పార్టీ నిర్వహించిన నిరసనలకు విద్యార్థి లోకం పెద్ద ఎత్తున మద్దతు ఇచ్చింది. కాగా.. ఇప్పుడు ఈ పార్టీ ఇతర రాష్ట్రాల్లో విస్తరణ పైన ఫోకస్ చేసింది. అందులో భాగంగా తెలుగు రాష్ట్రాల్లో తమ కార్యాచరణ పైన స్పష్టత ఇచ్చింది. ప్రధానంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పైన ఈ పార్టీ నేతలు మండిపడుతున్నారు. దేశంలో ప్రతిపక్షాలను, ప్రశ్నించే గొంతుకలను అణిచివేస్తూ ప్రజాస్వామ్యాన్ని హత్య చేసేందుకు బీజేపీ కుట్రలు చేస్తోందని సీజేపీ ఆందోళనలో పాల్గొన్న తెలుగు రాష్ట్రాలకు పలువురు యువ ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# రైతు భరోసా పథకానికి దరఖాస్తులు ఆహ్వానం

**నిజామాబాద్ రూరల్ సిరికొండ, జులై 27, నేటి శుభోదయ :**
సిరికొండ మండలంలో ఈ నెల 15వ తేదీ వరకు నూతనంగా పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతులందరూ 'రైతు భరోసా' పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి నర్సయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.అర్హులైన రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు మరియు బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్ కాపీలను జూలై 5వ తేదీలోగా సంబంధిత రైతు వేదికల్లో వ్యవసాయ విస్తరణ అధికారులకు సమర్పించాలని సూచించారు.దరఖాస్తులు సమర్పించాల్సిన కేంద్రాలు సిరికొండ రైతు వేదికగడ్కోలు రైతు వేదికపెద్ద వాల్గోట్ రైతు వేదికరైతులందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని గడువులోగా దరఖాస్తులను అందజేసి పథకం లబ్ధి పొందాలని ఆయన కోరారు.తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రస్తుత వాతావరణ పరిస్థితులను బట్టి రైతులకు ఆరుతడి పంటల సాగు పైన అవగాహన ఏర్పాటు చేయడం జరిగింది. ఇందులో భాగంగా రైతు వేదికలో విత్తనమేల ఈరోజు నుండి మూడు రోజుల వరకు నిర్వహించడం జరుగుతుంది. విత్తన మేలలో భాగంగా సిరికొండ రైతు వేదికలో కూరగాయ విత్తనాలు మొక్కజొన్న విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచడం జరిగింది. బోర్ల ద్వారా వరి పంట సాగు చేసే రైతులు నీటి ఎద్దడి కలగకుండా ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలని తెలియజేస్తున్నాను. కూరగాయల సాగు ద్వారా రైతుకు ప్రతిరోజు ఆదాయం లభించును కావున రైతులు ప్రస్తుత వాతావరణ పరిస్థితులను బట్టి ఆరుతడి పంటల వైపు ఆలోచన చేయాలని ఈ విత్తనమేలను ఉపయోగించుకోవాలని తెలియజేస్తున్నాను.



# ఢిల్లీలో జరిగే ఎస్‌కేఎం జాతీయ సమావేశాలకు బయలుదేరిన తెలంగాణ రైతు సంఘాల నాయకులు

**నిజామాబాద్, జులై 27, నేటి శుభోదయ :**
ఈ నెల జూలై 28, 29 తేదీల్లో న్యూఢిల్లీలో నిర్వహించనున్న సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్ కె ఎమ్ ) జాతీయ ప్రతినిధుల సమావేశాలకు హాజరయ్యేందుకు తెలంగాణ రాష్ట్రం నుండి రైతు సంఘాల ముఖ్య నాయకులు ఆదివారం ఢిల్లీకి బయలుదేరారు.బయలుదేరిన వారిలో అఖిల భారత ఐక్య రైతు సంఘం ( ఏ ఐ యూ కె ఎస్ ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు వి. ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి బి. రాము, సహాయ కార్యదర్శి బి. దేవరాం మరియు అఖిల భారత ప్రగతిశీల కిసాన్ సభ (ఏ ఐ పి కె ఎమ్ ఎస్ ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. రామకృష్ణ ఉన్నారు.ఈ సందర్భంగా రైతు నాయకులు మాట్లాడుతూ... దేశంలో వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న తీవ్రమైన సమస్యలు, పంటలకు కనీస మద్దతు ధర (ఎమ్ ఎస్ పి ) చట్టబద్ధమైన గ్యారెంటీ, రైతు వ్యతిరేక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు ( ఎఫ్ టి ఏ ), విద్యుత్ సవరణ బిల్లుల ఉపసంహరణ మరియు రైతు రుణమాఫీ వంటి ప్రధాన అంశాలపై ఢిల్లీ సదస్సులో విస్తృతంగా చర్చించనున్నట్లు తెలిపారు.దేశవ్యాప్తంగా ఉన్న వివిధ రైతు సంఘాల ప్రతినిధులు ఈ భేటీలో పాల్గొని, భవిష్యత్ కార్యాచరణను మరియు దేశవ్యాప్త పోరాట రూపురేఖలను రూపొందించనున్నారని వివరించారు. రైతాంగ హక్కుల పరిరక్షణ కోసం, గిట్టుబాటు ధర సాధన కోసం ఎస్‌కేఎం నేతృత్వంలో పోరాటాన్ని మరింత తీవ్రతరం చేస్తామని నేతలు స్పష్టం చేశారు.




# మట్టి, ఇసుక మాఫియాలను మంత్రి తుమ్మల నడిపిస్తున్నారు : మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్

**ఖమ్మం, జులై 27, నేటి శుభోదయ :**
ఆరు అడుగుల కటౌట్‌లా నిటారుగా ఉన్నా, ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తా అని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తెలిపారు. గతంలో తప్పుడు ఆరోపణలు చేసిన వారే ఇప్పుడు అరాచకాలు చేస్తున్నారు.వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఉద్దేశించి మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తనపై గతంలో అరాచకాలు, అక్రమాలు జరిగాయని తప్పుడు ఆరోపణలు చేసిన వారు, ప్రస్తుతం అదే తరహా అరాచకాలు, మాఫియా కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు.రఘునాథపాలెం మండలంలో అనేక మట్టి గుట్టలను అక్రమంగా తవ్వి దోచుకుంటూ, ఇసుక, మట్టి మాఫియాలను ప్రోత్సహిస్తున్నారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావుపై పువ్వాడ విమర్శలు గుప్పించారు.తన ఆరోగ్యంపై ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేశారని, తనకు ఏదో జరిగిపోయినట్లుగా అసత్య వార్తలు ప్రచారం చేశారని అన్నారు. అయితే తాను ఆరు అడుగుల కటౌట్‌లా నిటారుగా నిలబడి ఉన్నానని, ప్రజల కోసం పోరాడే స్ఫూర్తితో ఎప్పటికీ ప్రజల పక్షాన నిలిచి పోరాటం కొనసాగిస్తానని స్పష్టం చేశారు.ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే చరమగీతం పాడతారని, తెలంగాణలో మళ్లీ కేసీఆర్ నాయకత్వంలోని ప్రభుత్వం ఏర్పడే వరకు ప్రజలతో కలిసి నిరంతరం పోరాటం కొనసాగిస్తానని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పేర్కొన్నారు.



# చదువే జీవిత వ్యసనం కావాలి

**ఖమ్మం, జులై 27, నేటి శుభోదయ :**
జీవితం లో స్థిరపడాలంటే రపడాలంటే చదువే విద్యార్థులకు వ్యసనంగా ఉండాలని ఖమ్మం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి విద్యార్థులకు సూచించారు. సోమవారం ఎస్ ఆర్ బి జి ఎన్ ఆర్ కళాశాలలో యాంటీ డ్రగ్ కమిటీ ఎన్ సిసి–ఎన్ ఎస్.ఎస్–ప్రొహిబిషన్& ఎక్సైజ్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో వైస్ ప్రిన్సిపాల్ ఏఎల్ఎన్ శాస్త్రి అధ్యక్షతన గంజాయి మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు ను నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన ముఖ్య వక్తగా పాల్గొని విద్యార్థులకు సందేశాన్ని అందించారు. మన సమాజం బాగుంటే మనం బాగుంటాం, విద్యార్థులు జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటే క్షణికానందం కోసం చెడు వ్యసనాలకు దూరంగా విజ్ఞతతో వ్యవహరించాలని వెల్లడించారు.తెలంగాణ ప్రభుత్వం మాదక ద్రవ్యాలను అరికట్టడంలో ఉక్కుపాదంతో అణచివేయాలనే కృతనిశ్చయంతో ఉందని తెలిపారు ఈగల్ టీం ఇన్స్ పెక్టర్ విజయ్ కుమార్ మాట్లాడుతూ డ్రగ్స్ వల్ల శరీరం నాడీవ్యవస్థ నిర్వీర్యంఅవుతాయని తెలిపారు.దేశ మానవీయ వనరుని కోల్పోతాము న్నారు.సర్కిల్ ఇన్స్పెక్టర్ బి.క్రిష్ణ మాట్లాడుతూ గంజాయి కేసులో పట్టుబడితే పదినుంచి ఇరవై సంవత్సరాల జైలు శిక్ష విధిస్తారని హెచ్చరించారు. ఏదైనా సమాచారం తెలిస్తే తమకు తెలపాలని సూచించారు. కార్యక్రమంలో సైన్స్ విభాగ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్, యాంటీ డ్రగ్ కమిటీ కోఆర్డినేటర్ డాక్టర్ మౌలానా కరీం, ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ సునంద, ఎన్.సీసి ఆఫీసర్ డాక్టర్ ఓంకార్,ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ ఎం.పిచ్చయ్య, డాక్టర్ ఎం.వి.రమణ డాక్టర్ ధర్మయ్య , ఎక్సైజ్ సిబ్బంది, వివిధ విభాగాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.




# ట్రాఫిక్ నియమాలు పాటించండి - ప్రాణాలు కాపాడుకోండి : వాహన తనిఖీల సందర్భంగా పోలీసులు

**నిజామాబాద్ రూరల్ ధర్పల్లి, జులై 27, నేటి శుభోదయ :**



నిజామాబాద్ రూరల్ సిరికొండ, ధర్పల్లి, మండలాల్లో రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయంగా పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా ఈరోజు ధర్పల్లి సిరికొండ శివార్లలోని రహదారిపై పోలీసులు విస్తృతంగా వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనం నడుపుతున్నప్పుడు లైసెన్స్ మరియు ఇతర పత్రాలను వెంట ఉంచుకోవాల్సిన అవసరాన్ని అధికారుల వాహనదారులకు వివరించారు.ప్రధానంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, అది వారి ప్రాణ రక్షణకు అత్యంత ముఖ్యమని సూచించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వారికి, అవసరమైన పత్రాలు చూపించని ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడం, లైసెన్స్, ఆర్సీ (RC) వంటి కీలక వాహన పత్రాలు సమర్పించని వారిపై కఠిన చర్యలు తీసుకున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన పలువురు వాహనదారులకు అక్కడికక్కడే చలానాలువిధించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా పోలీసు పెట్రోల్ మొబైల్ వాహనం ద్వారా సిబ్బంది నిరంతరం నిఘా ఉంచారు. వాహనదారులు పోలీసులకు సహకరించి, ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని పోలీసులు కోరారు.

# డాక్టర్ నిహారిక ను అభినంధించిన రూరల్ శాసనసభ్యులు డాక్టర్ భూపతి రెడ్డి



**నిజామాబాద్ రూరల్ ధర్పల్లి , జులై 27, నేటి శుభోదయ :**
ధర్పల్లి ప్రభుత్వాసుపత్రిలో సివిల్ అసిస్టెంట్ సర్జన్ (CAS) గా నూతనంగా నియమితులైన డాక్టర్ నిహారిక గారు ఈరోజు నిజామాబాద్ రూరల్ శాసనసభ్యులు గౌరవ డాక్టర్ భూపతి రెడ్డి గారిని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తనకు వైద్యురాలిగా సేవలు అందించే అవకాశం దక్కినందుకు ఎమ్మెల్యే గారికి ప్రత్యేకంగా కృతజ్ఞతాభివందనాలు తెలియజేశారు.నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ నిహారికను ఎమ్మెల్యే భూపతి రెడ్డి గారు పూలమాల, శాలువాతో ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి గారు మాట్లాడుతూ... "ధర్పల్లి మండల ప్రజలకు మెరుగైన, ప్రామాణికమైన వైద్య సేవలు అందించడమే మన ప్రధాన లక్ష్యం. ఆసుపత్రికి వచ్చే పేద ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, నిరుపేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించి ఆసుపత్రికి మంచి పేరు తీసుకురావాలి" అని ఆకాంక్షించారు.వైద్యురాలిగా తనపై నమ్మకం ఉంచినందుకు ఎమ్మెల్యే గారికి డాక్టర్ నిహారిక ధన్యవాదాలు తెలపడంతో పాటు, ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికీ జవాబుదారీతనంతో, అంకితభావంతో సేవలు అందిస్తానని విధి నిర్వహణలో శమిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులు పురోగతి

**ఖమ్మం, జులై 27, నేటి శుభోదయ**





నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులు పురోగతి రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఖమ్మం నగరంలో వరద గండం లేకుండా అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఖానాపురం చెరువు అలుగు వరద పోటెత్తగా అనేక డివిజన్లు ముంపుకు గురయ్యాయని మంత్రి అన్నారు. వర్షాల వరద నీటిని తరలించేందుకు వంద కోట్ల తో అండర్ గ్రౌండ్ పైప్ లైన్ పనులు చేపట్టినట్లు తెలిపారు.ఖమ్మం నగరానికి తాగు నీటి ఎద్దడి లేకుండా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్లు మంత్రి అన్నారు. కృష్ణా నది నీళ్లు సరఫరా కానీ పక్షంలో గోదావరి నీళ్లతో పరిష్కారం చేయనున్నామన్నారు. గోదావరి జలాలు మున్నేరు వరకు తరలించామని తెలిపారు.ఖమ్మం నగరంలో వరద ముంపు తాగు నీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చేయనున్నట్లు తెలిపారు. 200 కోట్లతో అమృత్ పథకం పనులు సాగుతున్నాయన్నారు. ఆటోమేషన్ విధానంలో అమృత్ పథకం ద్వారా రక్షిత తాగునీరు సరఫరా చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఖమ్మం నగరంలో తాగు నీటి పథకం అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులకు సహకరించిన సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా మంత్రి ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం నగర పాలక సంస్థ పబ్లిక్ హెల్త్ ఎస్ఈ రంజిత్, అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## డా. ఏ.పి.జె. అబ్దుల్ కలాంకు త్రివేణి ఘన నివాళి



**ఖమ్మం, జులై 27, నేటి శుభోదయ :** "పెద్ద కలలు కనండి, వాటిని నిజం చేసుకునే వరకు నిరంతరం శ్రమించండి" అనే డా. ఏ.పి.జె. అబ్దుల్ కలాం సందేశాన్ని విద్యార్థులకు చేరవేస్తూ, త్రివేణి టాలెంట్ స్కూల్స్, ఖమ్మం శాఖ ఆధ్వర్యంలో సోమవారం డా. ఏ.పి.జె. అబ్దుల్ కలాం వర్ధంతిని ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి తెలిపారు.ఆయన మాట్లాడుతూ భారత రత్న డా. కలాం దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని, శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా ఆయన చూపిన మార్గం ప్రతి విద్యార్థికి ఆదర్శమని పేర్కొన్నారు.పాఠశాల ప్రిన్సిపల్ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ డా. కలాం జీవితం ప్రతి విద్యార్థికి స్ఫూర్తిదాయకమని, విజయం సాధించాలంటే పెద్ద లక్ష్యాలు పెట్టుకుని పట్టుదలతో శ్రమించాలని సూచించారు. కార్యక్రమంలో డా. ఏ.పి.జె. అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు డా. కలాం జీవిత విశేషాలపై ప్రసంగాలు చేశారు. ఉపాధ్యాయులు ఆయన ఆశయాలు, దేశాభివృద్ధికి చేసిన సేవలను వివరిస్తూ విద్యార్థుల్లో దేశభక్తి, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేలా సందేశాలిచ్చారు.ఈ కార్యక్రమంలో సీఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్స్ స్వప్న, ముస్తఫా, క్యాంపస్ ఇన్‌చార్జ్ విక్టర్ చార్లెస్, ట్రాన్స్‌పోర్ట్ ఇన్‌చార్జ్ సందీప్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని డా. ఏ.పి.జె. అబ్దుల్ కలాం కి వినమ్ర నివాళులర్పించారు.

## రేపు సిరికొండ, దర్పల్లి మండలాల్లో సర్వసభ్య సమావేశాలు





**నిజామాబాద్ రూరల్ సిరికొండ / దర్పల్లి, జులై 27, నేటి శుభోదయ :** సిరికొండ, దర్పల్లి మండల కేంద్రాలలో జులై 28న ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశాలు నిర్వహించనున్నట్లు సంబంధిత మండల పరిషత్ అభివృద్ధి అధికారులు (ఎంపీడీవోలు) వెల్లడించారు. సిరికొండ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మొహమ్మద్ రఫీ అహ్మద్ ఆధ్వర్యంలో ఈ సమావేశం జరగనుంది. ఈ సందర్భంగా జలసిరి కార్యక్రమం, ఫార్మ్ పాండ్లు, వాటర్ హార్వెస్టింగ్ పాండ్లు, సోక్‌పిట్లు, బోర్‌వెల్ రీఛార్జ్ పనులతో పాటు గ్రామ పంచాయతీలలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై సమగ్రంగా సమీక్షించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశానికి సర్పంచ్‌లు, గ్రామ అధ్యక్షులు, అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.అలాగే, దర్పల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల ప్రత్యేక అధికారి ఎం. శ్రీనివాస్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో మారుతి తెలిపారు. ఇందులో భాగంగా 'జలసిరి' కార్యక్రమంలో చేపట్టే ఫార్మ్ పాండ్లు, నీటి సంరక్షణ పనులు, సోక్‌పిట్ల నిర్మాణంపై ప్రధానంగా చర్చించనున్నట్లు ఆయన వివరించారు. ఈ సమావేశానికి సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ మరియు మండల సమాఖ్య అధ్యక్షులు, వివిధ శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు వేళకు హాజరు కావాలని కోరారు.

## షాబాద్‌లో సర్ ప్రత్యేక సవరణపై కాంగ్రెస్ దృష్టి

### - ప్రతి ఓటరు వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలి

### : కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడుపల్లి పెంటారెడ్డి



**షాబాద్ జులై 27, నేటి శుభోదయ :** షాబాద్ మండలంలో జరుగుతున్న సర్ ఓటర్ల జాబితా సమగ్ర ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుడుపల్లి పెంటారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా షాబాద్ సర్పంచ్ అశోక్, ఉప సర్పంచ్ దండు రాహుల్, పార్టీ నాయకులు, కార్యవర్గ సభ్యులతో కలిసి BLOలు, BLAల నుంచి ఎన్యుమరేషన్ ఫారాల పురోగతి, ఓటర్ల వివరాల నవీకరణ ప్రక్రియపై వివరాలు తెలుసుకున్నారు.ఆగస్టు 3తో సర్ ప్రత్యేక సవరణ ముగియనున్న నేపథ్యంలో మండలంలోని ప్రతి గ్రామాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, ఒక్క అర్హుడైన ఓటరు కూడా మిగిలిపోకుండా వివరాలు నమోదు చేయాలని ఆయన సూచించారు. ఓటర్ల జాబితా వంద శాతం నవీకరణ పూర్తయ్యేలా BLOలు, BLAలు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని కోరారు.గతంలో నమోదైన నకిలీ ఓట్లను తొలగించి, ప్రతి వ్యక్తికి ఒకే ప్రాంతంలో ఓటు ఉండేలా చర్యలు తీసుకోవాలని, మరణించిన వారి వివరాలను కూడా జాబితా నుంచి తొలగించే ప్రక్రియలో నమోదు చేయాలని తెలిపారు.ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైన హక్కు అని పేర్కొంటూ, ప్రతి ఓటరు తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఓటర్ల సమగ్ర ప్రత్యేక సవరణ కార్యక్రమంలో ప్రజలు, BLOలు, BLAలకు పూర్తి సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## పర్యవేక్షణతో అభివృద్ధి పనులు నాణ్యతతో పూర్తి చేయాలి : రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు



**ఖమ్మం, జులై 27, నేటి శుభోదయ :** నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను పర్యవేక్షణతో నాణ్యతతో పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు.ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలోని 43వ డివిజన్‌లో రూ.61.50 లక్షల సుడా నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్లు, సీసీ డ్రైన్ల నిర్మాణ పనులకు మంత్రి వర్యులు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే ప్రతి అభివృద్ధి పనిని నాణ్యతతో చేపట్టి పదికాలాల పాటు మన్నికగా ఉండే విధంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పనుల అమలులో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, ప్రభుత్వ నిధులను పారదర్శకంగా వినియోగించాలని స్పష్టం చేశారు. అభివృద్ధి పనులను ప్రజాప్రతినిధులతో పాటు స్థానిక ప్రజలు కూడా నిరంతరం పర్యవేక్షించాలని, ప్రజల భాగస్వామ్యంతో చేపట్టే పనులు మరింత నాణ్యతగా పూర్తవుతాయని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నప్పటికీ ఖమ్మం నగర అభివృద్ధికి వందల కోట్ల రూపాయలను విడుదల చేస్తూ ప్రజలకు అవసరమైన మౌళిక సదుపాయాలను కల్పిస్తోందని అన్నారు. ఖమ్మం నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి పలు ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులను అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. నగరంలో విశాలమైన రహదారులు, మెరుగైన మౌళిక సదుపాయాలు కల్పించడం ద్వారా అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని మంత్రి పేర్కొన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్న మంత్రి, పరిశుభ్రత వల్ల ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా కుటుంబాలపై వైద్య ఖర్చుల భారం తగ్గుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## విశ్వ ఫౌండేషన్ తరపున సూర్యాస్తమయం సామూహిక అగ్నిహోత్ర ప్రచారం



**సంగారెడ్డి , జులై 27, నేటి శుభోదయ :** పర్యావరణ శుద్ధీకరణ మరియు సంపూర్ణ ఆరోగ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో విశ్వ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అగ్నిహోత్ర ప్రచారం మరియు బారి సముహిక అగ్నిహోత్ర కార్యక్రమాన్ని నిర్వాహించారు.పెరుగుతున్న కాలుష్యం మరియు మానసిక ఒత్తిడి ఉన్న ఈ కాలంలో, ప్రాచీన వేద విజ్ఞానమైన అగ్నిహోత్ర ను పునఃపరిచయం చేయడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం. సూర్యోదయ మరియు సూర్యాస్తమయ సమయాల్లో కేవలం 10 నిమిషాల పాటు నిర్వహించే ఈ ప్రక్రియ, గాలిలోని విషతుల్యాలను తొలగించి, ఒత్తిడిని తగ్గిస్తుందని శాస్త్రీయంగా నిరూపించబడింది.ప్రత్యక్ష ప్రదర్శన రాగి పిరమిడ్, ఎండిన ఆవు పేడ బిళ్లలు, స్వచ్ఛమైన నెయ్యి మరియు అక్షింతలను ఉపయోగించి అగ్నిహోత్రాన్ని నిర్వహించే సరైన పద్ధతిని నిపుణులు ప్రత్యక్షంగా చూపిస్తారు. సముహిక అగ్నిహోత్రం. ఖచ్చితమైన [సూర్యోదయ/సూర్యాస్తమయ] సమయంలో అందరూ కలిసి ఒకేసారి అగ్నిహోత్రం నిర్వహించి, శక్తివంతమైన సామూహిక స్వస్థత శక్తిని సృష్టిస్తారు. సేంద్రీయ వ్యవసాయం, నీటి వనరుల శుద్ధీకరణ మరియు మానవ రోగనిరోధక శక్తిని పెంచడంలో అగ్నిహోత్రం ఎలా సహాయపడుతుందనే అంశంపై ప్రసంగంతో కార్యక్రమం ముగుస్తుంది.నిర్వాహకుల సందేశంఅగ్నిహోత్రం అనేది కేవలం ఒక సంప్రదాయం మాత్రమే కాదు; ఇది పర్యావరణ మరియు మానసిక శాంతి కోసం వేద కాలపు మహర్షులు మానవాళికి అందించిన వరం. కాలుష్య ప్రభావం నుండి మన భావి తరాలను రక్షించే ఈ 'హీలింగ్ ఫైర్' (స్వస్థత చేకూర్చే అగ్ని) గురించి ప్రతి ఇంటికీ అవగాహన కల్పించడమే అగ్నిహోత్ర యొక్క మా లక్ష్యం, అని విశ్వ ఫౌండేషన్ శిక్షణ సమన్వయకర్త విశ్వ ఫౌండేషన్ ధర్మ సైనికులు పేర్కొన్నారు.

## ప్రతి రోగికి సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించాలి

### : జిల్లా కలెక్టర్ అంకిత్



**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 27, నేటి శుభోదయ :** జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రతి రోగికి సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందేలా వైద్యులు, అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. సోమవారం లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి ఆసుపత్రి నిర్వహణ, వైద్య సేవలపై సమగ్రంగా సమీక్షించారు.ఆసుపత్రిలోని వార్డులు, మరుగుదొడ్లు, ఆవరణ పరిశుభ్రతను పరిశీలించిన కలెక్టర్, రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని వైద్యాధికారులను ఆదేశించారు.వైద్యాధికారితో ఓపీ వివరాలు, రోజువారీ రోగుల సంఖ్య, గత పది రోజులుగా నమోదైన జ్వర కేసులపై ఆరా తీశారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున జ్వరాలపై ప్రత్యేక అప్రమత్తతతో వ్యవహరించాలని, ప్రతి జ్వర బాధితుడికి అవసరమైన పరీక్షలు నిర్వహించి వెంటనే చికిత్స అందించాలని సూచించారు. గ్రామాల్లో జ్వరాల నివారణపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.రక్త పరీక్షల విభాగాన్ని సందర్శించిన కలెక్టర్ మలేరియా, డెంగ్యూ, హెచ్ఐవీ నిర్ధారణకు అవసరమైన టెస్టింగ్ కిట్లు, ప్రయోగశాల సామగ్రి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. అనంతరం మందుల నిల్వ గదిని తనిఖీ చేసి మందుల లభ్యత, గడువు తేదీలను పరిశీలించారు. మందుల కొరత తలెత్తకుండా ముందస్తుగా ఇండెంట్లు పంపించి తగిన నిల్వలు ఉంచుకోవాలని అధికారులను ఆదేశించారు.పాము కాటుకు చికిత్సలో వినియోగించే యాంటీ స్నేక్ వెనం ఇంజక్షన్ల లభ్యతను కూడా పరిశీలించిన కలెక్టర్, అనంతరం ఆయుష్ క్లినిక్‌ను సందర్శించి అక్కడ అందిస్తున్న సేవలు, ఔషధాల నిల్వలను పరిశీలించారు. ప్రజలకు ఆయుష్ వైద్య సేవలు కూడా సమర్థవంతంగా అందించాలని సూచించారు.తనిఖీ అనంతరం చికిత్స కోసం వచ్చిన రోగులతో నేరుగా మాట్లాడిన కలెక్టర్, వైద్య సేవలు, మందుల లభ్యత, సిబ్బంది స్పందనపై వివరాలు తెలుసుకుని అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని వైద్యాధికారులను ఆదేశించారు.ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచేలా ప్రతి రోగికి నాణ్యమైన వైద్య సేవలు, మందులు, పరీక్షా సదుపాయాలు నిరంతరం అందుబాటులో ఉండేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ అంకిత్ సూచించారు.ఈ తనిఖీలో తహసీల్దార్ శిరీష, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి, వైద్య సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అపర శబరి పోకల దమ్మక్క సేవా యాత్రకు ఐటిడిఏ పీవో బి. రాహుల్‌కు ఆహ్వానం...



**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 27, నేటి శుభోదయ :** అపర శబరి పోకల దమ్మక్క సేవా యాత్రలో పాల్గొనాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్‌ను శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం అధికారులు సోమవారం మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. దేవస్థాన కార్యనిర్వాహణ అధికారి దామోదర్ రావు ఆదేశాల మేరకు సహాయ కార్యనిర్వాహణ అధికారి (ఏఈఓ) భవాని రామకృష్ణ, అర్చక స్వాములు ఐటిడిఏ పీవోను ఆయన కార్యాలయంలో కలిసి మంత్రోచ్ఛారణల మధ్య తీర్థప్రసాదాలు అందజేసి సేవా యాత్ర ఆహ్వాన పత్రికను సమర్పించారు.ఈ సందర్భంగా పీవో బి. రాహుల్ మాట్లాడుతూ, శ్రీ సీతారామచంద్రస్వామి అనుగ్రహానికి పాత్రులైన పోకల దమ్మక్క సేవా యాత్రకు వివిధ గిరిజన గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవుతున్నందున ఉత్సవాలను సంప్రదాయబద్ధంగా, శాస్త్రోక్తంగా నిర్వహించాలని సూచించారు. ఆలయ ఆచారాలు, పూజా విధానాలు పురాతన సంప్రదాయాలకు అనుగుణంగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని దేవస్థాన అధికారులకు తెలిపారు.అలాగే సేవా యాత్ర సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దర్శన ఏర్పాట్లు, తాగునీరు, వైద్య సేవలు, శాంతిభద్రతలు తదితర సౌకర్యాలను సమకూర్చాలని సూచించారు. భారీ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున అన్ని శాఖల సమన్వయంతో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఏఈఓ భవాని రామకృష్ణ, పర్యవేక్షకుడు శ్రీనివాసరెడ్డి, అర్చక స్వాములు విష్ణు, ఎస్.వి. మదనమోహన్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల హక్కుల కోసం తెలంగాణ నుంచి ఢిల్లీలో గళమెత్తిన టిడబ్ల్యూజేఎఫ్



**న్యూఢిల్లీ, హైదరాబాద్, జులై 27, నేటి శుభోదయ :** దేశవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్లూజేఎఫ్) తెలంగాణ రాష్ట్ర వ్యవస్థాపకులు అధ్యక్షులు మామిడి సోమయ్య ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన ధర్నాకు విశేష స్పందన లభించింది. ఈ నిరసన కార్యక్రమాన్ని పలు జాతీయ మీడియా సంస్థలు విస్తృతంగా కవర్ చేయడం విశేషం.తెలంగాణ నుంచి జర్నలిస్టుల హక్కుల కోసం జాతీయ రాజధానిలో పెద్ద ఎత్తున ఉద్యమం నిర్వహించడం అభినందనీయమని పలువురు జాతీయ మీడియా ప్రతినిధులు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న పాత్రికేయుల సంక్షేమం, భద్రత, హక్కుల పరిరక్షణ కోసం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ముందుండి పోరాటం చేయడం గొప్ప విషయమని వారు అభిప్రాయపడ్డారు.ధర్నా కార్యక్రమంలో జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించిన పలు కీలక డిమాండ్ల 2019లో కరోనా సమయంలో జర్నలిస్టులకు రైల్వే పాసు రాయితీ సదుపాయాన్ని ఉపసంహరించడం జరిగిందిమరియు జాతీయస్థాయిలో మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలి పార్లమెంట్లో బడ్జెట్ ప్రవేశపెట్టే సమయంలో జర్నలిస్టులకు సంబంధించి ప్రత్యేక బడ్జెట్ ను కేటాయించాలని దాని ద్వారా అర్హులైన ప్రతి వర్కింగ్ జర్నలిస్టుకు ఉచిత హెల్త్ కార్డ్స్ ఇళ్ల స్థలాలు పిల్లలకు విద్య వైద్యం ఉచితంగా అందించాలని వారు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన జర్నలిస్టులు కూడా టీడబ్ల్యూజేఎఫ్ చేపట్టిన ఈ ఉద్యమానికి మద్దతు ప్రకటించారు.ఈ సందర్భంగా ఫెడరేషన్ నాయకులు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. దేశంలోని ప్రతి పాత్రికేయుని హక్కుల కోసం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు.జాతీయ మీడియా విస్తృత కవరేజ్ తో ఈ ఉద్యమం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారడం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ కు దక్కిన గుర్తింపుగా పలువురు జర్నలిస్టులు అభిప్రాయపడ్డారుఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నానబాల రామకృష్ణ, అర్వపల్లి నాగేష్, కోశాధికారి వేములకొండ రమేష్ , నేషనల్ కౌన్సిల్ మెంబర్ వెలుగోటి వెంకట్, జిల్లా సభ్యులు మామిడాల కిరణ్, కప్పల మధు,గుజ్జు గోపాలకృష్ణ, వెలిశెట్టి రామకృష్ణ బాబు తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షానికి ఇల్లు కూలిన ఘటన.. బాధిత కుటుంబానికి అండగా అర్ధ సుధాకర్ రెడ్డి



**వికారాబాద్, జూలై 27, నేటి శుభోదయ :**

వికారాబాద్: గత రాత్రి కురిసిన భారీ వర్షాలకు వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని 10వ వార్డు గిరిగెటిపల్లిలో ఒక ఇల్లు కూలిపోవడంతో బాధిత కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పేందుకు మున్సిపల్ వైస్ చైర్మన్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అర్ధ సుధాకర్ రెడ్డి సంఘటనా స్థలాన్ని సందర్శించారు.భారీ వర్షాల కారణంగా ఇల్లు కూలిపోయిన విషయాన్ని తెలుసుకున్న వెంటనే అర్ధ సుధాకర్ రెడ్డి అక్కడికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పడంతో పాటు అవసరమైన తక్షణ సహాయం అందించేందుకు ఎల్లప్పుడూ ముందుంటామని హామీ ఇచ్చారు. ప్రజలకు ఎలాంటి ఆపద వచ్చినా కాంగ్రెస్ పార్టీ వారి వెంటే నిలుస్తుందని, బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలిపారు.ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ రెడ్యా నాయక్, బుచ్చయ్య, నరసింహులు, రెడ్డి శేఖర్, వడ్డే శ్రీను, కురువ వెంకటయ్య తదితరులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధిత కుటుంబానికి సంఘీభావం ప్రకటించారు. స్థానికులు కూడా బాధితులకు అవసరమైన సహాయం అందించాలని కోరారు.

## హైకోర్టు ఆదేశాలను ప్రభుత్వం అమలు చేయాలి.. హైడ్రా కమిషనర్‌ను తొలగించాలి : డాక్టర్ మెతుకు ఆనంద్



**వికారాబాద్ , జూలై 27, నేటి శుభోదయ :** వికారాబాద్: హైకోర్టుఆదేశాలను తెలంగాణ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను పదవి నుంచి తొలగించాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మెతుకు ఆనంద్ డిమాండ్ చేశారు. హైడ్రా పేరుతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ చట్టాలను పక్కనపెట్టి వ్యవహరించే అధికారులపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.హైకోర్టు చేసిన వ్యాఖ్యలు ప్రభుత్వ వైఖరిపై తీవ్రమైన ప్రశ్నలు లేవనెత్తాయని ఆయన పేర్కొన్నారు. న్యాయస్థానం సూచనలను గౌరవించి చట్టబద్ధమైన విధానాల ప్రకారం ప్రభుత్వం వ్యవహరించడం రాజ్యాంగబద్ధమైన బాధ్యత అని అన్నారు. ప్రజల ఇళ్ల విషయంలో చట్టపరమైన ప్రక్రియలను పాటించకుండా తీసుకునే చర్యలు సమర్థనీయం కావని అభిప్రాయపడ్డారు.హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను బలిపశువుగా చేసి ప్రభుత్వం తన బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నం చేయకూడదని ఆయన విమర్శించారు. తప్పులు జరిగినట్లయితే వాటికి బాధ్యులైన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, ఒక్క అధికారిపైనే నెపం మోపడం సరైన విధానం కాదన్నారు.ప్రజల హక్కులను కాపాడాల్సిన అధికారులు అధికార దుర్వినియోగానికి పాల్పడితే ప్రభుత్వం మౌనంగా ఉండకూడదని, చట్టం ముందు అందరూ సమానమేనని ఆయన పేర్కొన్నారు. ప్రజల ఆస్తులు, హక్కులను పరిరక్షిస్తూ రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా ప్రభుత్వం వ్యవహరించాలని డాక్టర్ మెతుకు ఆనంద్ కోరారు.

## గ్రామ ప్రజల అంగడి భూములను కాపాడాలని ఆర్డీవో కు వినతి పత్రం అందజేత



**నిజామాబాద్ రూరల్ సిరికొండ , జులై 27, నేటి శుభోదయ :** అంగడి భూములను అన్యాకాంతం కాకుండా కాపాడాలని ఆర్డీవో రాజేంద్ర కుమార్ ను కలిసి వినతి పత్రని అందజేసిన, సిరికొండ గ్రామపంచాయతీ పాలకవర్గం, సభ్యులు, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, ఈ సందర్భంగా సర్పంచ్ సాయి చరణ్ , వి డి సి చైర్మన్ సాయన్న లు మాట్లాడుతూ గత 25 సంవత్సరాల క్రితం గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు వివిధ కుల సంఘాల ద్వారా డబ్బులను జమ చేసి వారాంతపు సంత కోసం సిరికొండ గ్రామ ప్రజల నుండి భూమిని కొనుగోలు చేశారని, గత 25 సంవత్సరాలుగా అందులో అంగడి బజార్ ను, నిర్వహిస్తున్నారని, వర్తకులకోసం,ప్రజల కోసం మంచినీటి సౌకర్యం కోసం బోరు తవ్వించి మంచినీటి సౌకర్యాన్ని కల్పించామని మహిళల కోసం వాష్ రూమ్ లు నిర్మించామని, సిరికొండ గ్రామ ప్రజల అవసరాల కోసం ప్రభుత్వ నిధులతో దోబిగాట్ నిర్మించామని, కరెంటు సమస్య పరిష్కరించేందుకు ట్రాన్స్ఫార్మర్ను కూడా అంగడి బజార్లో ఏర్పాటు చేయడం జరిగిందని ఆర్డీవో దృష్టికి, గ్రామ సర్పంచ్,చైర్మన్ లు తీసుకెళ్లారు, సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ సమస్య పరిష్కారం కోసం సిరికొండ తహసిల్దార్ చేత విచారణ చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ గత 25 సంవత్సరాల క్రితం అంగడి కోసం కొనుగోలు చేసిన భూమినీ ఎవరు కొనుగోలు చేసిన అమ్మిన చెల్లుబాటు కాదని, కొనేవారు గుర్తుంచుకోవాలని, తర్వాత బాధపడితే లాభం లేదని, ప్రజలకు సూచించారు. ఆర్డీవోను కలిసిన వారిలో సర్పంచ్ సాయి చరణ్, వార్డు సభ్యులు, శంకర్ రంజిత్, ఎల్లయ్య, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ సాయన్న పారేపల్లి శివ, క్యాషియర్ గణేష్ గౌడ్, కార్యదర్శి రాజన్న, సలదారులు శ్రీనివాస్, సతీష్ ప్రవీణ్, రాజన్న, తదితరులు ఉన్నారు

## కోసూరి రమేష్ గౌడ్ మృతి



**ఖమ్మం, జులై 27, నేటి శుభోదయ :** ఖమ్మం సుడా మాజీ డైరెక్టర్ , కాంగ్రెస్ పార్టీ నాయకులు కోసూరి రమేష్ గౌడ్ మృతి పట్ల రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్ర ఆవేదన చెందారు . రమేష్ మృతి కాంగ్రెస్ పార్టీకే కాక తనకు వ్యక్తి గతంగా తీరనిలోటని తెలిపారు . ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గం ఏ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, త్రీ టౌన్ ఏరియా పార్టీ కోఆర్డినేటర్ యర్రం బాలగంగాధర్ తిలక్ అధ్యక్షతన కోసూరి రమేష్ స్వగృహంలో సంతాప సభ జరిగింది . సంతాపసభ రమేష్ మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని , సంతాపాన్ని వ్యక్తం చేసింది . ఖమ్మం నగరంలోని కోసూరి స్వగృహానికి వెళ్లి నివాళులర్పించిన తుమ్మల మాట్లాడుతూ రమేష్ ఆది నుంచి తన వెంటే ఉంటూ మంచి రాజకీయ నాయకుడిగా పేరుందారన్నారు . నిరాడంబర జీవితం గడిపిన రమేష్ నిగర్వి అన్నారు. రమేష్ గౌడ్ మరణం పార్టీకి , స్థానిక ప్రజలకు తీరని లోటని ఆయన పేర్కొన్నారు . రమేష్ ఆత్మకు శాంతి చేకూరాలని, ఈ కష్ట సమయంలో భగవంతుడు వారి కుటుంబ సభ్యులకు గుండె నిబ్బరాన్ని , మనో ధైర్యాన్ని ప్రసాదించాలని తుమ్మల ఆకాంక్షించారు. మంత్రి తుమ్మలతో పాటు మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ పలువురు నాయకులు, బంధు మిత్రులు అందరు రమేష్ గౌడ్ సంతాప సభలో ప్రసంగించారు . రమేష్ తో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకొన్నారు . రమేష్ మృతి తమ అందరికీ తీరని లోటు తెలిపారు . ఈ కార్యక్రమంలో డిసిసి ఖమ్మం కార్పోరేషన్ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి , జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండి ఖాదర్ బాబా , మాజీ మేయర్ పూనకొల్లు నీరజ, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## వరి కి బదులు ప్రత్యామ్నాయం పంటల పై దృష్టి సారించండి



**ఖమ్మం, జులై 27, నేటి శుభోదయ**

నవరికి బదులు గా ప్రత్యామ్నం పంటల పై దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదిక లో సోమవారం నిర్వహించిన విత్తన మేళా లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.. ప్రస్తుత పరిస్థితులలో రైతులు వరి పంటకు దూరంగా ఉండాలని సూచించారు. వర్షాభావ పరిస్థితులు ను తట్టుకునే పప్పు దినుసులను సాగు చేసుకోవాలని సూచించారు. ఆరుతడి పంటలకు రైతులు సబ్సీడీ పై విత్తనాలు ఇవ్వాలని జిల్లా. వ్యాప్తంగా రైతులు కోరుతున్నారని...ఆ విషయం ను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని పేర్కొన్నారు. రైతులను చైతన్యం చేసేందుకు ప్రతీ గ్రామంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. బోరుబావులను నమ్ముకుని వరి సాగు చేసి రైతులు నష్టపోకూడదన్నారు. భూగర్భజలాలు అడుగంటుతున్నాయని అన్నారు. ఎట్టి పరిస్థితులలో సాగు కు నీరు వచ్చే అవకాశం లేదన్నారు. రైతులు పరిస్థితులకు అనుగుణంగా పంటలు సాగు చేయాలని సూచించారు. ఒక పక్క నీటి కొరత, మరో పక్క విద్యుత్ సమస్య వెంటాడుతుందన్నారు. కావునా రైతులు పప్పు దినుసులు, తక్కువ నీటి శాతం అవసరం ఉన్న పంటలను సాగు చేయాలన్నారు. జిల్లాలో 12 మండలాలలో సాధారణ వర్షపాతం ఉందన్నారు. అందులో 7 మండలాలలో తక్కువ వర్షం పడగా...అతి తక్కువగా కూసుమంచి మండలంలో -60 శాతం, ఎర్రుపాలెం -71 శాతం నమోదైన్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రతీ మండలంలో ఒక రైతు వేదిక లో విత్తనమేళా ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు విత్తన మేళా ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి వ్యవసాయ సహాయ సంచాలకులు రాజేష్కుమార్.మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు, మండల వ్యవసాయాధికారి యం.రాధ, రైతు ప్రతినిధులు మేకల వెంకటేశ్వర్లు, గరిడేపల్లి రామారావు, విత్తన డీలర్లు గెల్లా వెంకటేశ్వరరావు, రామారావు, వ్యవసాయ విస్తీరణాధికారులు అరవింద్. దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.

## సైడ్ డ్రైనేజ్ మేమే నిర్మించుకుంటున్నాం



**ఏన్కూర్, జూలై 27, నేటి శుభోదయ :**
ఏన్కూర్ మండల పరిధిలోని లచ్చగూడెం గ్రామానికి చెందిన నాగబోయిన వెంకటరమణమ్మ సొంత ఖర్చులతో సైడ్ డ్రైనేజీ ను నిర్మించుకుంటుంది. ప్రభుత్వాలు మారిన ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలమయ్యారు అనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్వాతంత్రం వచ్చి ఇన్ని ఏళ్లు గడిచిన పేదల రాతలు మారట్లేదు. లచ్చగూడెం గ్రామంలో ఎస్టి కాలనీకి చెందిన వెంకట రమణమ్మ ఇంటి ముందు కాలువలో నీరు ఆగి దుర్వాసన రావడంతో ఆమె సొంత ఖర్చులతో ఇసుక, సిమెంటు కొనుగోలు చేసి స్వయంగా డ్రైనేజీ ను నిర్మించుకుంటుంది. అధికారులు ,పంచాయతీ కార్యదర్శి అసలు ఏమైపోయారు అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. వెంకటరమణ ఆర్థికంగా భారం అయినప్పటికీ ఈ నిర్మాణాన్ని చేపట్టింది. ఆమెకు ఇల్లు లేదనీ, దీంతో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని ఆమె అధికారులను కోరింది. సొంత ఖర్చులతో సైడ్ డ్రైనేజీ నిర్మించుకుంటున్న వెంకట రమణమ్మ కు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

## ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి : ఎంపీడీవో



**మిడ్జిల్, జూలై 27, నేటి శుభోదయ :**
ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల అభివృద్ధి అధికారి లక్ష్మణ్ రాథోడ్ (ఎంపీడీవో) సూచించారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదులు, వినతులను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. అందులోనే భాగంగా సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 5 దరఖాస్తులు వచ్చాయన్నారు. అందిన ప్రతి వినతిని సంబంధిత శాఖలకు పంపించి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని ఎంపీడీవో కోరారు.

## సదాశివపేట మండలంలో ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణ ముగింపు



**సంగారెడ్డి , జూలై 27, నేటి శుభోదయ :**
సదాశివపేట మండలంలో పనిచేస్తున్న ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ కార్యక్రమం విజయవంతంగా పూర్తయింది. మండలంలోని ఉపాధ్యాయులందరినీ రెండు గ్రూపులుగా విభజించి, ప్రతి గ్రూపుకు మూడు రోజుల చొప్పున శిక్షణను సదాశివపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు.సోమవారం రెండవ గ్రూప్ శిక్షణ ముగింపు కార్యక్రమానికి కోర్స్ డైరెక్టర్ ఐన మండల విద్యాధికారి శంకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శిక్షణలో నేర్చుకున్న నూతన బోధనా పద్ధతులను తమ పాఠశాలల్లో తప్పనిసరిగా అమలు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులను చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దాలని కోరారు.అనంతరం ఇటీవల జీవితకాల సాఫల్య పురస్కారం అందుకున్న మండల విద్యాధికారి శ్రీ శంకర్ ను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.ఈ శిక్షణ కార్యక్రమాన్ని యూసుఫ్, సురేష్, ప్రవీణ్, పద్మ గార్లు ఆర్.పి లుగా వ్యవహరించి సమర్థవంతంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మండలంలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జీతం కు ఏది న్యాయం...? -ప్రైవేట్ ఆసుపత్రిలో సేవలు..??







**ఖమ్మం, భద్రాచలం, జూలై 27, నేటి శుభోదయ :**
ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే నిరుపేద రోగులకు ఉచితంగా వైద్య సేవలు అందించాల్సిన వైద్యులే, వారిని ప్రైవేట్ ఆస్పత్రుల కు పంపించేందుకు పరోక్షం గా ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై భద్రాచలం ఏరియా ఆస్పత్రి తీరు మరోసారి చర్చనీయాంశమైంది. ముఖ్యంగా ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న ఓ రేడియాలజిస్టు ప్రభుత్వ విధులను నిర్లక్ష్యం చేస్తూ, రోగులను తనకు సంబంధాలున్నట్లు ఆరోపణలు ఉన్న ప్రైవేట్ ఆస్పత్రికి పంపిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.స్థానికులు, రోగుల బంధువులు చెబుతున్న వివరాల ప్రకారం, ఇటీవల చర్ల మండలం నుంచి స్కానింగ్ కోసం భద్రాచలం ఏరియా ఆస్పత్రికి వచ్చిన ఓ నిరుపేద మహిళకు ఆస్పత్రిలో సరైన సేవలు అందవని, ఆలస్యం అవుతుందని చెప్పి, ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో త్వరగా స్కానింగ్ చేయించుకోవాలని సూచించినట్లు ఆరోపిస్తున్నారు. దీంతో ఆ మహిళ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లి అధిక మొత్తంలో డబ్బు చెల్లించి పరీక్షలు చేయించుకున్నట్లు తెలుస్తోంది.లక్షల రూపాయల ప్రభుత్వ వేతనం తీసుకుంటూ, ప్రభుత్వ ఆస్పత్రి సేవలను బలోపేతం చేయాల్సిన వైద్యుడు, రోగులను ప్రైవేట్ పంపిస్తున్నారనే ఆరోపణలు తరచుగా వినిపిస్తున్నాయి. గతంలో కొందరు వైద్యులు కమిషన్ల కోసం బయట స్కానింగ్ కేంద్రాలకు రిఫర్ చేసేవారని, ఇప్పుడు అయితే ఏకంగా ప్రభుత్వ స్కానింగ్ విభాగాన్నే ప్రైవేట్ ఆస్పత్రుల రిఫరల్ కేంద్రంగా మార్చేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి.ప్రభుత్వ నిబంధనల ప్రకారం పూర్తి సమయం ఆస్పత్రిలో అందుబాటులో ఉండాల్సిన రేడియాలజిస్టు ప్రతిరోజూ ఏదో ఒక కారణం చెబుతూ కేవలం రెండు గంటలకే విధులు ముగిస్తున్నారని సిబ్బంది, రోగులు ఆరోపిస్తున్నారు. దీనివల్ల స్కానింగ్ కోసం వచ్చిన గర్భిణులు, గిరిజన, పేద రోగులు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంటోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.భద్రాచలం ఏరియా ఆస్పత్రి సరిహద్దు ల్లోని చతీష్ గఢ్ , ఒరిస్సా , ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి ముఖ్యం గా గిరిజనులు ఇతర నిరుపేద రోగులు వస్తుంటారు. ఎంతో చరిత్ర ఉన్న ఈ ఆసుపత్రి ఇటీవల కాలం లో తరచుగా వివిధ ఆరోపణలతో వార్తల్లోకి రావడం గమనార్హం. దాదాపుగా ఇక్కడ పని చేస్తున్న వారిలో ఎక్కువ మంది వైద్యులు భద్రాచలం లోనే స్వంత క్లినిక్ లు కలిగివుండటం తో, ప్రభుత్వ ఆసుపత్రి సేవల్లో సరిగా దృష్టి పెట్టడం లేదని ఆరోపణలు ఎప్పటి నుండో ఉన్నాయి. ఈ విషయమై రాజకీయ పార్టీలు, దళిత, గిరిజన సంఘాలు ఉన్నతాధికారులు కు ఫిర్యాదులు చేశాయి. ఆసుపత్రి లో రోగులకు సరైన సేవలు అందకపోవడం, పైగా ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాలని సూచించడం వల్ల పేద కుటుంబాలపై అదనపు ఆర్థిక భారం పడుతోందని రాజకీయ పార్టీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ విషయమైవిచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి.రేడియాలజిస్టు విధుల నిర్వహణ, హాజరు వివరాలు, రోగులను ప్రైవేట్ ఆస్పత్రులకు రిఫర్ చేసిన ఆరోపణలపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నాయి. ఈ విషయమై తమకు ఏదైనా ఫిర్యాదు అందితే విచారించి చర్యలు తీసుకుంటామని ఆసుపత్రి సూపరింటెండెట్ డాక్టర్ రాజశేఖర్ తెలిపారు. ఇదే విషయమై తమ వివరణ కోసం సంబంధిత జిల్లా స్థాయి ఉన్నతాధికారిని సంప్రదించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

## నెహ్రూ మెమోరియల్ పాఠశాల స్థలంలో టీఎంసీ పాఠశాల నిర్మించాలి

**వరంగల్, జూలై 27, నేటి శుభోదయ :**
నెహ్రూ మెమోరియల్ ఎయిడెడ్ ప్రాథమి ఉన్నత పాఠశాల స్థలంలో ప్రభుత్వ తెలంగాణ మోడల్ హై స్కూల్(టిఎంసి)నిర్మించాలని బీఎస్పీ తూర్పు నియోజకవర్గ ఇన్చార్జి జన్ను అనిల్ కుమార్ అన్నారు.వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా పాలన ప్రజల వినతి కార్యక్రమంలో భాగంగా బీఎస్పీ వరంగల్ తూర్పు నియోజకవర్గ ఇన్చార్జి జన్ను అనిల్ కుమార్ ఆధ్వర్యంలో కలెక్టర్ డాక్టర్ సత్య శారద కు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా జన్ను అనిల్ కుమార్ మాట్లాడుతూ..వరంగల్ నగరంలోని దేశాయిపేట ప్రాంతంలో నెహ్రూ మెమోరియల్ ఎయిడెడ్ హై స్కూల్ గత కొన్ని ఏండ్లుగా నెహ్రు మెమోరియల్ సంస్థ ఈ పాఠశాల నిర్వహించారు. ఈ పాఠశాల శిథిలావస్థకు చేరడంతో ఇందులో చదువుకునే విద్యార్థులను , ప్రక్కన ఉన్న దేశాయిపేట పాఠశాలకు బదిలీ చేయడం జరిగినది,ఈ పాఠశాలను మూసివేశారు.పాఠశాల ఖాళీ స్థలం సుమారు 5 ఎకరాల విలువైన ప్రభుత్వ భూమి కలదు.ప్రస్తుతం ఈ భూమి ఎటువంటి రక్షణ లేక ఖాళీగా ఉండటం వల్ల కొందరు రియల్ ఎస్టేట్ భూ కబ్జాదారులు ఆక్రమించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. కాబట్టి ఈ ప్రభుత్వ భూమికి రక్షణ కల్పించాలని కలెక్టర్ ను కోరారు. ఈ స్థలంలో తెలంగాణ మోడల్ హై స్కూల్(టిఎంసి)నిర్మించాలని ఈ ప్రాంతంలో చుట్టుపక్కల పేద, మధ్య





తరగతి కుటుంబాలు ఎక్కువగా నివసిస్తున్నారు. ఇక్కడ ఎల్ కే జి నుండి ఇంటర్మీడియట్ వరకు ఉచితంగా నాణ్యమైన విద్యను అందించే ప్రభుత్వ పాఠశాల లేదు. విద్యార్థులు చాలా దూరం ప్రాంతాలకు వెళ్లి ప్రైవేట్ పాఠశాలల్లో చదవాల్సి వస్తోందని కలెక్టర్ కు వెల్లడించారు.పాఠశాల స్థలానికి ఫెన్సింగ్ వెయ్యాలి నెహ్రూ మెమోరియల్ పాఠశాల స్థలానికి వెంటనే సదరు అధికారులు 5 ఎకరాల ప్రభుత్వ భూమిని సర్వే చేయించి, హద్దులు నిర్ణయించి, కబ్జా కాకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేసి రక్షించవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా అధ్యక్షులు బస్కె నాగరాజు,ప్రధాన కార్యదర్శి పోలేపాక శ్రీధర్, కార్యదర్శి జన్ను మనోహర్,వర్ధన్నపేట ఇంచార్జ్ అడ్డూరి సమ్మయ్య,బీఎస్పీ సీనియర్ నాయకులు ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు

## తెలంగాణ జర్నలిస్టుల జట్టుకు మంత్రి పొంగులేటి అభినందనలు





**ఖమ్మం, జూలై 27, నేటి శుభోదయ :**
ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ జర్నలిస్టుల అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడ లయోలా కాలేజీ మైదానంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన తెలంగాణ స్పోర్ట్స్ జర్నలిస్టుల జట్టుకు తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హృదయపూర్వక అభినందనలు తెలిపారు.ఈ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించి విజయాన్ని అందించిన ఉమ్మడి ఖమ్మం జిల్లా హెచ్‌ఎంటీవీ ప్రతినిధి మానుకొండ రవికిరణ్ ను మంత్రి పొంగులేటి ప్రత్యేకంగా ప్రశంసించారు. మన ఖమ్మం జిల్లాకు చెందిన విలేకరి సారథ్యంలో తెలంగాణ జట్టు అంతర్రాష్ట్ర స్థాయిలో ఛాంపియన్‌గా నిలవడం గర్వకారణమని కొనియాడారు.క్రీడలు మానసికోల్లాసంతో పాటు జర్నలిస్టుల మధ్య ఐక్యతను, రెండు రాష్ట్రాల ప్రతినిధుల మధ్య స్నేహ సంబంధాలను బలోపేతం చేస్తాయని స్పష్టం చేశారు. భవిష్యత్తులోనూ తెలంగాణ స్పోర్ట్స్ జర్నలిస్టుల జట్టు ఇలాంటి విజయాలను మరెన్నో సాధించాలని ఆకాంక్షించారు.

# రేజింతల్ గ్రామంలో శ్మశాన వాటిక స్థలం కేటాయించా





**సంగారెడ్డి, జూలై 27, నేటి శుభోదయ :** గ్రామస్థులు మృతిచెందితే ఎక్కడ పెట్టాలో తెలియక నిత్యం నరకయాతనఆరడుగుల జాగకోసం గ్రామస్థుల ఆక్రందనకలెక్టర్ పరిష్కారం చూపాలి: సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు సిపిఎం ఆధ్వర్యంలో గ్రామస్థులతో కలిసి ధర్నా... సదాశివపేట మండలం రేజింతల్ గ్రామంలో దళితులు, మైనార్టీలు, బీసీ, పేదల స్మశాన వాటిక సమస్య వెంటనే పరిష్కారం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ప్రభుత్వంను డిమాండ్ చేశారు. నేడు సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆఫీస్ వద్ద స్మశాన వాటికకు స్థలం కేటాయింపు చేయాలని ధర్నా చేసి కలెక్టర్ కు వినతి పత్రం జరిగింది.ధర్నా కు ముందు కేకే భవన్ నుండి కలెక్టర్ ఆఫీస్ వరకు ప్రదర్శన చేయటం జరిగింది.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రేజింతల్ గ్రామంలో శ్మశాన వాటిక స్థలం కేటాయించాలని ప్రభుత్వం ను డిమాండ్ చేశారు.గ్రామపంచాయతీ తీర్మానం ప్రకారం సర్వే నెంబరు 149లో ఉన్న 4.09 ఎకరాలు ప్రభుత్వ భూమిని స్మశాన వాటిక స్థలం వెంటనే కేటాయించాలని అన్నారు. స్వాతంత్రం వచ్చి 79 ఏళ్లు అవుతున్న కనీసం బొంద పెట్టుకోవడానికి జాగలేక ప్రజలు అనేక రకాల అవస్థలుపడు తున్నారని అన్నారు.ప్రభుత్వం మారిన ప్రజలు బ్రతుకులు మారటం లేదని అన్నారు. పేదలను పాలకులు పట్టించుకోవ దంలేదని విమర్శించారు. దళితులు బలహీన వర్గాలకు స్మశాన వాటికకు నిధులు కేటా యించాలని జీవోలు మార్గదర్శకాలు ఉన్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శిం చారు ఇప్పటికైనా కలెక్టర్,ప్రజాప్రతినిదులు దృష్టి పెట్టి సమస్యను వెంటనే పరిష్కరించా లని అన్నారు. రేజింతల్ గ్రామం సమస్య పరిష్కారం అయ్యేంతవరకు సిపిఎం పార్టీ వెన్నంటి ఉంటదని ఉన్నారు గ్రామ ప్రజలం దరూ ఐక్యంగా ఉద్యమించాలని అన్నారు. ప్రజా పోరాటానికి ఎంత పెద్ద వారైనా, ప్రభుత్వం అయినా తలవంచాల్సిందేనని అన్నారు. రేజింతల్ గ్రామంలో స్మశాన వాటిక సమస్య పరిష్కారం అయ్యేంతవరకు పోరాటం చేస్తామని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ప్రవీణ్ కుమార్ అన్నారు. ప్రభుత్వం వెంటనే సమస్యను పరిష్కరించ కుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం స్థలం కేటాయింపు చేయకపోతే ప్రజలే తిరుగు బాటు చేసి ఆక్రమిస్తారని అన్నారు. ఈ కార్య క్రమంలో సిపిఎం పార్టీ నాయకులు యస్.రమేష్ గౌడ్ పి.అశోక్, గ్రామ ప్రజలు వీరస్వామి, గోపాల్,భాస్కర్, సంయోజన్, మోహన్, రమేష్,బుచ్చయ్య, మానేయ,ఆనందం, శివయ్య,చంద్రయ్య, వినయ్ తదితరులు పాల్గొన్నారు

# ఎస్ఐఆర్–2026 పనులను వేగవంతం చేయాలి



**ఖమ్మం, జూలై 27, నేటి శుభోదయ :** ఎస్ఐఆర్–2026 ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ, మ్యాపింగ్, డిజిటలైజేషన్ ప్రక్రియపై మున్సిపల్ కమిషనర్ అభిషేక్ ఆగస్య సంబంధిత ఏఈఆర్ఓలు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వ హించారు.ఈ సందర్భంగా ఇప్పటివరకు జరిగిన పనుల పురోగతిని అధికారి వారీగా పరిశీలించారు. ప్రతి ఏఈఆర్ఓ పరిధిలో ఎంత శాతం ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ పూర్తయింది, ఎంత మేరకు మ్యాపింగ్ పూర్తయింది, డిజిటలైజేషన్ ప్రక్రియ ఏ దశలో ఉందనే అంశాలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి అధికారి తమ పరిధిలోని పురోగతిని నివేదించగా, వాటిని కమిషనర్ సమగ్రంగా పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు.ఇప్పటివరకు ఎన్యూమ రేషన్ ఫారాల సేకరణతో పాటు డిజిటలైజేషన్ ప్రక్రియ కూడా సంతృప్తికరంగా కొనసాగుతోందని పేర్కొన్న కమిషనర్, ఇక మిగిలిన పనులను మరింత వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ఫారాల్లో ఉన్న సవరణలు, మ్యాపింగ్ ప్రక్రియలను వంద శాతం పూర్తి చేసి, ప్రతి ఓటరు వివరాలు కచ్చితంగా నమోదు అయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకో వాలని సూచించారు.సమీక్షలో అధికారులు కొంతమంది ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారాలు తీసుకున్నప్పటికీ ఇప్పటివరకు తిరిగి సమ ర్పించడం లేదని కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన కమిషనర్, అటువంటి ఓటర్లను నిర్లక్ష్యం చేయకుండా వారి నివాసాలకు వ్యక్తిగతంగా వెళ్లి కలవాలని, అవసరమైతే మొబైల్ ఫోన్ ద్వారా సంప్రదించి ఫారాలను సేకరించాలని సూచించారు. ఫారాలు అందిన వెంటనే వాటిని ఆలస్యం చేయకుండా డిజిటలైజే షన్ ప్రక్రియ పూర్తి చేసి సంబంధిత పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు.ప్రతి ఫారం సక్రమంగా పరిశీలించబడేలా చర్యలు తీసుకోవాలని, ఎలాంటి తప్పిదాలు లేకుండా నాణ్యతతో కూడిన డేటా నమోదు జరిగేలా అధికారులు పర్యవేక్షించాలని కమిషనర్ సూచించారు. క్షేత్రస్థాయిలో బిఎల్ఓ లు, సూపర్వైజర్లు, ఏఈఆర్ఓ లు పరస్పర సమన్వయంతో పనిచేసి మిగిలిన ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ, మ్యాపింగ్, డిజిటలైజేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు.

# 09 సెప్టెంబర్ న జిల్లాలో నూతన కమిటీలు ఎన్నుకోవాలి : ఎంఎస్పి జాతీయ నాయకులు వరంగల్ జిల్లా ఇంచార్జి.వంగూరి ఆనంద్ రావ్ మాదిగ సూచన



**వరంగల్, జూలై 27, నేటి శుభోదయ :** మత దురహంకారం, కుల వివక్షత,సాంఘీక అసమానతలు లేని సమ సమాజ నిర్మాణం కోసం శ్రమిద్దమని ఎంఎస్పి జాతీయ నాయకులు వరంగల్ జిల్లా ఇంచార్జి,వంగూరి ఆనంద్ రావ్ మాదిగ అన్నారు. సోమవారం వరంగల్ నగరంలోని కాశిబుగ్గ నందు లక్ష్మీపురం కమ్యూనిటీ హాల్ లో ఎమ్మార్పీఎస్,ఎంఎస్పి అనుబంధ సంఘాల విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటులో భాగంగా ఎమ్మార్పీఎస్ మాజీ జిల్లా అధ్యక్షులు కట్ల రాజశేఖర్ మాదిగ అధ్యక్షతన,ముఖ్య అతిథిగా ఎంఎస్పి జాతీయ నాయకులు వరంగల్ జిల్లా ఇంచార్జి వంగూరి ఆనంద్ రావు మాదిగ పాల్గొని మాట్లాడుతూ.. 09 సెప్టెంబర్ 2026న మండల నాయకులతో జాతీయ సదస్సు నిర్వహించబోతున్నామని అందులో భాగంగా జిల్లా,మండల, గ్రామాల నూతన కమిటీలను నిర్మాణం చేయాలని 20 సెప్టెంబర్ లోపు నూతన జిల్లా కమిటీ ఏర్పాటు చేసుకోవాలని అంతే కాకుండా నిర్మాణ క్రమంలో ఎన్నకోబడే కమిటీలు గ్రామీణ స్థాయిలో వెళ్లినప్పుడు రాజ్యాంగ స్పూర్తిని నిండుగా మన మనసులో నింపుకొని కుల దురహంకార, కుల వివక్షత సాంఘీక అసమానతలు లేని సమ సమాజం కోసం జరిగే కార్యనిర్వహణకై నూతన కమిటీల నిర్మాణాలు చేపట్టాలని పిలుపునిచ్చారు.ఈ కార్య క్రమంలో..ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు మాసాని గోపాల్ మాదిగ,జిల్లా ధర్మన్న మాదిగ, గంగారపు మల్లన్న మాదిగ, కన్నేబోయిన ప్రమోద్ మాదిగ,ముత్యాల మల్లేష్ మాదిగ,విహెచ్పి ఎస్ జిల్లా నాయకులు చంద్ర శేఖర్ మాదిగ,ఇస్సంపెల్లి రాజు మాదిగ,కి షోర్ మాదిగ,పరికి రత్నం మాదిగ,కోదూరి రాజు మాదిగ,వక్కల కుమార్ మాదిగ, చాడ కరుణాకర్ మాదిగ, ఐత చంద్రమౌళి మాదిగ,సీనపాక రాజు మాదిగ,భాస్కర్,పోలేపాక సుందర్,నర్సయ్య,పరశురాములు మరియు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి : స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ



**ఖమ్మం, జూలై 27, నేటి శుభోదయ :** ప్రజలు తమ సమస్యలు తెలుపుతూ సమర్పించిన దరఖాస్తులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ జిల్లా అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రజల అర్జీలను స్వీకరించారు.రఘునాథపాలెం మండలం వి. వెంకటాయపాలెం గ్రామానికి చెందిన కే. సక్కుబాయమ్మ గ్రామ సర్వే నెంబర్ 257/ఎఏ లో ఉన్న 5 ఎకరాల 26 గంటలకు జారీ చేసిన నాలా అనుమతిని రద్దుచేసి ఈ పాస్ పట్టాదార్ పాస్ పుస్తకం మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, తహసిల్దార్ కు రాస్తూ అవసర మైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు.ఖమ్మం రూరల్ మండలం పల్లెగూడెం గ్రామ పాలకవర్గ సభ్యులు తమ గ్రామంలో రోడ్డు విస్తరణలో తొలగిస్తున్న అంబేద్కర్ విగ్రహం గ్రామపంచాయతీ కార్యాలయం ప్రక్కన ఉన్న ప్రభుత్వం స్థలంలో సురక్షితంగా మార్చడానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఎంపీడీవో ఖమ్మం రూరల్ మండలానికి తగు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. పి.డి.ఎస్.యూ. ఖమ్మం జిల్లా కమిటీ సభ్యులు జిల్లా వ్యాప్తంగా ఉన్న సంక్షేమ హాస్టల్ల సమస్యలను పరిష్కరించాలని, విద్యార్థులకు పరుపులు, బెడ్లు అందించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా సంబంధిత అధికారులకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్ఓ సీహెచ్. రామ్మూర్తి , జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రూ. రెండు కోట్ల కు పురుగు మందుల వ్యాపారి ఐపీ

**ఖమ్మంలీగల్, జూలై 27, నేటి శుభోదయ :** కామేపల్లి మండలంకు చెందిన పురుగు మందుల వ్యాపారి ధరావత్ శేఖర్ స్థానిక ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో రూ. 2,69,42,313 /– కు ఐపీ దాఖలు చేశారు. మొత్తం 54 మంది రుణదాతలను ప్రతివాదులుగా చేర్చారు. కేసు వివరాల ప్రకారం.. పిటిష నర్ శేఖర్ ఖమ్మం పట్టణంలో పురుగు మందుల వ్యాపారం చేశారు. ఈ వ్యాపారాన్ని అబివృద్ధి చేయడం కోసం అధిక వడ్డీ లకు బంధువుల దగ్గర స్నేహితులు దగ్గర అధిక మొత్తంలో అప్పులు తీసుకున్నాడు. ఈ వ్యాపారం లో తీవ్ర నష్టాలు రావడంతో బాకీలు తీర్చలేని పరిస్థితి ఏర్పడిందని, తనను దివాలా దారుని గా ప్రకటించాలని కోరుతూ న్యాయవాది ద్వారా కోర్టులో ఐపీ దాఖలు చేశాడు.

# రూ. 35 లక్షల కు వ్యాపారి ఐపీ

**ఖమ్మంలీగల్, జూలై 27, నేటి శుభోదయ :** కామేపల్లి మండలంకు చెందిన పురుగు మందుల వ్యాపారి ధరావత్ లాలు స్థానిక ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో రూ.35,22,127 /– కు ఐపీ దాఖలు చేశారు. మొత్తం 13 మంది రుణదాతలను ప్రతివాదులుగా చేర్చారు. కేసు వివరాల ప్రకారం.. పిటిష నర్ లాలు ఖమ్మం పట్టణంలో వ్యవసాయ ఉత్పత్తులను అమ్మే వ్యాపారం చేసినాడు. ఈ వ్యాపారాన్ని అబివృద్ధి చేయడం కోసం అధిక వడ్డీ లకు బంధువుల దగ్గర స్నేహితులు దగ్గర అధిక మొత్తంలో అప్పులు తీసుకున్నాడు. ఈ వ్యాపారం లో తీవ్ర నష్టాలు రావడంతో బాకీలు తీర్చలేని పరిస్థితి ఏర్పడిందని, తనను దివా లాదారుని గా ప్రకటించాలని కోరుతూ న్యాయవాది ద్వారా కోర్టులో ఐపీ దాఖలు చేశాడు.

# షాబాద్ ఎస్ హెచ్ఓగా లక్ష్మిరెడ్డి బాధ్యతల స్వీకారం - మర్యాదపూర్వకంగా కలసి అభినందించిన బీజేపీ నాయకులు




**షాబాద్ జులై 27, నేటి శుభోదయ :** ఇటీవల బదిలీపై షాబాద్ ఎస్ హెచ్ఓ గా బాధ్యతలు స్వీకరించిన లక్ష్మి రెడ్డిని సోమవారం షాబాద్ పోలీస్ స్టేషన్‌లో సర్దార్ నగర్ గ్రామ బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఐ లక్ష్మి రెడ్డికి శాలువా కప్పి ఘనంగా సత్కరించి, నూతన బాధ్యతల స్వీకారానికి శుభాకాంక్షలు తెలియజే శారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గతంలో వివిధ ప్రాంతాల్లో పలు హోదాల్లో సమర్థవంతంగా సేవలందించిన లక్ష్మి రెడ్డి, షాబాద్ సర్కిల్‌లోనూ ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణలో ఉత్తమ సేవలు అందించాలని ఆకాంక్షించారు. ప్రజల సహకారంతో పోలీసు–ప్రజల మధ్య సత్సంబంధాలు మరింత బలోపేతం కావాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో మర్పల్లి విష్ణు, మొర్సు రాజు, బండారి బాలరాజ్, మర్పల్లి చెన్నయ్య తదితర బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు పౌష్టిక అల్పాహారం పంపిణీ





**బోనకల్, జూలై 27, నేటి శుభోదయ :** విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణతో పాటు వారి పోషకాహార స్థాయిని మెరుగుప రిచే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం, హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు పౌష్టికాహారం అందించే కార్యక్రమాన్ని ప్రారంభిం చింది. ఇందులో భాగంగా సోమవారం బోనకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అల్పాహారంగా రాగి ఇడ్లీ, సాంబారు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో బోనకల్ ఉప సర్పంచ్ బాణావత్ కొండ, గ్రామపంచాయతీ సిబ్బంది, కళాశాల ప్రిన్సిపల్ శ్రీమతి నళిని శ్రీ పాల్గొని విద్యార్థులకు స్వయంగా అల్పాహారం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థులకు సమతుల్యమైన పౌష్టికాహారం అందించడం ద్వారా వారి శారీరక, మానసిక వికాసానికి తోడ్పాటు లభిస్తుందని తెలిపారు. రాగి వంటి పోషక విలువలు అధికంగా ఉన్న ఆహార పదార్థాలను అందించడం వల్ల విద్యార్థుల్లో ఆరోగ్యం మెరుగుపడి, చదువుపై ఏకాగ్రత పెరుగుతుందని పేర్కొన్నారు.విద్యార్థులు ఈ కార్యక్రమంపై ఆనందం వ్యక్తం చేస్తూ, ప్రభుత్వం మరియు హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కళాశాలలో ఇలాంటి పౌష్టికాహార కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు జోనతాన్ బాబు, రాజేంద్ర కుమార్, లక్ష్మీకాంతం పద్మావతి, రామకృష్ణ, రమేష్, రాజేంద్ర, తిరుపతి రావు, ప్రియ కుమార్ రెడ్డి, మురళీకృష్ణ, యశోద, శాంతి ప్రియ, లైబ్రరీన్ మోహన్, యుడిసి మదర్ సాహెబ్, జశ్వంత్, బుజ్జమ్మ, అరుణ మరియు విద్యార్థులు పాల్గొన్నారు

## కళ్యాణలక్ష్మి పంచనామా కోసం లంచం.. ఏసీబీ వలలో మోత్కూర్ గ్రామ పాలనాధికారి



**వికారాబాద్ , జూలై 27, నేటి శుభోదయ :**
పరిగి: కళ్యాణలక్ష్మి పథకం పంచనామా నిర్వహించేందుకు లంచం డిమాండ్ చేసిన మోత్కూర్ గ్రామ పాలనాధికారి (జీపీవో) జగదీశ్‌ను అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ విషయాన్ని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ వెల్లడించారు.దోమ మండలం మోత్కూర్ గ్రామానికి చెందిన ఓ మహిళ కళ్యాణలక్ష్మి దరఖాస్తు ప్రక్రియలో భాగంగా పంచనామా నిర్వహించేందుకు జగదీశ్ రూ.6 వేల లంచం డిమాండ్ చేసినట్లు తెలిపారు. తాము పేద కుటుంబానికి చెందిన వారమని, అంత మొత్తం ఇవ్వలేమని బాధితురాలు వేడుకున్నప్పటికీ అతడు అంగీకరించకపోవడంతో ఆమె ఏసీబీ అధికారులను ఆశ్రయించింది.ఏసీబీ అధికారుల సూచనల మేరకు బాధితురాలు జగదీశ్‌కు రూ.2 వేల నగదు అందజేస్తుండగా అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం దోమ మండల పరిషత్ కార్యాలయానికి తరలించి విచారణ చేపట్టారు.విచారణలో లంచం డిమాండ్ చేసిన విషయాన్ని జగదీశ్ ఒప్పుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ వ్యవహారంలో ఇతరుల ప్రమేయం లేదని ప్రాథమిక విచారణలో తేలిందని, అయితే అతనిపై ఉన్న ఇతర ఆరోపణలపైనా పూర్తి స్థాయిలో దర్యాప్తు కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపరచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించనున్నట్లు వెల్లడించారు.ప్రభుత్వ కార్యాలయాల్లో ఏ శాఖకు చెందిన అధికారులైనా ప్రజలు, రైతుల పనులను ఆసరాగా చేసుకుని లంచాలు డిమాండ్ చేస్తే వెంటనే ఏసీబీ అధికారులను సంప్రదించాలని డీఎస్పీ ఆనంద్ కుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## గురుకుల పాఠశాలల్లో కౌన్సిలింగ్ ద్వారా సీట్ల భర్తీ



**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 27, నేటి శుభోదయ :**
ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ ఆదేశాల మేరకు గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని గిరిజన గురుకుల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి కౌన్సిలింగ్‌ను పకడ్బందీగా నిర్వహించినట్లు ఆర్‌సీఓ అరుణకుమారి తెలిపారు.సోమవారం భద్రాచలంలోని గిరిజన గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు బాలికల ప్రవేశాల కోసం నిర్వహించిన కౌన్సిలింగ్ ప్రక్రియను ఆమె పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని గిరిజన గురుకుల పాఠశాలల్లో ఐదో నుంచి తొమ్మిదో తరగతి వరకు ఖాళీగా ఉన్న 336 సీట్ల భర్తీ కోసం కౌన్సిలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో 94 మంది బాలురు, 247 మంది బాలికలకు ప్రవేశ పరీక్షల్లో సాధించిన మెరిట్ ఆధారంగా నియోజకవర్గాల వారీగా ఖాళీలు ఉన్న పాఠశాలల్లో సీట్లు కేటాయించినట్లు వెల్లడించారు.కౌన్సిలింగ్‌కు హాజరైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడిన అరుణకుమారి, గురుకుల పాఠశాలలో సీటు లభించడం మంచి అవకాశమని, ఎక్కడ సీటు కేటాయించినా తప్పనిసరిగా ప్రవేశం పొందాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వివిధ గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లు మాధవీలత, చైతన్య, హరికృష్ణ, భద్రయ్యతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వైరా పట్టణ అభివృద్ధికి మరో ముందడుగు




**వైరా , జూలై 27, నేటి శుభోదయ :**
తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సహకారంతో, వైరా శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ ప్రత్యేక చొరవతో వైరా మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయి.ఈ క్రమంలో వైరా మున్సిపాలిటీలో నూతనంగా నిర్మించనున్న షాపింగ్ కాంప్లెక్స్ స్థలాన్ని మున్సిపల్ ఛైర్‌పర్సన్ డాక్టర్ కాపాచంద్రకళమురళీకృష్ణ పరిశీలించారు.ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రామచందర్ రావు ఏఈ శ్రీమన్య గారు, తోటకూర శ్రీకాంత్ మరియు ఇతర మున్సిపల్ అధికారులు పాల్గొని, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి సంబంధించిన ప్రణాళికలు, స్థల పరిస్థితులు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు.

## కాకతీయ రాజుల స్ఫూర్తితో దేవాలయాల నిర్మాణం.. భక్తి చాటుతున్న భాస్కర్ నాయక్

**మిడ్జిల్, జూలై 27,, నేటి శుభోదయ :**
కాకతీయ రాజులు దేవాలయ నిర్మాణాలను రాజధర్మంగా భావించి సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించినట్లే, నేటి కాలంలో అదే స్ఫూర్తితో సామాజిక సేవకుడు జర్పుల భాస్కర్ నాయక్ దేవాలయాల నిర్మాణం, అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారు. గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణాన్ని పెంపొందించడంతో పాటు ప్రజల్లో ఐక్యత, సంస్కృతి పరిరక్షణ లక్ష్యంగా ఆయన చేపడుతున్న సేవా కార్యక్రమాలు ప్రశంసలు అందుకుంటున్నాయి.భాస్కర్ నాయక్ తన సొంత నిధులతో పలు గ్రామాల్లో ఆలయాల నిర్మాణం, మరమ్మతులు, అభివృద్ధి పనులకు ఆర్థిక సహాయం అందిస్తూ భక్తుల అభిమానాన్ని చూరగొంటున్నారు.దేవాలయాలు కేవలం పూజా స్థలాలు మాత్రమే కాకుండా సమాజాన్ని ఒక తాటిపైకి తీసుకువచ్చే కేంద్రాలుగా నిలవాలనే ఉద్దేశంతో ఆయన చేస్తున్న సేవలను గ్రామస్తులు అభినందిస్తున్నారు.ఇటీవల నిరుపేదల వైద్యానికి సహాయం, తాగునీటి సమస్య పరిష్కారం, సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు దేవాలయాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న భాస్కర్ నాయక్ సేవాభావానికి స్థానికులు ప్రశంసలు కురిపిస్తున్నారు. కాకతీయుల వారసత్వాన్ని గుర్తు చేసేలా దేవాలయాల పరిరక్షణ, నిర్మాణం చేపడుతూ భక్తి, సంస్కృతి, సేవ అనే మూడు విలువలను సమన్వయం చేస్తున్న నాయకుడిగా ఆయన పేరు తెచ్చుకుంటున్నారు.ప్రజా సేవతో పాటు ఆధ్యాత్మిక సేవ కూడా సమాజ అభివృద్ధికి ఎంతో అవసరమనే భావనతో



ముందుకు సాగుతున్న భాస్కర్ నాయక్, భవిష్యత్తులో మరిన్ని దేవాలయాల అభివృద్ధికి సహకారం అందిస్తానని పేర్కొన్నట్లు గ్రామస్థులు తెలిపారు. దీంతో ఆయన సేవలు ప్రజల్లో విశేష ఆదరణ పొందుతున్నాయి.

## సర్ కార్యక్రమంలో బిఎల్ఏ లదే కీలక పాత్ర

### -సిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి

**సంగారెడ్డి, జూలై 27, నేటి శుభోదయ :** నారాయణ ఖేడ్ నియోజకవర్గ కాంగ్రెస్ బి.ఎల్. ఏలతో సమీక్ష సమావేశం లో పాల్గొన్న ఎమ్మెల్యే సంజీవ్ రెడ్డి, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఫహీం ఓటరు జాబితా సమగ్ర ప్రత్యేక సవరణ కార్యక్రమానికి మరో వారం రోజులు గడువు ఉన్నందునఅరుకైన వారందరి ఎనోల్మెంట్స్ ఫారాలను బీఎల్వోలకు ఇప్పించడంలో బీఎల్ఎలదే కీలక పాత్ర అని టీపీఐఐసీ చైర్మన్ డీసీసీ అధ్యక్షురాలు నిర్మలాజగ్గారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఖేడ్లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ బీఎల్ఎలతో సమావేశాన్ని నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో నారాయణ్ ఖేడ్ ఎమ్మెల్యే సంజీవ్ రెడ్డి, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఫహీం లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఓటరు ఎన్రోల్మెంట్ ఫారాలను అందించారా లేదా అనే విషయాలను గ్రామాల్లోని ప్రతిబూత్ పరిధిలో ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలుసుకొని బిఎల్వోలకు ఫారాలు పూరించి అందజేసే విధంగా చూడాలన్నారు.అగస్టు 3 వరకు మాత్రమే ఎనోల్మెంట్ ఫారాలను అందించడానికి గడువు ఉందన్నారు. ఎవరైనా ఫారాలు నింపడంలో ఇబ్బందులకుగురవుతుంటే, వారికి సహకరించి ఫారాలు ఇప్పించాలన్నారు. ఇంకా సమర్పించని వారిని గుర్తించి అవసరమైన సూచనలు సలహాలు ఇచ్చి ఫారాలను అందజేసేలా బాధ్యత తీసుకోవాలన్నారు. స్థానికంగా ఉండని



వారి వివరాలు సేకరించి వారు కూడా ఫారాలు సమర్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అందువల్ల సమయం సమీపిస్తున్నందున సమన్వయంతో పని చేస్తూ ప్రక్రియను నూటికి నూరు శాతం పూర్తి చేయాలన్నారు. ప్రక్రియ అమలు, బూత్లవారీగా కార్యాచరణ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించి పలు కీలక సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్వైస్ చైర్మదారం శంకర్, కౌన్సిలర్లు లక్ష్మణ్, సురేష్, సేవాలాల్ సంఘం రాష్ట్ర నాయకులు రమేష్ చౌహాన్, పీఏసీఎస్ చైర్మన్ శోభాఅశోకొరెడ్డి, మైనార్టీ నాయకుడు తాహెర్, మండలాల అధ్యక్షులు జ్ఞాన్రెడ్డి, శ్రీనివాసరావు, లింగారెడ్డి, సర్దార్, యాదవ రెడ్డి, సర్పంచులు, ఉప సర్పంచులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సహకారంతో అంబేడ్కర్ కళాభవన్ కు రూ.1.90 కోట్ల మంజూరు

**మిడ్జిల్, జులై 27,, నేటి శుభోదయ :**
స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ప్రత్యేక చొరవ, సహకారంతో మిడ్జిల్ మండల కేంద్రంలో అంబేద్కర్ కళాభవన్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.1.90 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఈ నిధులతో ఆధునిక సౌకర్యాలతో కళాభవన్ నిర్మించనున్నట్లు సమాచారం.అంబేద్కర్ కళాభవన్ నిర్మాణం పూర్తయితే సామాజిక, సాంస్కృతిక, విద్యా, అవగాహన కార్యక్రమాల నిర్వహణకు శాశ్వత వేదికగా నిలవనుంది. ముఖ్యంగా దళిత సంఘాలు, యువజన సంఘాలు, సామాజిక సంస్థలకు ఈ భవనం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.ఈ నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డికి స్థానిక ప్రజలు, అంబేద్కర్ సంఘాల నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. మిడ్జిల్ అభివృద్ధిలో ఇది మరో కీలక మైలురాయిగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు. త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉందని వెల్లడించారు.

## మణుగూరులో 4.760 కిలోల ఎండు గంజాయి స్వాధీనం...

**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 27, నేటి శుభోదయ :**
ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎక్సైజ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో 4.760 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో ఒక వ్యక్తితో పాటు ఓ మైనర్‌ను అదుపులోకి తీసుకుని, ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ వి. సోమిరెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ ఆర్. కిషన్ ఆదేశాల మేరకు ఎక్సైజ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఎస్ఐ సి.హెచ్. శ్రీహరి రావు ఆధ్వర్యంలో అశ్వాపురం మండలం గొల్లగూడెం గ్రామంలోని సీతారామ కాలువ వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానాస్పదంగా వెళ్తున్న హీరో గ్లామర్ (ఏపీ 24 ఏఎస్ 6802) ద్విచక్ర వాహనాన్ని తనిఖీ చేయగా 4.760 కిలోల ఎండు గంజాయి లభ్యమైంది.గంజాయిని కలిమెల నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్న జాల సందీప్ (నల్గొండ జిల్లా హనుమాన్‌నగర్ నివాసి)తో పాటు ఒక మైనర్‌ను అదుపులోకి తీసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి, ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్ కలిపి మొత్తం



రూ.2.96 లక్షల విలువ ఉంటుందని అధికారులు తెలిపారు. అనంతర విచారణ నిమిత్తం కేసు నమోదు చేసి స్వాధీనం చేసిన వస్తువులను మణుగూరు ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించారు.ఈ తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ ఖలీల్ అహ్మద్, కానిస్టేబుళ్లు వీరబాబు, ప్రసన్నకుమార్, తిరుపతి, ఉపేందర్ పాల్గొన్నారు.మత్తు పదార్థాల సమాచారం ఉంటే టోల్‌ఫ్రీ నంబర్ 1800–425–2523కు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620

## క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలి

### : అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ



**ఖమ్మం,జూలై 27, నేటి శుభోదయ :** క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం–2010 ప్రకారం వైద్య సంస్థల నమోదు, పునరుద్ధరణ ప్రక్రియలో నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి మల్టీ మెంబర్ అప్రోప్రియేట్ అథారిటీ కమిటీ సమావేశంలో అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ పాల్గొని జిల్లా లోని వైద్య సంస్థల రిజిస్ట్రేషన్, పునరుద్ధరణ, నిబంధనల అమలు అంశాలపై సమీక్షించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ వైద్య సంస్థలకు రిజిస్ట్రేషన్ లేదా రెన్యువల్ మంజూరు చేసే ముందు ప్రతి ఆసుపత్రిని క్షేత్రస్థాయిలో పూర్తి స్థాయిలో తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టంలోని అన్ని నిబంధనలు తప్పనిసరిగా అమలవుతున్నాయో లేదో పరిశీలించాలని, తనిఖీల్లో ఏవైనా లోపాలు గుర్తించినట్లయితే సంబంధిత ఆసుపత్రి యాజమాన్యానికి నోటీసులు జారీ చేసి, నిర్దిష్ట గడువు లోగా వాటిని సరిదిద్దేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. లోపాలను సరిచేయని వైద్య సంస్థలకు రెన్యువల్ మంజూరు చేయరాదని స్పష్టం చేశారు.ప్రతి వైద్య సంస్థలో రోగులు, వారి సహాయకుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని పార్కింగ్ సౌకర్యం తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నోటీసులు అందుకున్న వైద్య సంస్థలు లోపాలను సరిదిద్దిన అనంతరం కరెక్షన్ రిపోర్టులను సంబంధిత అధికారులకు సమర్పించాలని సూచించారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీలు), ఉప ఆరోగ్య కేంద్రాల్లో అత్యవసర మరమ్మతులు చేపట్టేందుకు అవసరమైన సామగ్రి, పనుల అంచనాలను సిద్ధం చేసి వెంటనే సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.సమావేశంలో జిల్లాలోని వైద్య సంస్థల రిజిస్ట్రేషన్ స్థితిగతులను అధికారులు వివరించారు. జిల్లాలో ఆయుష్ కేంద్రాలు, డయాగ్నస్టిక్ సెంటర్లు, ఆసుపత్రులు, క్లినిక్‌లు, దంత వైద్యశాలలు కలిపి మొత్తం 689 వైద్య సంస్థలు నమోదు కాగా, వాటిలో 595 యాక్టివ్, 94 ఇన్‌యాక్టివ్‌గా ఉన్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 47 ప్రొవిజనల్ సర్టిఫికెట్లు జారీ చేయగా, 9 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, అలాగే 25 శాశ్వత సర్టిఫికెట్లు జారీ చేయగా, 4 దరఖాస్తులు తిరస్కరించబడి, 21 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని, మరో 12 దరఖాస్తులు ట్రాఫిక్ క్లియరెన్స్ కోసం పోలీసు శాఖ వద్ద, 12 దరఖాస్తులు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ (డీఎంహెచ్ఓ) వద్ద పెండింగ్‌లో ఉన్నట్లు సమావేశంలో వివరించారు.ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రామారావు, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎల్. వేణుగోపాల్ రెడ్డి, ఐఎంఏ ప్రెసిడెంట్, ఏసిపి, తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్, డిప్యూటీ డిఎంహెచ్ఓ., కమిటీ సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ నివారిద్దాం ఆరోగ్యాన్ని కాపాడుకుందాం



**వైరా, జూలై 27, నేటి శుభోదయ :** వైరా మండలంలోని మూడు రోజుల శిక్షణ కార్యక్రమానికి ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు ప్లాస్టిక్ నివారిద్దాం ఆరోగ్యాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో ప్రజలను ప్లాస్టిక్ పట్ల అవగాహన కల్పించాలి ప్లాస్టిక్ వల్ల జరిగే నష్టాలను గురించి తెలుసుకునే విధంగా చైతన్యం చేయాలనే ఉద్దేశంతో ప్లాస్టిక్ ప్లేట్లలో భోజనం చేయకుండా తమ ఇంటి వద్ద నుండి తెచ్చుకున్న స్టీల్ ప్లేట్లలో భోజనం చేసినారు ఈ కార్యక్రమానికి గుట్ట బడి ఉపాధ్యాయులు లయన్స్ జిల్లా క్యాబినెట్ జాయింట్ ట్రెజరర్ మండల రిసోర్స్ పర్సన్లు పెనుగొండ ఉపేంద్రరావు గంజినబోయిన రామకృష్ణ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు అవేర్నెస్ కార్యక్రమంలో భాగంగా మాట్లాడుతూ ఫంక్షన్లకు వెళ్లేటప్పుడు స్టీల్ ప్లేట్లు తీసుకొని వెళ్లడం సాధ్యం కాని పక్షంలో మోదుగు ఆకులతో తయారు చేసిన వాటిని వాడే విధంగా ప్రోత్సహించాలని ఈ కార్యక్రమాన్ని నిర్వహించినారు. మండల విద్యాశాఖ అధికారి చావా శ్రీనివాసరావు, గరికపాడు కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు దొంతబోయిన సత్యనారాయణ మాట్లాడుతూ దీనిని ఆదర్శంగా తీసుకొని అందరూ ప్లాస్టిక్ నివారించే విధంగా పర్యావరణ పరిరక్షణకు చేయాలని కృషి చేయాలని ఉపాధ్యాయులను అభినందించినారు.

## కొత్తగూడెం నియోజకవర్గాన్ని మోడల్‌గా తీర్చిదిద్దుతాం

### : ఎమ్మెల్యే కూనంనేని.





**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 27, నేటి శుభోదయ :** కొత్తగూడెం నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు అన్నారు. సుజాతనగర్ మండల పరిధిలోని కార్పొరేషన్ డివిజన్‌లో రూ.1.95 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీలు, మరుగుదొడ్లు, బస్ షెల్టర్ల నిర్మాణ పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, సుజాతనగర్ కార్పొరేషన్‌లో విలీనమైన తర్వాత మౌలిక వసతుల అభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులు తీసుకొచ్చామని తెలిపారు. ప్రతి గ్రామంలో తాగునీరు, వీధి దీపాలు, డ్రైనేజీ వంటి సమస్యలు లేకుండా చర్యలు చేపడుతున్నామని చెప్పారు.సుజాతనగర్ నుంచి శివాలయం వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు నిధులు సమకూర్చామని, మున్సిపల్ సబ్ డివిజన్ కార్యాలయం ఏర్పాటు దిశగా చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. సింగభూపాలెం చెరువుకట్ట అభివృద్ధికి రూ.5.5 కోట్ల నిధులు మంజూరు కానున్నట్లు వెల్లడించారు.స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ (న్యాక్) కేంద్రాన్ని మంజూరు చేయించామని, నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతూ, పార్టీలకతీతంగా ప్రతి వర్గానికి సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధుల కోసం నిరంతరం ప్రయత్నాలు కొనసాగిస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, మున్సిపల్ కమిషనర్ సుజాత, టీపీసీసీ సభ్యులు నాగ సీతారాములు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ వీరబాబు, కార్పొరేటర్ చింతలపూడి శ్రావణి, తహసీల్దార్ కృష్ణప్రసాద్, ఎంపీడీఓ భారతి, ఏఓ నర్మద, విద్యుత్ శాఖ ఏఈ కిషన్, సీపీఐ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## భద్రాచలం పరిధిలో 57 లీటర్ల నాటు సారాయి స్వాధీనం...





**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 27, నేటి శుభోదయ :** భద్రాచలం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఎక్సైజ్ అధికారులు నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో మొత్తం 57 లీటర్ల నాటు సారాయిని స్వాధీనం చేసుకున్నారు. ఒక ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి, నలుగురిపై కేసులు నమోదు చేశారు.ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ వి. సోమిరెడ్డి, ఖమ్మం ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ ఆర్. కిషన్ ఆదేశాల మేరకు ఖమ్మం ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ చి. శ్రీహరి రావు ఆధ్వర్యంలో అధికారులు తనిఖీలు చేపట్టారు.చర్ల మండలం కలివేరు గ్రామంలోని సీఆర్పీఎఫ్ క్యాంపు సమీపంలో నిర్వహించిన వాహన తనిఖీల్లో ఓ ద్విచక్ర వాహనంలో తరలిస్తున్న 40 లీటర్ల నాటు సారాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం భద్రాచలం పట్టణంలో నాటు సారాయి విక్రయదారులపై నిర్వహించిన దాడులో మరో 17 లీటర్ల నాటు సారాయితో ముగ్గురు వ్యక్తులను పట్టుకున్నారు.స్వాధీనం చేసుకున్న మొత్తం 57 లీటర్ల నాటు సారాయి, ద్విచక్ర వాహనాన్ని తదుపరి చర్యల నిమిత్తం భద్రాచలం ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించి, సంబంధిత నిందితులపై కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.ఈ తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ ఖలీల్ అహ్మద్, కానిస్టేబుళ్లు వీరబాబు, ప్రసన్న కుమార్, తిరుపతి, ఉపేందర్ పాల్గొన్నారు.మత్తు పదార్థాలపై సమాచారం అందించండినాటు సారాయి, గంజాయి తదితర మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వారు టోల్ ఫ్రీ నంబర్ 1800–425–2523కు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

## ఉత్తమ సర్పంచ్ అవార్డు అందుకున్న సబితా గోవర్ధన్ రెడ్డి



**షాబాద్, జులై 27, నేటి శుభోదయ :** గ్రామాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచి, మల్లారెడ్డిగూడ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తున్న షాబాద్ మండలం మల్లారెడ్డిగూడ గ్రామ సర్పంచ్ అమీర్పేట సబితా గోవర్ధన్ రెడ్డికి బహుజన సాహిత్య అకాడమీ ఉత్తమ సర్పంచ్ అవార్డు లభించింది.రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అట్లూరి లక్ష్మణ్ కుమార్ చేతుల మీదుగా సబితా గోవర్ధన్ రెడ్డి ఈ అవార్డును నగరంలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సోమవారం అందుకున్నారు. గ్రామాభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలులో చూపిన విశిష్ట సేవలను గుర్తిస్తూ బహుజన సాహిత్య అకాడమీ ఈ అవార్డును ప్రదానం చేసింది.ఈ కార్యక్రమంలో ఆర్టీఐ కమిషనర్ భూపాల్, మాజీ ఎమ్మెల్సీ దిలీప్ కుమార్, బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ, రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్ పాల్గొని సబితా గోవర్ధన్ రెడ్డిని అభినందించారు. అలాగే కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు తమ్మలి రమేష్, మల్లారెడ్డిగూడ గ్రామ ఉపసర్పంచ్ మాణిక్యం తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సీతా రామ ప్రాజెక్ట్ ని వెంటనే పూర్తి చేయాలి



**ఏన్కూర్, జూలై 27, నేటి శుభోదయ :** సీతారామ ప్రాజెక్టుకు అవసరమైన పూర్తి నిధులను వెంటనే మంజూరు చేయాలి. సిపిఐ మండల కార్యదర్శి జాగర్లమూడి రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ఏన్కూరు మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ. . . . . . కామేపల్లి, కారేపల్లి తో పాటు గార్ల, భయ్యారం, డోర్నకల్లు,మహబూబాబాద్, ఖమ్మం రూరల్ ద్వారా పాలేరు వరకూ అను సంధానం చేసి నాగార్జున సాగర్ ఆయకట్టు రైతుల పంటలకు నీరు ఇచ్చి ఖమ్మం జిల్లా ను సస్యశ్యామలం చేయాలి కోరారు. ప్రభుత్వం దానికి టెండర్లను పిలుస్తమంటుంది కానీ దాని ఊసే లేదు.పాల్వంచ, జూలురుపాడు, ఏన్కూర్ కి డిస్ట్రిబ్యూటర్కెనాల్ కి టెండర్లను పిలవాల్సిన అవసరం ఉందిఆయన అన్నారు.సీతారామ ప్రాజెక్టు ద్వారా ఒక పంపు ద్వారా వచ్చే 1600 క్యూసెక్కుల నీళ్ళు ఏన్కూర్ ఎన్ ఎస్ పి కెనాల్ లోకి వస్తున్నాయిని,ఆ నీళ్లు అన్యాయంగా సిరిపురం మేజర్ ద్వారా వైరా రిజర్వాయర్ కి తరలించడం వల్ల ఈ ప్రాంత రైతులకు అన్యాయం జరుగుతుందని విమర్శించారు. ముఖ్యంగా డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మా ప్రాంత రైతులకు అన్యాయం జరగకుండా ఒక్కసారి ఆలోచించాలి కోరారు.వైరా రిజర్వాయర్ కోసం నిధులు కేటాయించి కాల్వని తీస్తున్నారు కానీ ఎలాంటి ఖర్చు లేకుండా తిమ్మారావుపేట ఎస్కేప్ ద్వారా జన్నారం వాగు నుండి వైరా రిజర్వాయర్ కి వెళుతున్నాయి. దీని వల్ల రైతులందరికీ నీళ్ళు అందుతాయి అలాంటిది కోట్లు ఖర్చుపెట్టి సిరిపురం మేజర్ కాల్వ నీ ఆధునీకరణ చేయడం ద్వారా ఈ నీళ్లను మధిరకు తరలించాలని ప్రయత్నం చేస్తున్నారని, మీ నియోజక వర్గ ప్రజలకోసం మా మండలానికి అన్యాయం చెయ్యొద్దు ఆధునీకరణ పేరుతో ఖర్చు పెట్టడంవల్ల ఉపయోగంలేదు అని అన్నారు.సీతారామ ప్రాజెక్టును పాలేరు కు అను సంధానం చేస్తే జిల్లా సస్య శ్యామలం అవుతుంది. ముగ్గురు మంత్రులు ఒక్కసారి ఆలోచించి ఖమ్మం జిల్లా ను సస్యశ్యామలం చేసి సీతారామ ప్రాజెక్ట్ అన్ని డిజైన్ లో పూర్తిచేయాలని డిమాండ్ చేశారు.

## జర్మనీలో ఉద్యోగం లక్ష్యంగా నర్సింగ్, ఫిజియోథెరపీ అభ్యర్థులకు ఉచిత జర్మన్ భాషా శిక్షణ

### : జిల్లా ఉపాధి అధికారిణి మాధవి



**ఖమ్మం, జూలై 27, నేటి శుభోదయ :** ఉమ్మడి ఖమ్మం జిల్లా నిరుద్యోగ యువతీ, యువకులకు జర్మనీలో ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో జిల్లా ఉపాధి కార్యాలయం టామ్ కామ్ ఆధ్వర్యంలో నర్సింగ్, ఫిజియోథెరపీ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులకు ఉచితంగా జర్మన్ భాషా శిక్షణ కార్యక్రమాన్ని త్వరలో ప్రారంభించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారిణి ఎన్. మాధవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.జర్మనీలో వైద్య రంగంలో అర్హత కలిగిన నర్సింగ్, ఫిజియోథెరపీ నిపుణులకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని ఈ శిక్షణా కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. జర్మన్ భాషలో నైపుణ్యం సాధించడం ద్వారా విదేశాల్లో మెరుగైన ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు.జర్మన్ భాషా శిక్షణ పూర్తయిన అనంతరం నిర్వహించే అర్హత పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు జర్మనీలో ఉద్యోగ అవకాశాల కోసం షరతులతో కూడిన ఉద్యోగ ఎంపిక ధ్రువీకరణ పత్రం అందజేయనున్నట్లు తెలిపారు.ఈ అవకాశాన్ని ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని నర్సింగ్, ఫిజియోథెరపీ కోర్సులు పూర్తి చేసిన నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి గల అభ్యర్థులు జిల్లా ఉపాధి కార్యాలయంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.మరిన్ని వివరాల కోసం ఖమ్మం కలెక్టరేట్ మొదటి అంతస్తులోని ఎఫ్ –18 లోని జిల్లా ఉపాధి కార్యాలయాన్ని సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారిణి ఎన్. మాధవి తెలిపారు.

## మేరా యువ భారత్, ఖమ్మం ఆధ్వర్యంలో నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ అనే అంశం మీద 8 రకాల పోటీలు

**ఖమ్మం, జూలై 27, నేటి శుభోదయ :**
సభారత ప్రభుత్వం ఆదేశాల మేరకు ఖమ్మం జిల్లా ఆధ్వర్యంలో తేదీ:29-07-2026 రోజు జిల్లాస్థాయిలో నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ అనే అంశం మీద 8 రకాల పోటీలు స్వర్ణ భారతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ లో నిర్వహించబడుతాయి. ఈ జిల్లా స్థాయి పోటీలలో 15 నుండి 29 సంవత్సరముల లోపు యువతీ యువకులు పాల్గొనవచ్చును. ఈ కార్యక్రమంలో కవిత్వము, పెయింటింగ్, స్లోగన్ రైటింగ్, ఉపన్యాస పోటీలు, గ్రూపు డాన్స్, గ్రూప్ సాంగ్, షార్ట్ ఫిలిం లేదా రీల్, స్కిట్ నిర్వహించబడతాయి. జిల్లా స్థాయిలో మొదటి బహుమతి సాధించిన వారికి రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనే అవకాశం ఉంటుంది. ఆసక్తి కలిగిన యువతీ యువకులు డైరెక్టుగా మధ్యాహ్నం 1:15 గంటలకు స్వర్ణభారతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో పాల్గొనగలరని తెలియజేశారు.

## దత్తాత్రేయ స్వామిని దర్శించుకున్న.. జర్నలిస్ట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి !



**సంగారెడ్డి, జూలై 27, నేటి శుభోదయ :**
హత్నూర సమీపంలోని పురాతన దత్తలయ్య గుట్టలో వెలసిన దత్తాత్రేయ స్వామి క్షేత్రాన్ని తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టి యు డబ్ల్యూ జె- ఐ జె యు) సంగారెడ్డి జిల్లా శాఖ అధ్యక్షుడు బండారు యాదగిరి సోమవారం సందర్శించారు. దత్తాత్రేయ స్వామిని దర్శించుకున్నారు.ఆలయ చైర్మన్ సభాపతి శర్మ ఆధ్వర్యంలో పూజారులు చంద్రప్రకాష్ శర్మ, సూర్య ప్రకాష్ శర్మ అర్చన జరిపారు. స్వామివారి తీర్థ ప్రసాదాలను అందించారు. ఆలయ మర్యాదలతో వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరిని సత్కరించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ... ఈ దత్తాత్రేయ క్షేత్రానికి 650 సంవత్సరాల చరిత్ర ఉన్నదని అన్నారు.ఈ క్షేత్రంలో ఏటా గురు పౌర్ణమిని పురస్కరించుకొని మూడు రోజులపాటు పెద్ద ఎత్తున బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. అందుకని స్వామివారిని దర్శించుకున్నట్లు తెలిపారు.రాష్ట్ర రాజధాని హైదరాబాదు తో పాటు పరిసర జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు ఈ క్షేత్రానికి వస్తారు.ఈసారి కూడా సోమవారం ఉదయం ఈ బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. గణపతి పూజ, చండీ హోమం, ద్వీప ప్రజ్వలన జరిపారు. దత్తాత్రేయునికి అభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. గురు పౌర్ణమిని పురస్కరించుకొని తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయని ఆలయ చైర్మన్ సభాపతి శర్మ తెలిపారు. వేలాదిగా తరలి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఉమ్మడి మెదక్ జిల్లా టి యు డబ్ల్యూ జే (ఐ జేయు) మాజీ ప్రధాన కార్యదర్శి పానుగంటి కృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యుడు శివన్న జైన్ ,వెన్న చక్రేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల సత్వర పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమం




**సంగారెడ్డి, జూలై 27, నేటి శుభోదయ :**
ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాత విచారణ జరిపి, బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచనలు – అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, ఐపీఎస్.: జిల్లా ప్రజల సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, ఐపీఎస్ తెలిపారు.ఈ రోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి, ఫిర్యాదుదారులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను ఓపికగా విన్నారు. అనంతరం సంబంధిత ఎస్హెచ్ఓలతో ఫోన్ ద్వారా మాట్లాడి సమస్యల వివరాలను తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ, స్థానిక పోలీస్ స్టేషన్లలో తమ సమస్యలకు పరిష్కారం లభించని పక్షంలో ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని సూచించారు.ప్రజావాణి ద్వారా అందిన ప్రతి ఫిర్యాదుపై జిల్లా పోలీస్ కార్యాలయం నుండి ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగుతుందని, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రజలకు త్వరితగతిన, పారదర్శకంగా న్యాయం అందించడమే సంగారెడ్డి జిల్లా పోలీస్ శాఖ లక్ష్యమని అదనపు ఎస్పీ తెలియజేశారు.

## ప్రత్యామ్నాయ పంటల సాగుతో నీటి వనరులను పరిరక్షించాలి : జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్





**ఖమ్మం, జూలై 27, నేటి శుభోదయ :**
ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులు అధిక నీటి అవసరమయ్యే పంటలకు బదులుగా తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసి నీటి వనరులను సంరక్షించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సూచించారు.సోమవారం మధిర మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన రైతు విత్తన మేళాను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం లోటు ఏర్పడటంతో భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టాయని, ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు కూడా క్రమంగా తగ్గుతున్నందున రైతులు సాగు ప్రణాళికలో మార్పులు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వరి వంటి అధిక నీటి అవసరమయ్యే పంటలకు బదులుగా కంది, పెసర, మినుములు, జొన్న, సజ్జలు, కూరగాయలు వంటి తక్కువ నీటితో సాగయ్యే పంటలను సాగు చేయాలని సూచించారు.రైతులకు అవసరమైన ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు సులభంగా అందుబాటులో ఉండేలా జూలై 27 నుండి 29 వరకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని 21 రైతు వేదికల్లో విత్తన మేళాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.ప్రతి మండలానికి ఒక రైతు వేదిక చొప్పున ఈ మేళాలను నిర్వహిస్తున్నామని, రైతులు తమకు సమీపంలోని రైతు వేదికను సందర్శించి నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేసి సద్వినియోగం చేసుకోవాలని కోరారు.--- యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నాయివానాకాలం-2026 సీజన్‌కు ఖమ్మం జిల్లాకు మొత్తం 35,267 మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించబడిందని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో ప్రైవేట్ డీలర్ల వద్ద 231.77 మెట్రిక్ టన్నులు (5,150 బస్తాలు), సహకార సంఘాల వద్ద 2,292.25 మెట్రిక్ టన్నులు (50,938 బస్తాలు), మార్క్‌ఫెడ్ ఖమ్మం వద్ద 3,153.96 మెట్రిక్ టన్నులు (70,088 బస్తాలు), సీఆర్‌పీ కమిషనర్ రిజర్వ్ పూల్‌లో 7,698.355 మెట్రిక్ టన్నులు (1,71,074 బస్తాలు), కంపెనీ గోదాముల్లో 991 మెట్రిక్ టన్నులు (22,022 బస్తాలు) అందుబాటులో ఉన్నాయని వివరించారు. మొత్తం 3,19,272 యూరియా బస్తాలు జిల్లాలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.జిల్లాలో ఇప్పటివరకు యూరియా యాప్ ద్వారా 1,27,377 మంది రైతులు 3,90,762 బస్తాలను బుక్ చేసుకోగా, అందులో 3,52,172 బస్తాలను కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఖమ్మం జిల్లాలో ఎటువంటి యూరియా కొరత లేదని, రైతులు అనవసర ఆందోళన చెందకుండా తమ సమీపంలోని సహకార సంఘాలు, ఎరువుల విక్రయ కేంద్రాల నుంచి అవసరమైన యూరియాను కొనుగోలు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో మధిర వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ బండారు నరసింహారావు, సిపిఓ శ్రీనివాస్, వ్యవసాయ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి పట్టివేత : సి ఐ




**ఖమ్మం, జూలై 27, నేటి శుభోదయ :**
ఎక్సైజ్ డిప్యూటీ కమీషనర్, సోమిరెడ్డి ఖమ్మం, ఆదేశాల మేరకు, ఈఎస్ జానయ్య పర్యవేక్షణ లో సోమవారం మధ్యాహ్నం 02:10 గంటల సమయం లో ఖమ్మం, కొత్త బస్టాండ్ సమీపంలో తనిఖీలు నిర్వహిస్తుండగా ముగ్గురు వ్యక్తులు అనుమానస్పదంగా ఉండగా వారి వద్ద ఉన్న బ్యాగ్ ని తనికీ చేయగా అందులో 5. 210, కేజీల వెండు గంజాయి లభించగా, అధికారులు ముగ్గురు వ్యక్తులని అదుపులోనికి తీసుకొనగా, అందులో ఇద్దరు ఒడిశా రాష్ట్రానికి చెందిన మహిళలు, ఒకరు చతీస్గడ్ రాష్ట్రానికి చెందిన వ్యక్తి,గంజాయి ని వారు ఒడిస్సా నుండి హైదరాబాద్ కు తరలిస్తున్నారు. వారివద్ద ఉన్న 5 సెల్ ఫోన్స్ ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసీ రిమాండ్ నిమిత్తం ముగ్గురిని కోర్టు లో హాజరు పరచారు. ఈ తనిఖీలలో సి ఐ బి కృష్ణ, ఎస్ ఐ లు జయశ్రీ, సాయిబాబా, సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీశైలం నిర్వాసితుల గుండెకోత.. పాలకులారా, మీ మనసులు రాళ్లా..?



**చిన్నంబావి, జులై 27, నేటి శుభోదయ :**
"కృష్ణమ్మ డ్యామ్ కడితే కదలిచ్చిన ఊళ్లను, తరతరాల నమ్ముకున్న భూములను దేశ శ్రేయస్సు కోసం త్యాగం చేశాం.. కానీ 40 ఏళ్లుగా మా జీవితాలు నీళ్లపాలై నరకం అనుభవిస్తుంటే, ఈ ఏలే పాలకుల గుండెలు రాయిగా మారాయా..? ఓట్ల కోసం వచ్చి చేతులెత్తి మొక్కి బాసలు చేయడం.. గెలిచాక మా గోడును గాలికొదిలేసి వంచించడం నిత్యకృత్యమైంది. ఇక మీ అబద్ధపు హామీలను నమ్మే ప్రసక్తి లేదు.. మా హక్కుల కోసం ఉద్యమ బాట పడతాం!" —— శ్రీశైలం ప్రాజెక్టు నీటి ముంపుతో సర్వస్వం కోల్పోయిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నిర్వాసితుల కన్నీటి నిప్పుల వర్షమిది.వనపర్తి జిల్లా చిన్నంబావి మండల పరిధిలోని పెద్దమారూర్ గ్రామంలో సోమవారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని అలంపూర్, చిన్నంబావి సహా కృష్ణానది పరివాహక ప్రాంతాల ముంపు బాధితుల సమాఖ్య ఆధ్వర్యంలో ఉద్వేగపూరిత ఆవేదన సదస్సు జరిగింది.రాజకీయనాయకుల కల్లబొల్లి మాటలు, అధికారుల తీవ్ర నిర్లక్ష్యంపై నిర్వాసితులు నిప్పులు చెరిగారు. ఆశలతోనే చచ్చిన 400 మంది.. ఉసురు తగలకుండా చూడండి..! నాడు దివంగత ఎన్.టి.రామారావు తెచ్చిన జీఓ 98 నుంచి, నిన్నటి జీఓ 68 వరకు అన్నీ కాగితాలకే పరిమితమయ్యాయని బాధితులు మండిపడ్డారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 67 ముంపు గ్రామాల్లోని కుటుంబాలకు ఉద్యోగం రాక, బ్రతుకుదెరువుకు సరైన పరిహారం అందక అష్టకష్టాలు పడుతున్నారు. ఏదో ఒక రోజు న్యాయం జరుగుతుందన్న ఆశతో కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తూనే ఇప్పటికే 400 మందికి పైగా బాధితులు కన్నుమూయడం కన్నా ఘోరం ఏముంటుందని కన్నీటిపర్యంతమయ్యారు. ఇప్పటికీ 2,000 మందికి పైగా నిర్వాసితులు అనాథల్లా అధికారుల చుట్టూ తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రులూ మారారు.. మాటలు మారలేదా..? ఎన్నికలు రాగానే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణారావు వంటి సీనియర్ నాయకులంతా వచ్చి ఆదుకుంటామని చెవిలో పువ్వులు పెట్టడం అలవాటుగా మారిందని ధ్వజమెత్తారు. ఏడాది కిందట పెంట్లవెల్లి మండలం జటప్రోలుకు విచ్చేసిన స్వయంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి "పాలమూరు బిడ్డగా మీ బాధ నాకు తెలుసు.. ఉద్యోగాలు ఇవ్వలేకపోయినా తగిన నష్టపరిహారమైనా ఇప్పించి ఆదుకుంటాం" అని సభాముఖంగా చెప్పిన హామీ ఏమైందని ప్రశ్నించారు. ఏడాది గడిచినా ఒక్క అడుగు ముందుకు పడకపోవడం బాధితులను తీవ్రంగా వంచించడమేనన్నారు. అధికారులైతే సాంకేతిక సాకులు చెబుతూ ఫైళ్లను పక్కన పడేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఊరూరా నిరసన జ్వాలలు.. తేల్చుకునేందుకు సిద్ధం..! ఇక లాలూచీ పడేది లేదని, నాయకులు, అధికారులను బతిమిలాడే రోజులు పోయాయని బాధితులు హెచ్చరించారు. పెద్దమారూర్ సభ వేదికగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రతీ గ్రామాన్ని ఏకం చేస్తామని, ఓట్ల కోసం వచ్చే నాయకులను గడపగడపనా నిలదీసేందుకు భవిష్యత్తు ఐక్య ఉద్యమానికి శ్రీకారం చుడుతున్నామని ప్రకటించారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిద్రమత్తు వీడి తమ 40 ఏళ్ల దయనీయ స్థితికి ముగింపు పలకాలని, లేనిపక్షంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పోరాటాన్ని ఉధృతం చేస్తామని తీవ్రస్థాయిలో హెచ్చరించారు.

## ఆగస్టు 15 లోపు "జలసిరి" పనులను పూర్తి చేయాలి



**నిజామాబాద్, జూలై 27, నేటి శుభోదయ :** ఎల్ నినో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను అధిగమించేందుకు వీలుగా గ్రామ గ్రామాన జలసిరి కార్యక్రమాలను విస్తృత స్థాయిలో చేపట్టాలని అదనపు కలెక్టర్ భుజంగరావు సూచించారు.సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ప్రధాన సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి అనంతరం ఆయన అధికారులతో సమీక్ష జరిపారు.ఈ నెల 28న అన్ని మండలాలలో మండల స్థాయి సభలు నిర్వహించాలని మండల ప్రత్యేక అధికారులకు సూచించారు.అదేవిధంగా 29,30 తేదీలలో గ్రామ పంచాయతీల స్థాయిలో గ్రామ సభలు జరపాలని అన్నారు.ఈ సభలలో ఎల్ నినో ప్రభావం గురించి,జల సంరక్షణకు చేపట్టాల్సిన చర్యలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.వర్షపు నీటిని ఒడిసిపట్టేలా వీబీజీ రామ్-జీ పథకం కింద విరివిగా ఇంకుడుగుంతలు,ఊట కుంటలు,పంట కుంటలు,బోరు బావుల రీఛార్జ్ నిర్మాణాలు చేపట్టి జాబ్ కార్డు కలిగిన కూలీలకు పెద్ద ఎత్తున ఉపాధి కల్పించాలని అన్నారు.ఆగస్టు 15వ తేదీ నాటికి అన్ని గ్రామాలలో ఈ పనులు పూర్తయ్యేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలన్నారు.గ్రామీణ నీటి సరఫరా,పంచాయతీరాజ్ ఇంజినీరిం.గ్ అధికారులు,ఎం.పీ.డీ.ఓలు,ఎం.పీ.ఓలు,ఏ.పీ.ఓ లు,ఏ.ఈ.ఓ లు,వీ.ఓ లు,స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు ఇలా అందరినీ భాగస్వామ్యం చేస్తూ నిర్ణీత గడువులోపు జలసిరి కార్యక్రమాలు అమలయ్యేలా చొరవ చూపాలని అన్నారు.ప్రతి ఇంటికి ఒక ఇంకుడు గుంత తప్పనిసరిగా ఉండేలా చూడాలన్నారు.వాటర్ షెడ్ నిర్మాణాల ద్వారా నీటి సంరక్షణ జరగడంతో పాటు కూలీలకు ఉపాధి కల్పించి పని దినాల లక్ష్యాన్ని సాధించవచ్చని సూచించారు.ప్రతి గ్రామంలో ప్రతి రోజు సగటున 60 మందికి పని కల్పించేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని అన్నారు.భూగర్భ జలాల పెంపునకు దోహదపడే జలసిరి కార్యక్రమాల అమలుకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.అదేవిధంగా వీ.ఓ భవన నిర్మాణ పనులను కూడా నవంబర్ 15 లోపు పూర్తి చేయాలని సూచించారు.సమీక్షా సమావేశంలో ట్రైనీ కలెక్టర్ సురేష్,డీఆర్ఓ గీత,నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్,జెడ్పీ సీ.ఈ.ఓ సాయాగౌడ్,డీ.ఆర్.డీ.ఓ సాయన్న సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి 166 ఫిర్యాదులు



**నిజామాబాద్, జూలై 27, నేటి శుభోదయ :** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ భుజంగరావు అధికారులకు సూచించారు.సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 166 ఫిర్యాదులు అందాయి.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ భుజంగరావుతో పాటు ట్రైనీ కలెక్టర్ సురేష్,డీఆర్ఓ గీత,నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్,జెడ్పీ సీఈఓ సాయాగౌడ్,డీఆర్డీఓ సాయన్న లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు.కాగా,అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ భుజంగరావు అధికారులను ఆదేశించారు.ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సిద్దాపూర్ డంపింగ్ యార్డ్ జేఏసీ వాల్ పోస్టర్ ఆవిష్కరణ - మాజీ ఎమ్మెల్యే



**షాద్నగర్, జులై 27, నేటి శుభోదయ :** రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం సిద్దాపూర్ గ్రామంలో ప్రతిపాదించిన డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా ఉద్యమం మరింత ఉధృతమవుతోంది. సిద్దాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో గ్రామంలో నిర్వహించిన తొలి సమావేశం విజయవంతంగా జరిగింది. ఈ సమావేశానికి బీఆర్ఎస్, బీజేపీ, సీపీఎం, సీపీఐతో పాటు కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థి, యువజన, ప్రజా సంఘాల నాయకులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. జీవో 641 రద్దు చేయాలని డిమాండ్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సిద్దాపూర్ గ్రామంలో ఎకో పార్క్ పేరుతో డంపింగ్ యార్డు ఏర్పాటు చేసేందుకు జూలై 2న జీవో 641ను తీసుకువచ్చిందని జేఏసీ నాయకులు తెలిపారు. జీవో జారీకి ముందే సిద్దాపూర్ గ్రామ ప్రజలు డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా ఉద్యమానికి శ్రీకారం చుట్టి, పెద్ద ఎత్తున చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహించారని పేర్కొన్నారు. గతంలో ప్రస్తుత ఎమ్మెల్యే శంకరయ్య డంపింగ్ యార్డును రానివ్వబోమని హామీ ఇచ్చారని, అయితే ఆయన హామీ ఇచ్చిన వారం రోజులకే జీవో రావడంతో ప్రజలు తీవ్ర అసంతృప్తికి గురయ్యారని జేఏసీ నాయకులు ఆరోపించారు. ఈ నేపథ్యంలో జీవో 641ను రద్దు చేసే వరకు ప్రత్యక్ష కార్యాచరణ రూపొందించి, ప్రజా ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలను ఏకతాటిపైకి తీసుకువస్తూ సిద్దాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డంపింగ్ యార్డుతో ప్రజలకు తీవ్ర నష్టం: జేఏసీ జేఏసీ చైర్మన్ రాంబల్ నాయక్ అధ్యక్షతన జరిగిన తొలి సమావేశంలో నాయకులు గ్రామ ప్రజలకు డంపింగ్ యార్డు వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించారు. డంపింగ్ యార్డు ఏర్పాటుతో పర్యావరణ కాలుష్యం పెరగడంతో పాటు చెరువులు, కుంటలు, భూగర్భ జలాలు కలుషితమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. జేఏసీ ఆధ్వర్యంలో భవిష్యత్తులో చేపట్టే ప్రతి కార్యక్రమంలో గ్రామ ప్రజలు భాగస్వాములై ఐక్యంగా పోరాడాలని నాయకులు పిలుపునిచ్చారు. జీవో 641 రద్దు అయ్యే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రజల కోసం చేపట్టే ప్రతి కార్యక్రమానికి అండగా ఉంటా: అంజయ్య యాదవ్ సమావేశానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ మాట్లాడుతూ.. తమ ప్రభుత్వ హయాంలో పారిశ్రామిక రంగానికి పెద్దపీట వేస్తూ పరిశ్రమల ఏర్పాటుకు భూములు సమీకరించామని, ప్రస్తుత ప్రభుత్వం అదే ప్రాంతాన్ని డంపింగ్ యార్డు కోసం కేటాయించడం దారుణమని అన్నారు.ప్రజల కోసం పనిచేసే ప్రజా సంఘాలు, జేఏసీ నాయకులు ఏ కార్యక్రమం చేపట్టినా వారి వెంట నడుస్తానని హామీ ఇచ్చారు. డంపింగ్ యార్డు ఏర్పాటైతే సిద్దాపూర్ పరిసర ప్రాంతాల్లోని చెరువులు, కుంటలు, భూగర్భ జలాలు పూర్తిగా కలుషితమై ప్రజల జీవనం అస్తవ్యస్తంగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రజల ప్రయోజనాలను కాపాడేందుకు చేపట్టిన ఈ పోరాటంలో విజయం సాధించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని అంజయ్య యాదవ్ స్పష్టం చేశారు. జేఏసీ వాల్ పోస్టర్ ఆవిష్కరణ అనంతరం సిద్దాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీ రూపొందించిన వాల్ పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు. రానున్న రోజుల్లో ఉద్యమాన్ని మరింత విస్తృతం చేసి, అన్ని వర్గాల ప్రజలను భాగస్వామ్యం చేస్తూ కార్యాచరణ రూపొందిస్తామని జేఏసీ నాయకులు తెలిపారు.పెద్ద సంఖ్యలో పాల్గొన్న నాయకులుఈ కార్యక్రమంలో సిద్దాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ రాంబల్ నాయక్, కన్వీనర్ పినపాక ప్రభాకర్, సలహాదారులు వంగూరి గంగిరెడ్డి, అబ్దుల్ రబ్ జామి, రాజవరప్రసాద్, కో-చైర్మన్లు దొడ్డి శ్రీనివాస్, ఎమ్మె సత్యనారాయణ, బొజ్జా శ్రీనివాస్ రెడ్డి, వడ్డె బాలయ్య, రజిత నాయక్, బుద్దల జంగయ్య, ఈశ్వర్ నాయక్, రవీంద్రనాథ్, టి.జి. శ్రీనివాస్, అర్జున్, శ్రీకాంత్, ఆకాశ్ నాయక్, పెంటనోళ్ల నర్సింహ, బచ్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.అలాగే వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లెల వెంకట్ రెడ్డి, ఈట గణేష్, వంకాయల నారాయణ రెడ్డి, కోస్గి శ్రీనివాస్, దేవేందర్ యాదవ్, రవీందర్‌తో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ సర్పంచులు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, ప్రజా సంఘాల ప్రతినిధులు, సిద్దాపూర్ గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నూతన డిపిఓ  వినోద్ కుమార్ ని మర్యాదపూర్వకంగా కలిసిన టీఎన్‌జీవోస్ యూనియన్ నాయకులు



**ఖమ్మం, జులై 27, నేటి శుభోదయ :** గ్రూప్-1 పరీక్షల్లో ప్రతిభ కనబర్చి ఖమ్మం జిల్లా నూతన జిల్లా పంచాయతీ అధికారిగా (డిపిఓ) నియామకం పొందిన వినోద్ కుమార్ ని సోమవారం నూతన కలెక్టరేట్ (ఐడిఓసి) లోని వారి ఛాంబర్‌లో టీఎన్‌జీవోస్ యూనియన్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో యూనియన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధి, గ్రామ పంచాయతీల బలోపేతం, ఉద్యోగులు, అధికారుల మధ్య సమన్వయంతో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. వినోద్ కుమార్ కూడా ఉద్యోగ సంఘాల సహకారంతో జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవోస్ యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జెడ్.ఎస్. జైపాల్, జిల్లా కోశాధికారి వల్లపు వెంకన్న, అసోసియేట్ అధ్యక్షులు కొమరగిరి దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షులు ఎర్ర రమేష్, జిల్లా మైనారిటీస్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు అస్లాం, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ ఫోరం జిల్లా అధ్యక్షులు కోటపాటి రుక్మారావు, పంచాయతీ కార్యదర్శుల ఫోరం జిల్లా అధ్యక్షులు ఫజల్, జిల్లా కార్యదర్శి వినోద్, వైస్ ప్రెసిడెంట్లు తిరుపతిరావు, ఉపేందర్, రాంలాల్ , జాయింట్ సెక్రటరీలు రమేష్ , శ్రీనివాస్, రాజ్‌కుమార్, మహిళా విభాగ బాధ్యులు రాధారాణి, అలాగే పంచాయతీ కార్యదర్శులు తిరుపతి రావు, ప్రవీణ్ , విక్రమ్ , జయసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నూతన వ్యాపార రంగంలో రాణించాలి



**షాద్నగర్, జులై 27, నేటి శుభోదయ :** రంగారెడ్డి జిల్లా షాద్నగర్ నియోజకవర్గం కొత్తూరు మండలం పరిధిలోని యువత స్వశక్తితో వ్యాపార రంగంలో అడుగుపెట్టి నైపుణ్యాలను పెంపొందించుకొని పారిశ్రామికవేత్తలుగా ఎదుగుతూ దేశ ఆర్థికాభివృద్ధిలో భాగస్వాములు కావాలని బిజెపి రాష్ట్ర నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండల కేంద్రంలోని పెంజెర్ల రోడ్ లో కొత్తూరు మండల బిజెపి మాజీ అధ్యక్షులు మల్ రెడ్డి మహేందర్ రెడ్డి నూతనంగా ఏర్పాటు చేసిన బ్యాటరీ షోరూమ్ ను బిజెపి రాష్ట్ర నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా పూజా కార్యక్రమం నిర్వహించి యజమాని మల్ రెడ్డి మహేందర్ రెడ్డి కి శుభాకాంక్షలు తెలిపారు. వినియోగదారులకు నాణ్యమైన పరికరాలను అందజేస్తూ వారి ప్రశంసలు పొందాలని, వ్యాపారంలో ఆర్థిక అభివృద్ధి సాధించి పలువురు యువతకు ఉపాధి కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొత్తూరు మండల్ భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు అత్తాపురం మహేందర్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, రవీందర్ రెడ్డి, బాల్ శివ రెడ్డి, పుల్లా రెడ్డి,ఎమ్మె ప్రవీణ్, నరసింహ యాదవ్,నందిగామ,నరసింహ,ఎమ్మెబాలరాజ్,ఎమ్మె,శ్రీశైలం,తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీల సమగ్రాభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ : దారూర్ ఎంపీడీవో నర్సిములు



**వికారాబాద్, జూలై 27, నేటి శుభోదయ :** వికారాబాద్ జిల్లా దారూర్ మండలంలోని గ్రామ పంచాయతీల సమగ్రాభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, ప్రభుత్వ సంక్షేమ పథకాల సమర్ధ అమలుకు ప్రత్యేక ప్రణాళికలతో నిరంతరం కృషి చేస్తున్నట్లు మండల ఎంపీడీవో నర్సిములు తెలిపారు. సోమవారం మండల పరిధిలోని హరిదాస్‌పల్లి గ్రామ పంచాయతీని సందర్శించిన ఆయన, గ్రామంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, పారిశుధ్య నిర్వహణ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతి, పంచాయతీ రికార్డులను పరిశీలించారు.రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో గ్రామంలోని పూరిగుడిసెలో నివసిస్తున్న ఒక కుటుంబాన్ని నేరుగా కలిసి వారి పరిస్థితిని పరిశీలించారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.అనంతరం గ్రామంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించి, పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామంలోని మౌలిక సదుపాయాలపై సర్పంచ్ శ్రీకాంత్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి వెంకటయ్యతో చర్చించి వివరాలు తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీల సమగ్రాభివృద్ధికి మండల పరిషత్ ప్రత్యేక దృష్టి సారించి అవసరమైన చర్యలు చేపడుతుందని ఎంపీడీవో నర్సిములు తెలిపారు.ఈ పర్యటనలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీలత, మండల గృహ నిర్మాణ శాఖ ఏఈ అర్చన తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా మియాపూర్ మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ జన్మదిన వేడుకలు

**శేరిలింగంపల్లి, జులై 27, నేటి శుభోదయ :** సోమవారం రోజు మియాపూర్ తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ ని వారి నివాసంలో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రసాద్స్ ఫౌండేషన్ చైర్మన్, శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డి ఎస్ ఆర్ కె ప్రసాద్, వారి సతీమణి ప్రసాద్స్ ఫౌండేషన్ డైరెక్టర్, మియాపూర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు దోనేపూడి రమాదేవి. ఈ కార్యక్రమంలో మియాపూర్ డివిజన్ నాయకులు, ప్రసాద్ టీమ్ సభ్యులు భాషా, వినోద్ చౌదరి, ఏం ఆర్ కె చౌదరి, వెంకట్రావు, రావిళ్ల శ్రీను, సింహ, మురళి కృష్ణ, నాని, కమలాకర్ రెడ్డి, రాము, హనుమంతు, మహేష్, కిలారి ప్రసాద్, ఉమాదేవి, బాబూరావు తదితరులు పాల్గొని ఉప్పలపాటి శ్రీకాంత్ ని, వారి శ్రీమతి సుమ ని దుశ్శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ డి ఎస్ ఆర్ కె ప్రసాద్ మాట్లాడుతూ మా సోదర సమానులు శ్రీకాంత్ ఇలాంటి జన్మ దినోత్సవాలు ఘనంగా జరుపుకోవాలని, నిండు నూరేళ్ళు ఆయురారోగ్య అష్ట ఐశ్వర్యాలతో తుల తుగాలి అని ఆకాంక్షించారు.






# నిరుపేదల పాలిటి ఆపద్బాంధవుడు






**వైరా, జులై 27, నేటి శుభోదయ :** వైరా లయన్స్ క్లబ్ చార్టర్ సభ్యులు లయన్స్ కంటి హాస్పిటల్ చైర్మన్ ఫాస్ట్ డిస్టిక్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ సేవా ప్రస్థానం వైరా లయన్స్ కంటి హాస్పటల్ కు ఆధ్యుడు సొంత స్థలం ఇచ్చిన దానకర్ణుడు పేదలపాలిటీ ఆపద్బాంధవుడు లయన్ డాక్టర్ కాప మురళీకృష్ణ పేద నిరుపేద వర్గాలకు ఆయన ఒక అపన్న హస్తం పేదలన్న దారిద్ర్యానికి దిగు జీవిస్తున్న ప్రజల అన్న ఆయనకు అపారమైన ప్రేమాభిమానం సేవే మార్గం ప్రేమే లక్ష్యంగా అందిస్తున్న చల్లని హృదయం అతనిది 'కల్మషం లేని మంచి మనసు నీడలో ఎన్నో కుటుంబాలు సుభిక్షంగా ఆనందంగా జీవిస్తున్నాయి వైరా చుట్టుపక్కల ప్రాంతాల్లో నివ సిస్తున్న పేద బడుగు బలహీన వర్గాలకు మురళీకృష్ణ ఒక సంజీవిని 'మానవ శరీరంలో అతి సున్నితమైన భాగంగా కళ్ళు ముఖ్యం ఆ కంటి చూపు లేక ప్రజలు పడుతున్న బాధలను వారి అనుభవిస్తున్న అవస్థను వారి నుండి దూరం చేసేందుకు ఎందరో కళ్ళల్లో కాంతి కిరణాలు నింపిన మహా మనిషి అతను 'తనకున్న సొంత ఆస్తి స్థలాన్ని లయన్స్ కంటి హాస్పటల్ కు తన మాతృమూర్తులైన కాప గోపాలరావు ఆదిలక్ష్మి పేరుతో విరాళంగా ఇచ్చి లయన్స్ కంటి హాస్పిటల్ పేరిట హాస్పిటల్ నిర్మించి ఆయనే చైర్మన్గా వ్యవహరిస్తూ ఎంతో కళ్ళల్లో ఆశా కిరణాలు నింపిన ఆయన కృషి అమోఘం' అని చెప్పక తప్పదు అసలు ఈ హాస్పటల్ కు అంకురార్పణ ఎలా జరిగిందంటే 10 సంవత్సరాల క్రితం చిన్న అద్దె ఇంట్లో వైరా లయన్స్ కంటి హాస్పటల్ ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారిని కాకినాడ కంటే హాస్పిటల్ కి పంపించి ఆపరేషన్ నిర్వహింప చేసేవారు. కానీ రెండు రాష్ట్రాల విభజన అనంతరం కాకినాడ నుండి ఎటువంటి రవాణా సౌకర్యాలు లేకపోవడంతో ఒక మెరుపు ఆలోచనతో అసలు మనమే ఒక హాస్పటల్ నిర్మించే దిశగా అడుగులు వేసి వైరాలోనే హాస్పిటల్ నిర్మిద్దాం అని ఒక దృఢ సంకల్పంతో హాస్పటల్ నిర్మించిన గొప్ప ఆశయం.2017 సంవత్సరంలో లయన్స్ జిల్లా గవర్నర్ గా ఎన్నికైన తొలి రోజుల్లోనే వైరాలోని కంటి హాస్పిటల్ కు ఏర్పాటుకు రూపకర్తగా హాస్పిటల్ నిర్మించి ఎందరో హృదయాల్లో పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్నారు.ఇప్పటివరకు దాదాపుగా పదివేల పైగా ఆపరేషన్లు చేయించి నిరుపేదలకు ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించి దీనులపాలిటీ దేవుడయ్యాడు. రోగులను బస్టాండ్ నుండి హాస్పిటల్కు మరియు ఇక్కడి నుండి చేరవేయుటకు ఒక వ్యాన్ ని కూడా ఉచితంగా ఆయన కంటి హాస్పిటల్ కి అందించారు అంచలంచెలుగా లయన్స్ క్లబ్ సభ్యులను పెంచుకుంటూ సేవలందిద్దామని ఉద్దేశంతో ముఖ్యంగా నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సాయం లాప్టాప్ లు అందించి చదువుకు దూరమైన విద్యార్థులను ఆదుకొని ఉన్నత చదువులకు ప్రోత్సహించారు అలా ప్రోత్సహించి ఎంతో మంది ప్రభుత్వ ఉద్యోగాలు కూడా అందిపుంచుకున్నారు.ఒక రంగమే కాకుండా అన్ని వర్గాల ప్రజలను ఆదుకోవడంలో ముందునారు. గవర్నర్ గా ఉన్న సమయంలో ఖమ్మంలో దివ్యాంగులకు మేళ నిర్వహించి వందలాదిమందికి ఉచితంగా ట్రై సైకిల్స్ ను అందించారు. అదేవిధంగా అదే విధంగా కుటుంబ అభివృద్ధి కోసం మహిళలకు గత మూడు సంవత్సరాలుగా వందలాది మందికి కుట్టు మిషన్లు చిరు వ్యాపారాలకు తోపుడుబండ్లను అందించి వారి జీవనభృతికి తోడ్పడ్డారు. ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు సామాజిక స్పృహ ఉన్న లయన్స్ క్లబ్ కుటుంబ సభ్యులతో కలిసిమెలిసి స్పందిస్తూ స్పందింపచేస్తూ సేవ కార్యక్రమాలు నిర్వహించారు లయన్స్ కుటుంబంలో జన్మదిన వివాహ శుభకార్యాలతో పాటు సేవా కార్యక్రమాలతో నలుగురికి సేవ చేస్తూ జరుపుకోవాలనే మంచి సంకల్పానికి డాక్టర్ మురళీకృష్ణ శ్రీకారం చుట్టారు ప్రభుత్వాలు చేయలేని కార్యక్రమాలను కూడా లయన్స్ క్లబ్ ద్వారా వైరా మండలంలోని అన్ని పాఠశాలలకు చెందిన విద్యార్థులకు 80 వేల ఖర్చుతో విలువైన పుస్తకాలను ఎన్నారై వారి సహకారంతో మండలంలో ప్రభుత్వ పాఠశాలలో విలువైన సమాచారం కోసం టీవీ లను వితరణగా అందించారు ఆటలకు సంబంధించిన ప్రత్యేక కిట్టులను డ్రస్సులను 'జూనియర్ కళాశాల తరగతి గదులు నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించివైరాలోని గురుకుల పాఠశాలకు వాటర్ ప్లాంట్ ను కూడ పర్మినెంట్ గా చేపట్టారు. ప్రమాదవశాత్తు ఇల్లు కాలిపోయిన వారికి నిలువలేడులేని కుటుంబాలకు ఇల్లు నిర్మాణం చేపట్టే విషయంలో వారికి ఆర్థిక సహాయం అందించారు వైరా మండలంలో స్మశానవాటికల్లో పాఠశాల ప్రాంగణంలో గ్రామాల్లో మంచినీటి బోర్లను సొంత ఖర్చులతో నిర్మించారు ఈ కార్యక్రమాలన్నీ లయన్స్ క్లబ్ లో గవర్నరుగా మురళీకృష్ణ ఉండటం ఆయన చేస్తున్న సేవా కార్యక్రమాలకు ప్రతీకగా నిలిచింది. అతని హయాంలో ఆరు కోట్ల రూపాయలతో పరిమినెంట్ ప్రాజెక్టును కూడా నిర్మించారు. ప్రభుత్వాలు చేయలేని ఎన్నో మౌలిక సదుపాయాలను ఆయన సమాజానికి అందించారు కులాలకు మతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు వారి వారి పండుగలకు కిట్స్ ను అందించారు. ఈ సేవ మూర్తి ధ్యేయం ఒకటే ప్రతి మనిషి తన సంపాదనలో కొంతైనా సమాజానికి ఉపయోగపడేలా సేవలందించాలని తద్వారా కొంతమంది మనుషుల్లోనైనా మన పేరు చిరస్థాయిగా నిలుస్తుంది అని చెబుతుంటారు. ప్రతి మనిషి సేవా మార్గంలో నడుస్తూ సమాజంలో సేవలు అందిస్తూ ఉంటే అన్ని రంగాల్లో మనం రాణించగలమని క్లబ్ లో ఉన్న సభ్యులు కౌన్సిలర్లుగా ఎన్నికైఅయ్యారు. ఆస్ఫూర్తితోనే మరిన్ని సేవలు సమాజంలోవున్న ప్రజలకు అందించాలని దృఢ సంకల్పంతో తన సతీమణి అయిన డాక్టర్ కాపాచంద్రకళవైరామున్సిపాలిటీ తొలి మహిళచైర్పర్సన్ గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. లయన్స్ క్లబ్ అనేది ఒక సేవా సంస్థ మాత్రమే కాదు డాక్టర్ కాపా మురళి కృష్ణ ప్రపంచమంతా మానవతా సేవకు ప్రతీకగా నిలిచిన ఉద్యమం అని డాక్టర్ కాపా మురళి కృష్ణ పేర్కొన్నారు ఈరోజు తన పుట్టినరోజు సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ తన సతీమణి డాక్టర్ కాపా చంద్రకళ సమాజానికిసేవ చేయాలని ఉద్దేశంతో రాజకీయాలకు వచ్చారని అందరి మన్ననలతో ప్రజల సహకారంతో వైరా మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపించడమే ప్రధాన ఉద్దేశం అని ఆయన పేర్కొన్నారు. తన పుట్టినరోజున నిరుపేదలకు ఉచిత కంటి ఆపరేషన్ లు పర్మినెంట్ ప్రాజెక్టులు వీల్ చైర్లు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు అన్ని వర్గాలకు సేవా కార్యక్రమాలు అందించాలని నిర్ణయించానని తెలిపారు. ఏ పనైనా ఒక్కడితో సాధ్యం కాదని వైరా లయన్స్ క్లబ్ ల కుటుంబ సభ్యుల సహకారంతో గత 20 సంవత్సరాలుగా వివిధ వర్గాల ప్రజలకు సేవలందిస్తూ ఉన్నామని అన్నారు ఇక ముందు ముందు కూడా లయన్స్ క్లబ్ సేవలను గ్రామాలకు విస్తరింప చేయాలని సంకల్పం తో వున్నాము అని రెండు తెలుగు రాష్ట్రాల్లో లయన్స్ క్లబ్బులకు మంచి గుర్తింపు లభించిందని తద్వారా లయన్స్ ఇంటర్నేషనల్ లో ఎన్నో అవార్డులను అందుకుందని మురళీకృష్ణ తెలిపారు తెలిపారు. ఇలాంటి సేవా తత్పరుడు సేవా మూర్తి పేదల పాలిటి పక్షపాతి అయిన మురళీకృష్ణ ఆశయాలు ఓ అప్పన్న హస్తంగా కలకాలం నిలవాలని కోరుకుందాం




## మియాపూర్‌లో బైక్ షోరూం ప్రారంభోత్సవంలో పాల్గొన్న డిఎస్ఆర్కె ప్రసాద్..




**మియాపూర్, జులై 27, నేటి శుభోదయ :** మియాపూర్‌లో నూతనంగా ప్రారంభమైన త్రియంపు బైక్ షోరూం ప్రారంభోత్సవ కార్యక్రమానికి సంస్థ యాజమాన్యం ఆహ్వానం మేరకు ప్రసాద్స్ ఫౌండేషన్ చైర్మన్ మరియు మియాపూర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు లయన్ డి.ఎస్.ఆర్.కె ప్రసాద్ హాజరయ్యారు.ఈ సందర్భంగా మియాపూర్ లో నూతన వ్యాపార ప్రయాణాన్ని ప్రారంభిస్తున్న సంస్థ యాజమాన్యానికి డి ఎస్ ఆర్ కె ప్రసాద్ హృదయపూర్వక అభినందనలు తెలియజేసి, వారి వ్యాపారం విజయవంతంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.అలాగే ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన డి ఎస్ ఆర్ కె ప్రసాద్ ని సంస్థ యాజమాన్యం శాలువాతో ఘనంగా సత్కరించి తమ కృతజ్ఞతలను తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మియాపూర్ డివిజన్ సభ్యులు వెంకట్రావు, మూర్తి, వినోద్ చౌదరి, వెంకట్రావు, మూర్తి, రావిళ్ల శ్రీనివాస్,గోపి , నరేష్ నాని బాలు, వరుణ్, తదితరులు, పలువురు ప్రముఖులు, పెద్దలు, శ్రేయోభిలాషులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# పాలకుర్తికి నిధుల వరద



**తొర్రూరు, జులై 27, నేటి శుభోదయ :** తొర్రూరు మండలంలోని పలు గ్రామాలలో సిసి రోడ్లకు ఈరోజు 15 గ్రామాలలో శంకుస్థాపన చేశారు మరియు మడిపల్లి నుండి కంటయపాలెం గుర్తురు గ్రామానికి నిర్మిస్తున్న వంతెన పనులు ఎమ్మెల్యే పరిశీలించారు అనంతరం మాట్లాడుతూ ఈ వంతెనల నిర్మాణం పూర్తయితే గ్రామాల మధ్య రాకపోకలు మరింత సులభతరం అవుతాయని మరియు రైతులకు విద్యార్థుల అత్యవసర సేవలకు రవాణా మెరుగుపడుతుందని గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు . పలు తండాలలో గ్రామాలలో సిసి రోడ్ల కు శంకుస్థాపన చేశారు త్వరలోనే బిల్లులు వస్తాయి త్వరితగతిన వర్కులు చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు ఇట్టి కార్యక్రమంలో తొర్రూరు మండల నాయకులు పుర ప్రముఖులు పాల్గొన్నారు

## ఎదులాబాద్ కొత్తగూడెం లో వృద్ధురాలి మెడలో మంగళసూత్రం లాక్కెల్లిన దుండగులు



**ఘట్కేసర్, జులై 27,, నేటి శుభోదయ :** పగలే ఇంట్లోకి దూసుకొచ్చి వృద్ధురాలి మెడలోని మూడు తులాల మంగళసూత్రం గుర్తుతెలియని దుండగులు లాక్కెల్లిన ఘటన మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ పీఎస్ పరిధిలో ఏదులాబాద్ కొత్తగూడెంలో చోటు చేసుకుంది. ఎదులాబాద్ కొత్తగూడెం గ్రామానికి చెందిన జాల కేతమ్మ (70) అనే వృద్ధురాలు ఇంట్లో నిద్రిస్తుండగా బైక్‌పై వచ్చిన ఇద్దరు గుర్తుతెలియని దుండగులు ఇంటి తలుపులు తోసుకుని లోపలికి ప్రవేశించారు. ఆమె మెడలో ఉన్న సుమారు మూడు తులాల బంగారు మంగళసూత్రాన్ని క్షణాల్లో లాక్కొని బైక్‌పై పరారయ్యారు. బాధితురాలి కుటుంబ సభ్యులు , స్థానికులు వెంటనే సమాచారం అందించడంతో ఘట్కేసర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు.బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఘట్కేసర్ సీఐ బాలస్వామి తెలిపారు.

# నీటి వనరుల సంరక్షణకు ప్రజల భాగస్వామ్యం అవసరం

**షాద్ నగర్ , జూలై 27, నేటి శుభోదయ :** మండల పరిధిలోని పెంజర్ల గ్రామంలో జలసిరి కార్యక్రమంలో భాగంగా జలసిరి గ్రామసభ సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు గ్రామ సర్పంచ్ ఎర్రోళ్ల జగన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఎంపీడీవో అరుంధతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా గ్రామంలో నీటి వనరుల సంరక్షణ నీటి సద్వినియోగం వర్షపు నీటి సంరక్షణ భూగర్భ జలాల పెంపు గ్రామ పరిశుభ్రత పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు ఈ సందర్భంగా ఎంపీడీవో అరుంధతి మాట్లాడుతూ నీరు ప్రతి ఒక్కరి జీవితానికి అత్యంత అవసరమైన వనరు అని భవిష్యత్ తరాలకు నీటి కొరత లేకుండా ఇప్పటి నుంచే నీటి వనరులను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు వర్షపు నీటిని ఒడిసిపట్టడం నీటి వృథాను అరికట్టడం గ్రామంలోని చెరువులు కుంటలు ఇతర నీటి వనరులను పరిరక్షించడం ద్వారా భూగర్భ జలాలను పెంచుకోవచ్చని సూచించారు గ్రామాభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారుగ్రామ సర్పంచ్ ఎర్రోళ్ల జగన్ మాట్లాడుతూ పెంజర్ల గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు గ్రామ పంచాయతీ నిరంతరం కృషి చేస్తోందన్నారు గ్రామంలో నీటి సంరక్షణకు ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామని తెలిపారు నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని గ్రామ ప్రజల సహకారంతో పెంజర్లను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారుజలసిరి గ్రామసభలో గ్రామంలో ఉన్న నీటి సమస్యలు తాగునీటి లభ్యత నీటి వనరుల పరి



రక్షణ వర్షపు నీటి వినియోగం పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలపై గ్రామస్థుల అభిప్రాయాలను సేకరించారు గ్రామంలో అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను గ్రామస్థులు కోరారు ప్రజలు తమ సమస్యలను గ్రామసభలో అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా వాటి పరిష్కారానికి మార్గం సుగమం అవుతుందని అధికారులు తెలిపారుఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మామిడి శంతన్ రెడ్డి,పంచాయతీ కార్యదర్శి గౌస్,వార్డు సభ్యులు మామిడి భారతమ్మ,కాటం రామాదేవి, ఆర్.రాములు,కమ్మరి వేదాంతాచారి, మై బుజ్జి, అర్బాస్,మామిడి రాజేందర్ రెడ్డి,ఆకులపల్లి సహదేవ్ అంగన్‌వాడీ కార్యకర్తలు ఆశా వర్కర్లు మహిళా సంఘాల సభ్యులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు,

# మంథని బీసీ బాలికల (ఎస్ ఎం హెచ్) హాస్టల్ వార్డెన్ పై చర్యలు తీసుకోవాలి



**మంథని, జులై 27, నేటి శుభోదయ :** మంథని బీసీ బాలికల (ఎస్ఎంహెచ్) హాస్టల్ వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు ఆర్ల సందీప్ డిమాండ్ చేశారు. సోమవారం ఎస్ఎఫ్ఐ మంథని మండల కమిటీ ఆధ్వర్యంలో హాస్టల్‌ను సందర్శించగా తాళాలు వేసి మూసివేసి ఉండటంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.హాస్టళ్లు మూతపడటానికి వార్డెన్లు, జిల్లా అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. ప్రభుత్వం వేతనాలు చెల్లిస్తున్నప్పటికీ విధులను సక్రమంగా నిర్వహించకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కాలేజీలు, పాఠశాలలు కొనసాగుతున్న సమయంలో హాస్టళ్లు మూసివేయడం, అడ్మిషన్ల సమయంలో తాళాలు వేయడం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమని విమర్శించారు.మంథనిలోని ఎస్సీ బాలికల హాస్టల్ కూడా ఇదే పరిస్థితిలో ఉందని పేర్కొన్న ఆయన, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెంటనే స్పందించి సంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ కళాశాలల సమస్యలపై సమీక్ష నిర్వహించి పరిష్కార చర్యలు చేపట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బందెల రాజ్‌కుమార్, అఖిల్, మహేందర్, కిరణ్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# గర్భంలో శిశువు లింగ నిర్ధారణకు పాల్పడితే కఠిన చర్యలు

**మంథని/పెద్దపల్లి, జూలై 27, నేటి శుభోదయ :**
గర్భంలోని శిశువు లింగాన్ని స్కానింగ్ ద్వారా నిర్ధారించడం లేదా వెల్లడించడం చట్టవిరుద్ధమని, అలాంటి చర్యలకు పాల్పడే వారిపై పీసీపీఎన్‌డీటీ (PCPNDT) చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష హెచ్చరించారు.సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన పీసీపీఎన్‌డీటీ జిల్లా సలహా కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. స్కానింగ్ కేంద్రాలపై నిరంతర తనిఖీలు నిర్వహించి, నిబంధనల ఉల్లంఘనలను అరికట్టాలని సూచించారు.సహజ ప్రసవాలను ప్రోత్సహించి, అనవసర సిజేరియన్ శస్త్రచికిత్సలను తగ్గించేలా చర్యలు చేపట్టాలని వైద్యశాఖ అధికారులకు కలెక్టర్ సూచించారు. గర్భిణులు, వారి కుటుంబ సభ్యులకు సహజ ప్రసవాల ప్రయోజనాలపై విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు.ప్రతి స్కానింగ్‌కు సంబంధించిన ఎఫ్-ఫారం (F-Form)ను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని, స్కానింగ్ కేంద్రాల



కొత్త నమోదులు, లైసెన్స్ పునరుద్ధరణలు కూడా నిబంధనల ప్రకారం పూర్తిగా ఆన్‌లైన్‌లోనే నిర్వహించాలని ఆదేశించారు.గర్భిణుల సంక్షేమం, తల్లి-శిశు ఆరోగ్య పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా వైద్యాధికారి డా. పవిత్ర, ప్రోగ్రాం అధికారి లక్ష్మీ భవాని, డిప్యూటీ డీఎంహెచ్‌వో డా. శ్రీరాములు, వైద్యాధికారులు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# తె.యూ.ఆర్ట్స కళాశాలలో డా.ఏ.పి.జె.అబ్దుల్ కలాం వర్ధంతి వేడుకలు




**నిజామాబాద్ , జులై 27, నేటి శుభోదయ :** తెలంగాణ విశ్వవిద్యాలయం ఆర్ట్స కళాశాలలో భారత మాజీ రాష్ట్రపతి,"మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా"గా ప్రసిద్ధి చెందిన డా.ఏ.పి.జె.అబ్దుల్ కలాం వర్ధంతిని విద్యార్థులు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమం ద్వారా ఆయన జీవిత గాధ,దేశ నిర్మాణంలో చేసిన సేవలు,యువతకు ఇచ్చిన ప్రేరణను స్మరించుకున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.లక్ష్మణ చక్రవర్తి హాజరై ప్రసంగిస్తూ డా.కలాం సాధారణ జీవనం,విజ్ఞాన శాస్త్రంలో చేసిన కృషి,దేశాభివృద్ధికి ఆయన చూపిన దారిని వివరించారు.విద్యార్థులు ఆయన ఆలోచనలు,విలువలను అనుసరించి ముందుకు సాగాలని ఆయన విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో డా.కె.వి. రమణా చారి,డా.ఖవి,డా.సి.హెచ్.శ్రీనివాస్,డా.తాహేర్,శ్రీ దత్తహరి లు పాల్గొన్నారు.వివిధ విభాగాల విద్యార్థులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని,ప్రసంగాలు,నివాళులు అర్పించారు.కార్యక్రమం ముగింపులో విద్యార్థులు డా.కలాం ఆశయాలను కొనసాగిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

# రేపు శాఖాంబరిగా దర్శనం ఇవ్వనున్న శ్రీ మహాలక్ష్మి

**మంథని, జులై 27, నేటి శుభోదయ :**
ఆషాడశుద్ధ పౌర్ణమి ( గురు పౌర్ణమి ) పర్వదినమును పురస్కరించుకొని బుధవారం మంథని పట్టణంలోని శ్రీ మహాలక్ష్మి దేవాలయంలో "శాఖాంబరి" ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు మారుపాక ప్రశాంత్ తెలిపారు. ఉదయం 4 గంటలకు అమ్మవారికి అభిషేకం, 6 గంటలకు అర్చన అనంతరము శ్రీ మహాలక్ష్మి అమ్మవారిని శాఖాంబరిగా అలంకరించిన అనంతరం ఉదయం 9:30 గంటలకు అమ్మవారు శాఖాంబరిగా భక్తులకు దర్శనం ఇవ్వనున్నారని ఆయన తెలిపారు. ఆలయంలో నిర్వహించనున్న శ్రీ లలితా సహస్రనామ పారాయణం కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని ఆయన కోరారు.శాఖాంబరి దేవి వృత్తాంతం :పూర్వం హిరణ్యాక్షుని వంశంలో దుర్గముడు జన్మించాడు. అతడు రాక్షసుడు. పరమ నీచ ఆలోచనలు కలిగిన వాడు. వాడికి ఒక దురాలోచన కలిగింది. వేదములను అపహరిస్తే వాటి బలంతో జీవిస్తున్న దేవతలు నశిస్తారని తలచి హిమాలయాలకు వెళ్లి వెయ్యి సంవత్సరాలు ఉగ్రత తపస్సు చేస్తాడు. అతని తపస్సుకు బ్రహ్మ ప్రత్యక్షమై ఏమి వరము కావాలో కోరుకోమనగా పరమ నీచుడైన రాక్షసుడు బ్రాహ్మణుల వద్ద ఉన్న వేదములు వేద మంత్రములు తనకు కావాలని, దేవతలకు అపజయం కలవాలని కోరుకుంటాడు. బ్రహ్మదేవుడు అతడికి వరమిచ్చి వేదాధ్యయనము, చెప్ప హోమాదులు వదిలి వెళ్లారు. బ్రాహ్మణులు హోమాదులు మానేయడం వల్ల తమకు అందవలసిన హవిర్భాగములు అందక దేవతలు శక్తిహీనులయ్యారు. యజ్ఞాలు తపాలు జపాలు లేక ప్రకృతి ధర్మం నశించింది. వానలు కురవలేదు పంటలు పండలేదు. అనావృష్టి వలన పశుపక్షాదులు, మానవులు ప్రాణాలు వదిలారు. భూమి మృత కళేబరాలతో దుర్భరం అయింది. ఆ సమయంలో బ్రాహ్మణులు హిమవత్ పర్వతానికి వెళ్లి ఆ పరాశక్తి మాతను ప్రార్థించారు. అమ్మవారు కనికరించి తొలకరి



మబ్బు వంటి శరీర ఛాయ, నూతన కన్నులు, కోటి సూర్యుల, దివ్య తేజస్సు, లోకోత్తరమైన లావణ్యములతో ప్రత్యక్షమైంది. ఆ తల్లి చేతులలో మధుర రసభరితమైన ఫలాలు, రకరకాల భక్ష బొజ్జ పదార్థాలు ధరించి దర్శనమిచ్చింది. ఆమె కళ్ళు పూర్ణ కుటుంబాలు లాగా ఆ కళ్ళ నుండి 9 రోజులు ఏకధారగా కారిన నీటితో ఓష దులన్నీ జీవకర్తో నిండినవి. నదీనధాలు, చెరువులు జలకళతో నిండినవి. జగత్తు మొత్తం చల్లబడింది. ఆమె శరీరం నుండి ఫల శాఖ సమూహములు, అన్న ప్రాణామృగములు ఆవిర్భవించాయి. లోకములోని కరువు రూపుమాపబడింది. అందుకే ఆమె శాఖాంబరిగా కీర్తించబడినదని శ్రీ దేవి భాగవతంలోని సప్త మస్కందములో తెలుపబడినది. ఆ దేవి అనుగ్రహించిన 9 అవతారంలలో శాకాంబరీ దేవి అవతారం ఒకటిగా పేర్కొనబడినది.

# జిల్లా ఎస్సీ సెల్ కార్యవర్గ సభ్యులు ఎన్నిక



**వరంగల్ , జూలై 27, నేటి శుభోదయ :** వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా మరియు మండల కమిటీల ఏర్పాటు ప్రక్రియలో భాగంగా నాయకత్వ ఎంపిక, దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి.ఈ కార్యక్రమం టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర చైర్మన్, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ డిపార్ట్మెంట్ జిల్లా అధ్యక్షులు చిలువేరు శ్రీనివాస్ ఆధ్వర్యంలో వరంగల్ డీసీసీ అధ్యక్షులు మహమ్మద్ అయ్యుబ్, వర్ధన్నపేట ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు,ఎస్సీ విభాగం ఎన్నికల ఇన్‌చార్జిలు ముఖ్య అతిథులుగా హాజరై పార్టీ బలోపేతంపై దిశానిర్దేశం చేశారు. ఈ కమిటీలో భాగంగా జిల్లాలోని 11 మండలాలు పర్యటించి,మండల కమిటీలు జిల్లా కార్యవర్గ సభ్యులను ఎన్నుకోవడం జరిగిందని శ్రీనివాస్ తెలిపారు.జిల్లా కమిటీలో ఉపాధ్యక్షులు 08 మంది, ప్రధాన కార్యదర్శిలు 03, కార్యదర్శులు 13, కార్యవర్గ సభ్యులు 03 రితో ఎన్నుకోవడం జరిగిందన్నారు.ఈ కమిటీలో ఎన్నికైన సభ్యులకు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు చేతుల మీదుగా నియక పత్రాన్ని అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ...: గ్రామ స్థాయి నుండి పార్టీని మరింత పటిష్టం చేయడం, ఎస్సీ వర్గాల అభ్యున్నతికి కృషి చేయడం మరియు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం ఈ నూతన కమిటీల ప్రధాన ఉద్దేశమన్నారు.రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ప్రజలంతా కాంగ్రెస్ వైపే చూస్తున్నారని వారు ధీమా వ్యక్తం చేశారు ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలాగా కాపాడుకుంటానని హామీ ఇచ్చారు.

నేటి శుభోదయ
మంగళవారం | హైదరాబాద్
28 - 07 - 2026
www.netisubhodaya.com



# మృతుల కుటుంబాలకు
## కోటి రూపాయలు పరిహారం చెల్లించాలి





**ఖమ్మం, జులై 27, నేటి శుభోదయ :** నీట్ పరీక్షా పేపర్ లీకేజీ కారణంగా ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు ఒక్కొక్కరికి కోటి రూపాయల చొప్పున పరిహారం చెల్లించాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు డిమాండ్ చేశారు. 21 మంది విద్యార్థుల ఆత్మహత్యకు మోడీ ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. సోమవారం సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో మృతి చెందిన విద్యార్థుల ఆత్మశాంతి కోరుతూ విద్యా విధానంలో –సమూల మార్పులు తీసుకు రావాలని డిమాండ్ చేస్తూ కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. పెద్ద సంఖ్యలో –విద్యార్థులు, పార్టీ కార్యకర్తలు అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. నివాళి అనంతరం బాగం హేమంతరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల పోరాట ఫలితంగా కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారని రాజీనామాతో సరిపెట్టకుండా ఢిల్లీలో విద్యార్థులు, యువతపై లాఠీచార్జ్ చేసిన పోలీస్ చర్యపై సమగ్ర విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. భయపెట్టడం ద్వారా, హింసించడం ద్వారా బిజెపి ప్రభుత్వం యువత, విద్యార్థుల గొంతు నొక్కే ప్రయత్నం చేసిందని పట్టుదలతో అవిశ్రాంతంగా పోరాడి విద్యార్థులు ప్రభుత్వం మెడలు వంచారన్నారు. విద్యార్థులకు సంబంధించి అనేక కేసులు నమోదు చేశారని –ఒక్క ఢిల్లీలోనే కాకుండా దేశ వ్యాప్తంగా విద్యార్థులు, యువజనులపై కేసులు నమోదు చేశారని ఆ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని హేమంతరావు డిమాండ్ చేశారు. బిజెపి ప్రభుత్వం విద్యారంగంలో పలు మార్పులు తీసుకు వచ్చిందని చరిత్రకు తూట్లు పొడిచి పసి మెదళ్లకు మతోన్మాదం ఎక్కించే ప్రయత్నంలో భాగంగా పాఠ్యాంశాలను రూపొందించారని దీనిని తక్షణం రద్దు చేయాలని, నూతన విద్యా విధానానికి రూపకల్పన చేయాలని హేమంతరావు కోరారు. కేవలం ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో సరిపెట్టకుండా విద్యా విధానంపై, ఉద్యోగ, ఉపాధి కల్పన రంగాలపైన ప్రభుత్వం దృష్టి సారించాలని అంత వరకు దేశ వ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతూనే ఉంటాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు, మహ్మద్ సలాం, జిల్లా కార్యవర్గ సభ్యులు –శింగు నర్సింహారావు, తాటి వెంకటేశ్వరరావు, రామాంజనేయులు, రావి శివరామకృష్ణ, మిడికంటి వెంకటరెడ్డి, యానాలి సాంబశివరెడ్డి, ఏనుగు గాంధీ, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య, –ఎస్టియు జిల్లా కార్యదర్శి ఎస్ కె కరీం, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు చింతల రమేష్, మద్దోజు శ్రవణ్, ఇటికాల రామకృష్ణ, మడుపల్లి లక్ష్మణ్, మనోజ్, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పుచ్చకాయల సుధాకర్, తాటి నిర్మల, –ఎస్ కె సైదా, జ్వాలా నర్సింహారావు పాల్గొన్నారు.

# షాద్‌నగర్ చౌరస్తా విస్తీర్ణ పనులు ప్రారంభం





**షాద్‌నగర్ , జులై 27, నేటి శుభోదయ :** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణం మెయిన్ చౌరస్తా ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న షాద్‌నగర్ పట్టణ చౌరస్తా విస్తరణకు ఎట్టకేలకు శ్రీకారం చుట్టారు. వాహనదారుల నిరీక్షణకు తెరపడగా.. రహదారి విస్తరణ కోసం పోరాటం చేసిన ప్రతి ఒక్కరి కాంక్ష నెరవేరినట్లయింది. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చొరవతో చౌరస్తా విస్తరణ పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఆర్డీవో సరిత, ఏసీపీ లక్ష్మీనారాయణ, మున్సిపల్ కమిషనర్ సునీతారెడ్డి, మండల తహసిల్దార్ నాగయ్య, సిఐ సీతారాం ఆధ్వర్యంలో అధికారులు, పోలీసులు కలిసి విస్తరణ పనులను చేపట్టారు. మున్సిపల్, పోలీసు, రెవెన్యూ, విద్యుత్తు, ఆర్ అండ్ బి తదితర శాఖలకు చెందిన అధికారులు ఈ కూల్చివేతల కార్యక్రమంలో పాల్గొంటున్నారు. స్థానిక పరిగి రోడ్డులోని పోచమ్మ ఆలయం నుంచి విస్తరణ పనులను ప్రారంభించారు. జేసీబీల సహాయంతో రోడ్డుకు ఇరువైపులా 50 అడుగుల పరిధిలో ఉన్న ఆక్రమణలను తొలగించే ప్రక్రియను అధికారులు చేపట్టారు. పట్టణంలోని నలువైపులా ఉన్న ఆక్రమణలను దశలవారీగా తొలగిస్తూ.. చివరగా ప్రధాన పట్టణ కూడలిలోని ఆక్రమణలను కూడా తొలగించి చౌరస్తాను విస్తరించాలనే లక్ష్యంతో అధికారులు ముందుకు సాగుతున్నారు. విస్తరణ పనులకు శ్రీకారం చుట్టడంతో పలువురు వ్యాపారులు స్వచ్ఛందంగా సహకరిస్తూ తమ దుకాణాల ముందు ఉన్న ఆక్రమణలను తొలగించుకుంటున్నారు. అయితే మరికొందరు వ్యాపారులు తమకు కొంత సమయం ఇవ్వాలని అధికారులను కోరుతున్నారు. అందరి సహకారంతో విస్తరణ పనులను పూర్తిచేయాలని అధికారులు భావిస్తున్నారు.మరోవైపు చౌరస్తా విస్తరణ పనులు ప్రారంభం కావడంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న తమ కల ఇప్పుడు నెరవేరుతోందని, చౌరస్తా విస్తరణ పూర్తయితే పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు తగ్గడంతో పాటు రోడ్డు ప్రమాదాలు కూడా తగ్గే అవకాశం ఉందని వారు అభిప్రాయపడుతున్నారు. ఈనాటి లక్ష్యం.. ఏనాటిదో.. షాద్‌నగర్ పట్టణ కూడలిని విస్తరించాలనే లక్ష్యం ఈనాటిది కాదు. షాద్‌నగర్ జాతీయ రహదారి బైపాస్ ఏర్పాటు చేసినప్పటి నుంచే పట్టణ కూడలి విస్తరణపై ప్రతిపాదనలు ఉన్నాయి. గతంలో ఎమ్మెల్యే శంకర్రావు పట్టణ కూడలి విస్తరణతో పాటు పట్టణం మీదుగా ఫ్లైఓవర్ నిర్మాణానికి ప్రతిపాదనలు చేసినప్పటికీ, అప్పట్లో వ్యాపారులు అంగీకరించకపోవడంతో ఆ ప్రతిపాదనలు ముందుకు సాగలేదు. అనంతరం గత ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ కూడా కొత్తూరు నుంచి షాద్‌నగర్ వరకు పాత జాతీయ రహదారి విస్తరణ సమయంలో పట్టణ కూడలి విస్తరణ ప్రతిపాదనను తెచ్చారు. అయితే వ్యాపారుల అభ్యంతరాలతో ఆ ప్రతిపాదన కూడా కార్యరూపం దాల్చలేదు. పట్టణ కూడలి నుంచి అన్నారం వరకు రహదారి పనులు పూర్తికాకపోవడానికి కూడా ఈ సమస్య ఒక కారణంగా మారింది.వీర్లపల్లి శంకర్ ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన అనంతరం పాత జాతీయ రహదారి విస్తరణతో పాటు పట్టణ కూడలి విస్తరణకు కూడా ప్రతిపాదనలు తీసుకొచ్చారు. అయితే దాదాపు ఏడాదిన్నర కాలంగా ఈ ప్రతిపాదన కొనసాగుతున్నప్పటికీ వ్యాపారుల అభ్యంతరాలు, ఒత్తిళ్ల కారణంగా పనులు ముందుకు సాగలేదు.ఇటీవల కాలంలో పట్టణ కూడలిలో చోటుచేసుకున్న వరుస రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ సమస్యల నేపథ్యంలో వాహనదారుల నుంచి చౌరస్తా విస్తరణకు డిమాండ్లు పెరిగాయి. పలువురు వాహనదారులు, ప్రజలు ఆందోళనలు కూడా నిర్వహించారు. దీంతో ఎట్టి పరిస్థితుల్లోనైనా చౌరస్తా విస్తరణ చేపట్టాలని అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్ణయించారు. ఇటీవల ఆర్డీవో సరిత మున్సిపాలిటీలో నిర్వహించిన సమావేశంలో విస్తరణకు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకోవడంతో సమస్య ఒక కొలిక్కి వచ్చింది.తాజాగా సోమవారం విస్తరణ పనులు ప్రారంభం కావడంతో ఈసారి చౌరస్తా విస్తరణ కార్యక్రమం విజయవంతంగా పూర్తవుతుందనే నమ్మకం వాహనదారులు, పట్టణ ప్రజల్లో వ్యక్తమవుతోంది. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పట్టణ కూడలి విస్తరణ పూర్తయితే షాద్‌నగర్ పట్టణంలో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు..

# ఫామ్‌పాండ్లు,వ్యక్తిగత సోక్‌పిట్ల గుర్తింపును వేగవంతం చేయాలి



**ఏన్కూర్, జులై 27, నేటి శుభోదయ :** ఏన్కూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో డిప్యూటీ సీఈఓ శ్రీనివాసరావు ఫామ్‌పాండ్లు, వ్యక్తిగత సోక్‌పిట్ల గుర్తింపు ప్రక్రియపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గుర్తింపు పనులకు సంబంధించిన డెస్క్‌వర్క్‌ను పరిశీలించి, పనుల పురోగతిపై అధికారులతో చర్చించారు.ఈ సందర్భంగా డిప్యూటీ సీఈఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ....మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద అమలు చేస్తున్న ఫామ్‌పాండ్లు, వ్యక్తిగత సోక్‌పిట్ల కోసం గ్రామాల వారీగా ఐదు ఎకరాల లోపు భూమి కలిగిన అర్హులైన రైతులను గుర్తించాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. అర్హుల ఎంపికను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించి, క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన అనంతరం వివరాలను నమోదు చేయాలనీ ఆదేశించారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ భాగ్యశ్రీ, ఏవో నరసింహారావు,ఎంపీఓ జి.వి.ఎస్. నారాయణ,ఏపీఓ సూరయ్య, ఏఈఓలు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# మహంకాళి బోనాలకు మంత్రి శ్రీధర్‌బాబుకు ఆహ్వానం



**మంథని/హైదరాబాద్, జులై 27, నేటి శుభోదయ :** సికింద్రాబాద్‌లోని శ్రీ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి ఆషాఢమాస బోనాల ఉత్సవాలకు హాజరుకావాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసన వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును శ్రీ ఉజ్జయినీ మహంకాళి దేవస్థానం పాలకమండలి సభ్యులు ఆహ్వానించారు. సోమవారం హైదరాబాద్‌లోనీ సచివాలయంలో మంత్రిని కలిసి బోనాల ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఉత్సవాలకు విచ్చేసి అమ్మవారి ఆశీస్సులు పొందాలని పాలకమండలి సభ్యులు మంత్రిని కోరారు.

# ఎస్ఐఆర్ పై అవగాహన సదస్సు కార్యక్రమం



**వైరా , జులై 27, నేటి శుభోదయ :** వైరా రింగ్ రోడ్ సెంటర్ నందు కాంగ్రెస్ పార్టీ నాయకులు అవగాహన కార్యక్రమాన్ని రాందాస్ నాయక్ ఆదేశానుసారం నిర్వహించారు ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పార్లమెంటు ఇన్చార్జి రాఘవ వైరా అసెంబ్లీ నియోజకవర్గం ఇన్చార్జి గంగదేవుల లోకేష్ యాదవ్డీసీసీ డాక్టర్ మెడికల్ సెల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కాప మురళీకృష్ణ హాజరుఅయ్యారు. మీరు మాట్లాడుతూ ఓటు హక్కు అనేది చాలా విలువైనది అలాగే ప్రతి ఒక్కరూ తమ యొక్క ఓటు హక్కును కాపాడుకోవాలి ఏ ఒక్క ఓటు తొలిగిపోకుండా నాయకులు కార్యకర్తలు చూడాలి అని వారి పేర్కొనడం జరిగింది. ఈ యొక్క ఓటర్ అవగాహన సదస్సు కార్యక్రమంలో వైరా పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఏదునూరు సీతారాములు, ఆధ్వర్యంలో జరిగింది , సర్పంచ్ ల సంఘం అధ్యక్షులు శీలం చంద్రశేఖర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు వీరం శెట్టి సీతారాములు, పాలేటి నరసింహారావు, కన్నెగంటి నగేష్,గరిడేపల్లివెంకటేశ్వర్లు,మట్టూరి కృష్ణారావు,వాంకుడోత్ బి క్యా ,ఖమ్మం మీరా, ఒకటో వార్డు కౌన్సిలర్ మోర్ శ్రీకాంత్ ,ధర్నా రాజశేఖర్,సయ్యద్ అన్వర్,ఒకటో వార్డు అధ్యక్షుడు బుడికి వెంకన్న ,వేముల రత్నాకర్, డీజే మున్న ,తోటకూర శ్రీకాంత్, షేక్ వద్దండు, ఉయ్యూరు నాగేశ్వరరావు, జాకోబ్, నారపోగు రవి ,దురిశెట్టి నరసింహారావు, తేల్లూరి వీరయ్య, షేక్ సైదులు, తోటకూర శ్రీకాంత్, కంభంపాటి సత్యనారాయణ, తేజావత్ స్వామి ,షేక్మహమూద్ ,ఆవుల రవి ,తదితరులు ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొన్నారు

# రెండు నెలల వేతనం.. పేద కుటుంబాలకు నిత్యావసర సరుకుల పంపిణీ



**మంథని, జులై 27,, నేటి శుభోదయ :** మంథని పట్టణంలోని 6వ వార్డు కౌన్సిలర్ పోతరవేని శ్రీలత క్రాంతి కుమార్ తనకు వచ్చిన రెండు నెలల కౌన్సిలర్ వేతనాన్ని పేదల సంక్షేమానికి వినియోగించారు. బోయిన్‌పేటకు చెందిన నాలుగు నిరుపేద కుటుంబాలకు బియ్యం, కిరాణా సామగ్రితో పాటు నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు.ఎన్నికల సమయంలో ప్రతి నెల కౌన్సిలర్ వేతనాన్ని ప్రజలకే వినియోగిస్తానని ఇచ్చిన హామీ మేరకు ఈ సేవా కార్యక్రమం చేపట్టినట్లు ఆమె తెలిపారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం ప్రజాప్రతినిధిగా తన బాధ్యత అని పేర్కొన్నారు.స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన తర్వాత కూడా ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నానని, భవిష్యత్తులో కూడా పేద కుటుంబాలకు అండగా నిలుస్తూ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తానని శ్రీలత క్రాంతి తెలిపారు. బోయిన్‌పేట అభివృద్ధి, వార్డు ప్రజల సంక్షేమమే తన ప్రధాన లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు.

# అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయండి



**నిజామాబాద్ , జులై 27, నేటి శుభోదయ :** నగరంలోని పలు రోడ్లు,వంతెనల అభివృద్ధి పనులకు సంబంధించి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ కోరారు.రోడ్లు,భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని సోమవారం హైదరాబాదులోని సచివాలయంలో కలిసి ప్రతిపాదనలను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..నగరంలోని దేవీ రోడ్డు,రైల్వే స్టేషన్,నాందేవ్ వాడ వంతెన పొడిగింపు(అదనపు పనులు)చేయాలని కోరడం జరిగిందన్నారు.ప్రధానంగా ఈ రైల్వే లైను దాటడానికి విజయ థియేటర్,నాందేవ్ వాడ వంతెన వద్ద కేవలం రెండు మార్గాలు మాత్రమే ఉన్నాయని ఈ నేపథ్యంలో సోనీ ఫంక్షన్ హాల్ సమీపంలో ఎల్లమ్మ గుట్ట వద్ద మరొక రైల్వే రన్వే ఏర్పాటు చేయడం అత్యంత ఆవశ్యకమన్నారు.ఇందుకోసం రూ.170 కోట్లు మంజూరుకావాలన్నారు.అలాగే నిజామాబాదులోని రేడియో స్టేషన్ నుంచి ముదక్పల్లి పాత జిపి ఆఫీస్ వరకు రూ.30 కోట్లతో ఆర్ అండ్ బీ రోడ్డు కోసం ప్రతిపాదించడం జరిగింది.అలాగే వర్ని జంక్షన్ నుంచి నిజామాబాద్,డిచ్పల్లి,ఇందల్వాయి,భీమ్గల్ మీదుగా కమ్మర్పల్లి వరకు 107 కిలోమీటర్ల పొడవుతో కొత్త జాతీయ రహదారి ప్రతిపాదనను అందజేయడం జరిగింది.

Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620